
# నాగమల్లికలు



బడుద్ధాయి మహాపురుషు డవుతాడు." భార్యకు నచ్చచె
బయటికి వెళ్ళిపోయాడు. సాధన ఆలోచిస్తూ ఉండిపోయిం
తలుపులు టక, టక మన్నాయి. స్టైలుగా కూర్చుని "కమిన్"
అంది. తలుపు తీసుకుని శివరాం వచ్చాడు.

"నమస్కారం బావగారూ...." లేవబోయింది.

"ఫరవాలేదు. కూర్చో" అతను కూర్చుని సిగరెట్
వెలిగించాడు.

"కోల్డా, హాటా....బీరా....బ్రాందా!"

"అవేంవద్దు. చల్లని మంచినీళ్లు తెప్పించు" అన్నా

"బీదవారమని సందేహిస్తున్నారా?"

"అదేంలేదు. చక్రపాణి తెలుసుకుంటే ఏదైనా చేయ
గలడు."

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఊం. బెంగుళూరు లైఫ్ యెలా ఉంది?"

"నాలాంటివారికి యెక్కడయినా ఒక్కటే. మీలాం
సరదామనుష్యులకు అందాలు కన్పిస్తాయి. రత్నను తీసు
రాలేదేం? పెంకితనము వదిలిందా?"

"రేపువస్తుంది. నువ్వేచూడు. నాతో అర్జెంటుగా
మాట్లాడాలి రమ్మని ఎక్కడకు జారుకున్నాడీ మహాశయుడు"

"ఏదో పనిఉండి వాళ్ళ మేజరు బంధువులు యెవ
ఉన్నారట. అదే మీరేదో పొలం అమ్ముతున్నారట. పీలుం
కొందామని వారి ఉద్దేశం."

"అవును సాధనా! నాన్నగారు హఠాత్తుగా చెప



వాటాలు వారికి పంచియిచ్చారు. నాకొచ్చింది దూర
భారంగా ఉంది. ఏలలేనివాడికి ఏడ్గురు భార్యలని. ఊర్లో
పున్నదే చేయించలేకపోతున్నాము. వ్యవసాయం ఒక్కటే
నమ్ముకుంటే చాలాకష్టం. కాయకూరల పంటంతా నాశనం
అయింది. పెట్టుబడి గిట్టేదియెలా? అందుకే వ్యవసాయంచేస్తూ,
ఏదైనా వ్యాపారంలాంటిది చెయ్యాలనిఉంది. దానికి డబ్బు
కావాలిగా, అందుకే ఈ పొలం అమ్ముతున్నాను."

"పొలాలు అమ్ముకుంటే మళ్ళీ కొనగలమా బావా!"

"అలా ఆలోచించే ఆస్థిపరులు పొలాలు పడావులు
పెడుతున్నారు. ఆహారధాన్యం కొరత ఏర్పడుతుంది. దున్నలేని
పొలాలు దున్నుకునేవారికి కిస్తేనేం? మనము దానం చెయ్యటం
లేదు, ధరకే యిస్తున్నాము."

"సదుద్దేశమే బావా! అందరూ ఇలా ఆలోచిస్తే సమ
స్యలు ఉండవు. అయినా మారత్న అఖండురాలు. మిమ్మల్ని
పూర్తిగా మార్చివేసింది."

"మీచెల్లిని మీరే మెచ్చుకోవాలి." అతను నవ్వాడు.

"మీకు దానిపట్లగల అభిమానము ఆ నవ్వే చాలు
తుంది. సంతోషం బావా! మరి మీ రమ్మదలచిన పొలం ధర
చెప్పారుకారు?"

"లక్షరూపాయల ఆఫర్ రెడ్లవద్దనుండి వచ్చింది. ఆ
పైన యెవరు యెక్కువపలికితే వారికి ఉంటుంది...."

"లక్షా! మేం వేలలో ఉం దనుకున్నాము."

"లక్ష యెవరికీ నష్టంలేని ధర సాధనా! నా కవసరం
కాబట్టి. మరోసంవత్సరం ఆగితే రెండింతలు వస్తుంది.

"అంత ధర పెట్టలేరేమోలే బావా!"

"ఇంకెవరయినా భాగస్తులు కలిస్తే కలుపుకోండి. మనము బంధువులం. మీరుకొంటే మూడోవంతు యిచ్చి మిగిలింది నెమ్మదిగా ఇవ్వండి."

"ఆయనతో చెబుతాను బావా! ఇంతకీ ఏంవ్యాపారం చేద్దామని?"

"నా స్నేహితుడి తమ్ముడు ఇంజనీరింగు పాసయి, ఊర్కే ఉన్నాడు. రేడియో రిపేరింగ్ షాప్ ఓపెన్ చెయాలి, లేదా సిమెంటు పైపులు చేద్దామని ఆలోచన."

"మంచిదే" బాయ్‌ని పిలిచి కూల్ డ్రింకులు తెమ్మన్నది. అవి రాగానే త్రాగేసి సెలవు తీసుకున్నాడు.

శివరామ్ బయటికి వచ్చేసరికి చక్రపాణి యెదురు వచ్చాడు. అతను హడావుడిగా వస్తున్నాడు

"అమ్మయ్య! కలుసుకున్నా. మీరు వచ్చి వెళ్ళిపోయారనుకున్నాను."

"మరదలుతో మాట్లాడుతూ కూర్చున్నాను."

"ఏం మాట్లాడిందో! రండి, డ్రింక్సు తీసుకుందాం."

"సాధన ఇప్పుడే తెప్పించి ఇచ్చింది. భలేగా మ[illegible]పోయింది. బెంగుళూరు వాతావరణం బాగా వంటబట్టినట్టుంది." అన్నాడు సిగరెట్టు వెల్గించుకుంటూ.

"అవునవును.... మళ్ళీ యెప్పుడు దర్శనము. రేపు రాకూడదూ?"

"తప్పకుండా. రత్నకూడా రావాలనుకుంది." యెందుకో చక్రపాణి ముఖం మాడిపోయింది.



మన్నాడు రత్న, శివరామ్ వచ్చి, అదే హోటల్లో రూమ్ బుక్ చేసుకున్నారు. కుర్చీలో కూర్చుని సిగరెట్టు వెల్గించాడు.

"చెప్పు.... తరువాత ఏంచేద్దామంటావు?"

"రజనక్కను చూడటం, సాధనతో సరదాగ తిరిగి, రేపు అమ్మదగ్గ కెళ్లాము." అన్నది. చక్రపాణి వాళ్ళు యెక్కడికో వెళ్ళారు. శివరామ్ భార్యను రజనిదగ్గర వదిలి తనపనులు చూసుకోసాగేడు. సాయంత్రము హోటల్‌కు తిరిగి వచ్చాడు. చక్రపాణి యెదురు చూస్తున్నాడు.

"ఒక్కరే వచ్చారా?"

"రత్న రజనిగారిదగ్గర ఉంది"

"మంచిదే." చక్రపాణి చాలా రిలీఫ్ అయ్యాడు. ఇద్దరూ రెస్టారెంటులో కూర్చున్నారు.

"పొలమువిషయము ఏమాలోచించారు?"

"నిన్ననే సాధనకు అర్థంచేశానుగా!" అన్నాడు. కాఫీ త్రాగారు. ఇది పనికాదనుకుని అతన్ని పరాసరి పైకే తీసుకుపోయి రెండు విస్కీబాటిల్సు, సోడాబుడ్లు ముందుపెట్టాడు.

"వద్దండీ! మేం తీసుకోవటం లేదు."

"భలేవారుగనుక.... మీరుకాకపోతే యెవరు తీసుకుంటారు? మాలాంటివారము తీసుకున్నా శోభించదు. మాకు మెస్సునుండి చాలా చవకధరకు వస్తుందండీ. ఈ ఒక్కరోజు తీసుకోండి. లైఫ్ మీలాంటివారే ఎంజాయ్ చేయాలి. నిజంగా మిమ్మల్ని తలుచుకోనిరోజు లేదనుకోండి. సాధనా, అలా

చూస్తావేం? మీా బావగారికి కలిపియివ్వ...." అతని ఆ వింటూనే సాధన విస్కీ కలిపి యిచ్చింది. ఎంతటి బలవంతు యినా, ముఖస్తుతికి లొంగనివారుండరు. మదిరా—మదవతి చూచి ఉవ్విళ్ళూరనివా రుండరు. ఒకగ్లాసు త్రాగి సాధనవై చూచాడు. ముక్కుపొడుంరంగు చీర తెల్లని ఒంటిపై వె వెలబోతుంది. స్లీవ్‌లెస్ జాకెట్టు, నాల్గు అంగుళాల మే మాత్రమే వుంది. చేతికి పాములా మెలికలు తిరిగిన అమ్ పెట్టుకుంది. నుదురు కప్పేసేలా దువ్వుకుని ముడివేసుకు అలా ఆమెను మత్తుగా చూస్తుంటే అతనికి మతిపోతుం చక్రపాణి ఒక్కనిమిషం భార్యతో గుసగుసలాడినాడు.

"మంచి అదును. అతన్ని ఒప్పించి ఈ కాగితాలపై సంతకం పెట్టించు."

"ఒంటరిగా నే.... అమ్మో...." అంది.

"మరేం ఫరవాలేదు. అతను నిన్ను మింగడులే" విసుక్కుని శివరాం దగ్గరగా వచ్చాడు. "అర్జంటుగా ఓ మిత్రు డిని కలుసుకోవాలి. మీారేం అనుకోరుకదూ! ఇది మీా ఇ అనుకోండి." చెప్పి బయటకు వెళ్ళిపోయాడు. సాధనకు ఛ్యా తిరుగుతున్నా చెమటలు పడుతున్నాయి. ఎలా తప్పించు కోవటం? ఏమయినాసరే ఈభూమి ఏట్లోకలిసినా తను ఇ గదు. అతనిచ్చిపోయిన స్టాంప్ కాగితాలు అక్కడేవున్న చె బుట్టలో పడేసింది.

"సోడా!" శివరాం అరిచాడు.

"జవాబు ఇవ్వకుండా అలాగే కూర్చుంది. అతను మా



మాట లేకుండా సీసాఎత్తి గడగడ త్రాగేశాడు. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. చిన్నగా నవ్వాడు.

"మీారు కూర్చోండి. ఇప్పుడే వస్తాను" లేచింది సాధన.

"ఎక్కడికి? ఈగది, గదిలోని వస్తువులు నావని.... భర్త చెప్పాక ఎక్కడికి వెళ్తావే చిలకా!" అని లేచాడు.

"బావగారూ!" భీతహరిణిలా ఒకవైపు జరిగింది.

"భలేవరస. అయినా భర్త అనుమతించాక అచ్చు పతివ్రతలా మాట్లాడుతావేం?" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"అతను మీాపై నమ్మకంకొద్దీ ఒంటరిగా వదలి వెళ్ళారు."

"నమ్మకమా! అహహా... మీా ఆయనకు అలాంటి పదాలకు అర్థం తెలుసా? సాధనా! బెట్టుయెందుకు?.... మొదట ఈ కాగితాలు ఇలాతే సంతకము పెడతాను."

"వద్దు. నాకు పొలం వద్దు. మీారు వెళ్ళిపోండి...." అంటూ అరిచింది.

"పొలం నీకు అక్కరలేకపోయినా నీవు నాకు కావాలి" రెండు అడుగులు ముందుకు వేశాడు.

"ఆగండి....ఒక్క అడుగు ముందుకు వేసినా మిమ్మల్ని చంపి నేను చస్తాను....ఆగండి" టేబిల్‌పైనున్న బాటిల్ అందు కోయింది.

మెరుపులా శివరాం దాన్నిత్రోసి ఆమెచెయ్యి పట్టి లాక్కున్నాడు. అతని చేతులలో పడిపోయింది. బలవంతుడైన అతనితో పెనుగులాడితే లాభంలేదు అనుకుంది.

"వదలండి........మీ విమలలాంటిదాన్ని......అ మూర్ఖుడు, దురాశాపరుడు. అతని దురాశకు నన్ను చెయ్యకండి...." దీనంగా బ్రతిమాలుతుంది. అంతనిపాలో శివరాం నవ్వాడు. వికటంగా లే దానవ్వు. జాలిగా ఇంతలో తలుపు టక్ టక్ మంది. అతని చేతులలోంచి వులా తప్పించుకుని తలుపు గడియ తీసింది. యెదురుగానిల్చు రత్నను చూచి ధైర్యం తెచ్చుకుంది. ఆమె భుజంపై బావురుమంది. భర్తవాలకం, గదిలోని సీసాలు, సాధన కంపితురాలయి తన చేతులలో వాలిపోవటం అంతా చూ రత్నకు జరిగిందేమిటో అర్థం అయింది.

"ఊర్కో....ఛ ఊర్కో. నీ మహాపురుషుడేడీ?"

"తెలియదు...." అంది సంబాళించుకుని నిలబడు

"మీరు యెంతో మారినట్టు నాముందు నటిస్తా ఇదేనా మార్పు?"

"అదికాదు రత్నా...."

"ఛీ. నన్నా పేరుతో పిలువకు. భర్తవైపోయావు లేకపోతే...." పెదవులు బిగబట్టింది.

"నాకెలాంటి దురుద్దేశం లేదు...."

"ఛీ!" చీత్కారం చేసింది. "నీ భాషలో ఇలాంటి సదుద్దేశాలే" సాధనను నడిపించుకుని తామున్న గదిలోకి పోయింది సాధన పిచ్చిగా చూడడం తప్పితే మరేం లేకపోయింది. రత్న మనసు కుతకుతలాడిపోతుంది. 'నాను నమ్మ రత్నా! ఏక్షణంలో నీకు తాళికట్టానోగానీ, అ రూపమైన క్షణాలు. ఏ స్త్రీని చూచినా నీ అపురూప



దమే గుర్తుకు వస్తుంది. ఆదివరకు నేను యెంత వ్యభిచా టో చెప్పలేను. నీవు ఈ ఇంట్లోకి వచ్చాక మరో స్త్రీని కన్నెత్తి చూడలేదు....' పచ్చని పైరులదగ్గర కూర్చుని ఆయన....తన భర్త శివరామ్....అన్న మాటలు గుర్తుకు తెచ్చుకుని నిట్టూ ది. ఆమె కతనిపట్ల విపరీతమైన అసహ్యము వేసింది. మరె రితోనో కాదు, తన అక్కలాంటి సాధనతోనా! రక్తం సల సల కాగిపోసాగింది. తన్ను తాను సంబాళించుకోవటానికి కూజాడు నీళ్ళు ఎత్తి త్రాగింది.

"లే....ముఖం కడుక్కో...." సాధనను లేపింది. ముఖం కడుక్కొని చల్లటి నీరు త్రాగగానే తేరుకుంది.

"రత్నా!" అన్నది బాధగా.

"ఊఁ...."

"ఇంత దారుణమా?"

"నీ పతిదేవుడిదా....నా పతిదేవుడిదా?"

"నీ చిలిపితనము పోలేదుకదే...." అంత భయంలోనూ నవ్వింది.

"పోనీలే....రజని అక్కకొడుకును చూచావుటే?"

"ఊఁహూఁ! బారసాలకు వద్దామంటే మేజరుగారమ్మాయి పుట్టినరోజని రానివ్వలేదు. హైద్రాబాద్ వచ్చిన దగ్గరనుండి లాలు, పాస అంటూ ఈ హోటల్లో ఖైదు చేశాడు....ఎలా వున్నాడు? బావున్నాడా?"

"చక్కగా బొద్దుగా వున్నాడే....ఈ పగటివేషం వెయ్యటం యెప్పుడు నేర్చుకున్నావే?"

9]

"ఏం చెయ్యాలి. ఆయన పోరుపడలేక...."

"ఊఁ...." రత్న ఆలోచనలోపడింది. "ఏమే చిన్నక్కా! ఒకసారి పసిపిల్లలమైపోతే యెంత బావుండునే....అన్నట్టు అన్నయ్య యెంత మారిపోయాడే. నాకు నిజంగా సంతోషం వేసింది. వాడు ధీమాగా తన ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తుంటే నాకు ఆనందంతో మతిపోయిందే."

"ఆరోజులు వేరు...." ఓ నిట్టూర్పు వదిలింది.

"సాధనా!" అంటూ పాణి వచ్చాడు.

"ఛీ! ఆపేరుతో పిలువకండి." సాధన బుసలుకొట్టింది.

"అస లేంజరిగింది?"

"మీా కేం తెలియదూ....ఇంకా నటిస్తా రెందుకు! వె[ళ్ళి] పొండి.... నేను మా యింటికి వెళ్ళిపోతాను. ప్రేమంటూ, పెళ్ళంటూ బంగారంవంటి భవిష్యత్తు పాడుచేసుకున్నాను—" చేతులలో ముఖందాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"అసలు విషయము చెప్పి ఏడ్వరాదూ?" విసుక్కున్నాడు పాణి.

"నేను చెబుతాను వినండి చక్రపాణిగారూ! భార్య శీలము విలువ మా పొలాలతో ముడివేశారు మీరు. అ[...] సాధన కామోదం కాలేదు. రభస...."

"ఆఁ....ఏదో మంచివాడని నమ్మి నాభార్యను ఒంటరిగా వదిలానుగాని, ఇంత చపలత్వముందని తెలియదు....[...] సంగతేమిటో ఇప్పుడే తేలుస్తాను." వెనుతిరిగి పోబోయాడు.

"నటునలుగా బాగా రాణిస్తారండీ చక్రపాణిగారూ మీా కేం తెలియనే తెలియదు పాపం! ఆయన జీవితం మొ[...]



[...]టో అందరికంటే బాగా యెరిగినవారు మీరు. శీలాన్ని పెట్టించి అయినా పొలం రాయించుకొమ్మని మీరుచెప్పారు. మీ భాషను ఇంకా అలవాటుపడని మీా భార్య అర్థంచేసుకోలేదు...."

"ఈ అవమానము చాలు. రా సాధనా...."

"చేయగాలేని అవమానము నోటితో అంటే వచ్చిందా! అయ్యో పాపం. పాణిగారూ! ఇకనైనా ఈ అవతారాలు చాలించండి. ప్రపంచంలోని ధనవంతులంతా ధనరాసులు నెంటేసుకు చావలేదు, మీరు చావబోవటంలేదు. తెల్సిందా? నీతి నియమాలలో బ్రతుకు నేర్చుకోండి. సానిపనులు, కాని పనులూ అందరినె త్తినా దుద్దకండి. వెళ్ళవే అక్కయ్యా! ఈ దేశంలో ఆడవారమై పుట్టినందుకు అడ్డమైనబాధలూ పడాలి."

"రత్నా! నాకు చచ్చిపోవాలనుందే."

"అది రాసిపెట్టినప్పుడు ఏలాగూ పోతాం. మనబాధలు మనకే ఉండనీ. ఆర్జించిందంతాపోసి అల్లుళ్ళను కొన్నా, కూతుళ్ళకు సుఖంలేదని కన్నవారెందుకేడ్వాలి? అప్పుడు మనమే ఏడుద్దాం. నాకు చాలా విచారం కల్గించే విషయమేమిటంటే నావల్ల నీ కీ అవమానం జరగబోవటం...."

"కాదు....రత్నా! నీవల్లేం జరుగలేదు. అలా బాధపడకు. ఒట్టు." సాధన లేచి రత్ననోరు మూసింది.

"యెందుకే అలా ఇదవుతావు. ఈ అవమానంతో ఇక్కడుండేకంటే ఏ కూలి చేసుకున్నా నయమే. మంచి పరిస్థితులలో అయితే అలాగే చేసేదాన్ని. నాకే సరియైన స్థానం లేదంటే నాకుతోడు మరో...."

"అంతే ....అంతే?...." సాధన రత్నను కౌగలించుకుంది. "అంత సంతోషవార్త చెప్పవేమే!"

"ఎవరికే సంతోషం! నాకేలాంటి సంతోషం లేదు. ఆడదయితే మనలాగే ఈ ప్రపంచంలో ఏడుస్తుంది. మొగవాడయితే అందరి జీవితాలతో ఆడుకుంటూ ఆవారాగా బ్రతుకుతాడేమో! అది నేను భరించలేను.... సంతానమంటే భార్యాభర్తల ప్రేమఫలమే. కామవాంఛల ఫలితంకాదు. తండ్రి పదిమంది స్త్రీలయితే, కొడుక్కి పాతికమంది కావాలి. అవన్నీ చూస్తూ బ్రతికేకంటె గొడ్రాలుగా ఉండటం మేలు...."

"రత్నా!" శివరామ్ గదిలోకి రావటం ఎవరూ గమనించలేదు. అతన్ని చూస్తూనే సాధన ముఖంతిప్పుకుని బయటికి పోయింది. ఆ వెనుకాలే చక్రపాణి జారుకున్నాడు. భార్యాభర్తలు ఇద్దరే మిగిలారు గదిలో. ఒకరినొకరు చూసుకున్నారు. ఇద్దరి చూపులు కోపంగానే ఉన్నాయి. రత్న చూపులలో కోపముతో కూడిన అసహ్యం నిండిఉంది. అతని చూపులలో ప్రాధేయత ఉంది.

"రత్నా! ఒక్కమాట వింటావా?"

"మీరు చెప్పటము నేను వినటము ఇక జరుగని పని." విసురుగా లేచింది. అతను దగ్గరగా వచ్చి ఆమెను పట్టుకున్నాడు.

"రత్నా! మనకు పుట్టే బిడ్డలు....నాలాంటి వాళ్ళు కారు....నీలాంటి గుణాలే వస్తాయి." అతని కెందుకో ఆనందంగా ఉంది. నవ్వబోయి భార్య గంభీరవదనము చూచి ఆగిపోయ్యాడు.



"వదలండి....ఛీ....ఆ వాసనంటే నాకు పరమ అసహ్యము." అతన్ని విదిలించి దూరంగా జరిగింది.

"రత్నా!"

"నన్నలా పిలవకండి—దయచేసి పిలవకండి. మొదటికలాగే ఏయ్....ఓయ్ అనండి....నాకు తల్లిని అవుతానన్న సంతోషం ఏకోశానా లేదు. భగవంతుడు లేడు....ఉంటే....అలా జరుగదు. నేను కోరేదల్లా....ఆబిడ్డ పుట్టకుండాపోతే...."

అంతే. రత్న చెంపలు పటా పటామన్నాయి. తలపట్టి ఊపుతూ, పళ్ళు కొరికాడు. "మళ్ళా మళ్ళా అంటావా?...." అని ఒగర్చుస్తూ అడిగాడు.

"అంటాను. ఒకసారికాదు పదిసార్లు" చెంపలు తడుముకుంటూ జవాబు ఇచ్చింది. అతను రెచ్చిపోయాడు. ఆమె పళ్లు హూనమయింది.

"ఏం! ఈరోజే త్రాగానా....ఆ వాసనంటే అసహ్యమటా...."

"అవును....అసహ్యమే....ఆ వాసనంటే .... మీరంటే కూడాను. మనిషిలో ఏదైనా మానవత్వముందేమో....ప్రేమతో, అనురాగంతో మేల్కొలుపుదామనుకున్నాను....నటించాను, సహించాను ...." ఏడుస్తూ, గాజులు చిట్లి కారిన చేతి రక్తం తుడుచుకుంటూ అంది.

"మళ్ళీ....అను...." పిడికిలి బిగించి ముందుకు వచ్చాడు.

"ఒక్కసారికాదు. పదిసార్లంటాను. చంపుతారు అంతేగా!" నిర్భయంగా నిల్చుంది. అతను ఆగిపోయాడు.

"ఆగిపోయారేం .... చంపండి. మీ పేరున ఎన్ని హత్యలు జరుగుతున్నాయో ఎవడికి తెలుసు? కడుపు వచ్చిన కన్యలు ఎందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో! పిల్లల దుర్గతికి చింతించి ఎందరు తల్లితండ్రులు మరణిస్తున్నారో! వారిలో నేనొకదాన్ని. త్రాగండి. కన్పించిన స్త్రీని తెచ్చుకోండి.... ఆడండి, పాడండి. నాజోలికి రావద్దు. మీ ఇంట్లో జీవచ్ఛవంలా బ్రతికేకంటె చావడం మేలు. తన ఆశలు నాపైనే పెట్టుకుని బ్రతికే అమ్ముంది. ఆమెకోసం బ్రతికా[illegible] ఇప్పటికే కాలిన ఆమె హృదయం ఇంకా కాల్చటం నా అభిమతంకాదు...."

అతను త్వరగా వెళ్ళిపోయాడు. ఆమె అలా దిక్కు[illegible] ఎంతసేపుందో?

"అమ్మా! అయ్యగారు త్వరగా వెళ్ళాలట, సామాన్లు క్రిందకు తీసుకురమ్మన్నారు." హోటల్ బాయ్ వచ్చాడు.

"అయిదు నిమిషాలు ఆగిరా." అతనికి తన ఉబ్బి[illegible]యిన ముఖం చూపించలేక పంపివేసింది. అతను వెళ్ళగానే లేచి శుభ్రంగా చన్నీటితో ముఖంకడుక్కుంది. బొట్టుపెట్టుకు[illegible] సామాన్లు ఒక్కచోట పెట్టింది. అసలు తెచ్చినవస్తువుల[illegible] విప్పనేలేదు. ఇంతరాత్రి వెళ్ళాలంటే భయంగా ఉంది. బాయ్ వచ్చి సామాన్లు తీసుకున్నాడు. తనను ఎవరన్నా గమనిస్తున్నారేమోనని తలవంచుకుని త్వరగా దిగింది. ఎవరి గొ[illegible]వలో వారున్నారు. శివరాం సిగరెట్టు కాలుస్తూ కార్లో కూర్చున్నాడు. కుర్రాడు సామాన్లుపెట్టగానే, అతని చేతిలో ఓరూపాయి వుంచి కారు స్టార్ట్ చేశాడు.



"రత్న ఆలోచనలు రజనిపైకి మళ్ళాయి. పాపం, జీవితంతో రాజీపడింది మాచింగ్ లేనిదే బయటికి వెళ్ళని రజని. పూర్తిగా మారిపోయింది అనుకుంది. అతను తెచ్చిన చీరలే కడుతుంది. అతనన్నదే వేదం అంటుంది. ఎవరొచ్చినా వంటిల్లు వదలిరాదు. బి. ఇడి., చేసే ఉద్దేశము మానివేసింది.

"అక్కయ్యా! నేనువెళ్ళి సాధనను పిల్చుకువస్తానే, సరదాగా సినిమాకువెళ్దాం."

"మీరిద్దరూ వెళ్ళండే. బాబు గోలచేస్తాడు...."

"అక్కయ్యా! కలా, నిజమా? సినిమాకు రానని నువ్వు అనటం ఏమిటి?"

"ఎప్పుడూ ఒకేలా ఎలా ఉంటామమ్మా?"

"నీ కిప్పుడు వచ్చిన అడ్డంకి బాబేనా తల్లీ! అయితే వాడిని నేను చూచుకుంటాను సరా."

"నాకు రావాలని లేదు...."

"నాకంపనీ అంటే అంత వెగటువేసిందా? సరే." రత్న మూతిముడిచినది. రజని దగ్గరగావచ్చి అతిప్రేమగా రత్నభుజాలు పట్టుకుంది.

"రత్నా! ఆయన తోడులేకుండా ఎక్కడికి వెళ్ళినా అనుమానము ఆయనకు. అందుకే ఆ సాధింపులు వినలేక, ఆత్మను చంపుకోలేక, వెళ్ళటమే మానివేశానే. నాకంటె ప్రపంచం నీకే బాగా తెలుసు."

"అక్కయ్యా!"

"అపనమ్మకంగా ఉందా? అందుకే శివరామ్ముందుకు

రాంది. యెదిరించి ఇప్పుడు విడాకులు ఇస్తానా చెప్పు. సద్దు
పోవటమే."

"నెమ్మదిగా నచ్చచెప్పరాదూ?"

"అది అసాధ్యమే రత్నం!" గాఢంగా నిట్టూర్చింది
అక్కడ రజనికి సానుభూతిచూపిందిగాని, ఇప్పుడు తనే నిట్టూ
ర్చాలి. మొగవారి వ్యసనాలు మాన్పడం....అంత తేలిక
సాధనతో సరదాగా తిరుగుదామని టాక్సీలో వచ్చింది. తనభ
నైజము ప్రత్యక్షంగా చూచింది... తనకు శివరాం చెయ్యి
తగలగానే ఉలిక్కిపడింది. అతను వంగి అద్దంపైకిచేస్తున్నా
చల్లగాలి వస్తుందన్న ధ్యాసకూడాలేదు తనకు. అతను అద్ద
వేసి తనకేం పట్టనట్టు ముందుకు చూస్తున్నాడు. ఆమె ము
చుకుని కూర్చుంది.

రాత్రి గదిలోకే రాలేదు శివరాం. మర్నాడు ఒళ్ళంత
నలతగావుంది. అలాగే పడుకుంది. లేడీడాక్టరు రాకతో
లేచింది. ఆశ్చర్యంగా ఆమెవంక చూచింది.

"పడుకోండి—" వారిస్తూ ఆవిడే దగ్గరగా వచ్చింది.

"నాకేంలేదు డాక్టరుగారూ—"

"ఆమాట మీవారితో చెప్పండి." నవ్వుతూ రత్న
చేయి పట్టుకుంది. ఏం యెదురుచెప్పక పరీక్ష చేయించు
కుంది.

"ఒకసారి డిస్పెన్సరీకి రండి. మూడు దాటిందని మీరం
టున్నారు. నా కలా అన్పించటంలేదు." ఆవిడ ఏవో మందుల
రాసిచ్చింది. చీటీ అందుకుని బల్లపై పెట్టింది. ఆమెకు నమస్క-



రించి, గది అవతలకు సాగనంపింది. ఓపిక చేసుకుని వంటయింటి
వైపు వెళ్ళింది.

"అమ్మగారూ!" రాము పిలిచాడు.

"ఏమిటి రామూ?"

"చిన్నదొరగారు మిమ్మల్ని గదిలోనే విశ్రాంతి తీసు
కోమన్నారు." అన్నాడు. వాడిమాటలకు పేలవంగా నవ్వు
కుంది.

"నాకేంలేదు రామూ" అన్నది. "ఆయన చెప్పడం.
నేను వినడం కలలోనిమాట—" అనుకుంది.

"ఓహో! క్రొత్తకోడలుగారు పాతకోడలయిందే?"
విమల నవ్వింది. ఆమెవేషం చూసే నవ్వాగలేదు. టైట్
పైజమా, పెద్దపులిచారల కమీజు. జుట్టంతా యెత్తి పోనీటేల్
కట్టింది. బొట్టు కాటుక లేదుగాని, కళ్ళపై బ్లూ రంగు పూసు
కుంది. నడుపలేక నడువలేక నడుస్తుంది.

"అవునుగాని ఆడపడుచుగారూ! ఈ వేషధారణ
ఏమిటి?"

"అంత అసూయగా ఉంటే వేసుకోరాదూ!"

"నాకా, అసూయా! ఈ దుస్తులను చూచావు! నువ్వే
నాచెల్లివయితే చెవులుపిండి చక్కగా చీర కట్టబెడుదును."

"యూ ఫూల్; ఫాషన్లు తెలియకపోతేసరి...." ఇంకా
ఏదో అనబోయి తండ్రి రావడం చూచి గతుక్కుమంది.

"విమలా! ఏమిటితల్లీ ఆ అవతారము!" ఆయన
చిన్నగా మందలించబోయారు. రుక్మిణమ్మ వచ్చింది.

"ఏమయిందిప్పుడు! అది ముచ్చటపడి కుట్టించుకుంది.

ఏమండీ! గద్వాలనుండి యెవరో పెళ్ళిచూపులకు వస్తామ
రాశారుగా."

"అవును. ఈవారంచూచి మేనేజరుగార్ని పంపుదాము."

"అతను బాగా నలుపట నాన్నగారూ!" గును
మొదలుపెట్టింది విమల. పక్కన నవ్వాలన్పించింది రత్నకు
తను మంచినలుపు. యెదుటివారిని చూడకుండా వంకలుపెట్టే
స్వభావం యెలా మారుతుందో.

"మనమంతా తెల్లని తెలుపా?" నవ్వుతూ శ్రీపతిగారు
అడిగారు.

"మీరు మరీ విపరీతంగా మాట్లాడుతారు. లక్ష ఇచ్చే
చోట మరో పదివేలు ఇస్తామంటే మన్మథుడిలాంటి కుర్రాళ్ళ
వస్తారు" తల్లి అడ్డుకుంది.

"అలాగే. మన కేపదిమంది ఆడపిల్లలున్నారని—"
ఆయన హామీయిచ్చారు.

"ఆస్తి పంపకాలయినదగ్గరనుండి అబ్బాయిలు వ్యాపా
రమంటూ, అదంటూ, ఇదంటూ ఒకటే పరుగులండీ" రుక్మి
ణమ్మ చెప్పింది.

"చూచావామరి! యెవరి బాధ్యతలు వారికే తెలి
యాలి."

"నిజమే—" వారంతా భోజనానికి కూర్చున్నారు.
వడ్డనకు రత్న వచ్చింది.

"ఒంట్లో బావుండ లేదా రత్నా?" అప్యాయంగా
నోరార పిలిచా రాయన.



"నిన్న తిరగడం మూలాన బడలిక. మరేంలేదు."
తప్పించుకోబోయింది.

"శివుకు డాక్టరమ్మనెందుకు పిలిపించాడు?" రుక్మిణి
అడిగింది.

"ఈయిల్లు సత్రము. యెవరికి జబ్బులొచ్చినా, డాక్టర్లొ
చ్చినా పెద్దవారికి తెలియదు. వారందరూ సర్వస్వతంత్రులు
రుక్మిణీ! నీవయినా అడగకూడదూ?"

"పూజ—అది అవుతుండగానే జాప్యం అయింది."
అనే సంజాయిషీ ఇచ్చింది. ఆ తరువాత వాతావరణం
గంభీరంగా మారిపోయింది. అందరూ మౌనంగా భోజనాలు
చేశారు. శివరామ్‌కి అతని స్నేహితునికి క్యారియరు పంపింది.
భోజనం చేయాలనిపించలేదు. ఒక గ్లాసు మజ్జిగ తాగింది.

"చిన్నదొరతో చెబుతానుండు." వృద్ధ దాసిది తన
గారపళ్ళు వెళ్ళబెట్టి నవ్వింది. దాన్ని రత్న ముద్దుగా హిడింబీ
అంటుంది.

"నేను అత్తగారితో చెబుతాను. నీకు త్రాగుడు ఎక్కు
వయింది."

"అమ్మనూ....మామ్మా .... అదేచేత్తో ఓరూపాయి
పడేయి. అటు పక్కా తెచ్చుకుంటాను."

"నీ కడుపు భోషాణం కదే. ఎంత త్రాగినా సరిపోదు."
నవ్వుతూ వెళ్ళిపోయింది. పనివారందరికీ మొదట రత్న అంటే
చులకన, భయం ఉండేవి. ఇప్పుడందరూ ఆమె అంటే గౌర
విస్తారు. వారికి సారథి. ఎవరిపైన పితూరీలు చెప్పదు. తప్పంటే
నాల్గు చీవాట్లు అక్కడే వేస్తుంది. వారి కుటుంబాల క్షేమము

అడుగుతుంది. వారిబాధలు ఓపికగా వింటుంది. వంటయి ఓరూపుకు వచ్చింది.

"ఏమాట కామాటే....చిన్నకోడలు బంగారుబొమ్మ" రత్నకు వెనకాల వినిపించాయి. 'చిన్నదొర తెచ్చినపిల్ల' మా కోడలయింది తాను. నవ్వుకుంది. ఏం లాభం? మొవి మార్చాలో వారినే మార్చలేకపోయింది. ఓ నిట్టూర్పు వదిలింది.

నాల్గురోజులు ఇంటికే రాలేదు శివరామ్. అన్నిరోజులే రోజుకో పిట్ట దొరుకుతుంది అనుకుంది. జీవితంపట్ల విపరీతమైన నిరాశా నిస్పృహలు కలిగాయి. శివరామ్ రాముచేత పంపిన మందుల పాకెట్టు విప్పాలనిపించలేదు. అదలాగే బల్లపై పడి వుంది.

పడుకుని అడివి బాపిరాజుగారి హిమబిందు తీసింది. మనసక్కడుంటేగా! మనసెటో పరుగులు పెడుతుంది. అనేకమైన ప్రశ్నలు. జవాబులు లేవు.

"అమ్మగారూ! పెద్ద దొరగారు పిలుస్తున్నారు" రాము కబురు తెచ్చాడు. అతనంటే ఆమెకు భయభక్తులున్నాయి. వేళకాని వేళ యెందుకు పిలిచినట్లు?

"వస్తాను పద...." వాడిని పంపి అద్దంముందు నిలబడి జుట్టు సవరించుకుంది. జాకెట్టు చేతులువదులుగా కన్పించాయి. ముఖం పాలిపోయి తెల్లగా కన్పించింది. బొట్టు సవరించుకుని మామగారి గదివైపు పోబోయింది. పూలకుండీలలో పూలు సర్దుతున్న రాము హాలువైపు చూపాడు. భుజాలమీదుగా కొంగు కప్పుకుంది. హాల్లో అడుగుపెట్టి ఆశ్చర్యపోయింది.



ఎ. ఎస్. రావుగారు భార్యా సమేతుడై సోఫాలో కూర్చున్నారు. దూరంలో కుర్చీలో ఒదిగి సుందరమ్మ కూర్చుంది.

"అమ్మా!" అని ముందుకు పోబోయి, ప్రక్క సోఫాలో వున్న అత్తమామలను చూచి ఆగిపోయింది.

"అందరినీ మరిచిపోయావులే?" ధనలక్ష్మి అడిగింది.

"మీరెప్పుడొచ్చారు?" ఆనందంగా అడిగింది.

"పదిహేను నిమిషాలు అయింది. నువ్వు అంతఃపురం వీడి రావైతివి"

"అదేంలేదు పెద్దమ్మా....బావున్నావా అమ్మా?" తల్లి కుర్చీదగ్గరగా వెళ్ళింది. అప్పటికే సుందరమ్మ కళ్ళు నిండుకున్నాయి. తలాడించింది.

"మీరువచ్చి చెప్పేవరకు మాకీ విషయము తెలియదు రావుగారూ! అబ్బాయికూడా పనులవత్తిడిలో మాతో చెప్పటం మరిచిపోయాడుకాబోలు." శ్రీపతి అన్నారు.

"మా చిన్నమ్మాయి చెప్పింది. మిమ్మల్ని చూడకపోయినా, పరిచయము లేకపోయినా. ఉండలేకపోయాము సుమండీ!"

"మంచిపని చేశారు. ఈ సందర్భంగానైనా బంధువులం కలిశాము. మా చిన్నబ్బాయి కాస్త దుడుకుస్వభావం కలవాడు...."

"ఏంతమాట. మాకిప్పుడు చాలా ఆనందంగా ఉందండీ. పెద్దలకిష్టంలేని వివాహము. మా అమ్మాయి యెలా ఉందో అని చాలా దిగులుపడిపోయాము సుమండీ."

"మన ఇష్టా ఇష్టాలతో జరిగే కాలం పోయింది రా గారూ! యెదిరించి చేసేది ఏముంది? అది వాడి జీవితసమస్య, మంచి చెడు తెలియని పసివాడేం కాదుగా!"

"యెంతమాట! అందరూ అలా అనుకుంటారా! యెదురుగా ఏమన్నా ముఖస్తుతే అవుతుంది." ఉక్కిరి బిక్కిరి అవుతూ అన్నాడు.

"రాముచేత ఫలహారాలు పంపించి, రాత్రి భోజనాలకేర్పాట్లు చేయించమ్మా." రత్నవైపు తిరిగి చెప్పాడు శ్రీప

"ఇప్పుడు భోజనాలు యెందుకండీ?...." నసిగా రావు.

"ఇంటికివచ్చి భోజనాలకుండరా! మంచివారే..." నన్నాడు. తల్లితో కళ్ళతోనే మాట్లాడుతున్న రత్న లోపలికెళ్ళింది. ఫలహారాలు వచ్చాయి. కాఫీలు వచ్చాయి రా గారు ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

"వారికి ఇల్లూ తోటా చూపెట్టమ్మా."రత్న వాళ్ళ మొదట తన గదికి వెళ్ళింది.

"యెంత చిక్కిపోయావే...." తల్లి కన్నీటితో కూతు తల నిమిరింది.

"ఏం తింటుందో ఏమో నే సుందరీ....మనం దగ్గరుం పెడి తే....అది వేరుమాట."

"అవునక్కా! నెలరోజులు పంపమని అడగండి."

"మీాడంతా విపరీతమమ్మా." నవ్వడానికి ప్రయత్నం చేసింది. అప్పుడు తమవారి దుస్తులనంకా; నగలవంకా



చూసింది. ధనలక్ష్మి తనకున్న నగలన్నీ వేసుకుంది. ధర్మవరం పట్టుచీర కట్టింది. సుందరమ్మ సాదా పట్టుచీర, చేతులకు నాలుగేసి బంగారుగాజులు వేసుకుంది. మెడలో గొలుసులు వేసుకుంది. యెవరిదో ఫియట్ కారు అడిగి తెచ్చినట్టున్నారు. రత్నకు నవ్వు, జాలీ ఒక్కుమ్మడిగా వచ్చాయి.

"కూర్చోండి...."అందరికీ కుర్చీలు చూపించింది.

ఇల్లూ, వస్తువులూ, వారింటిముందు నిల్చున్న జీపు కారూ చూస్తే ధనలక్ష్మి అసూయపడ లేకుండా ఉండలేకపోయింది. 'ఛీ ఇదేమిటి? నా పిల్లలతో పెరిగినపిల్ల' అనుకుంది. రత్న మందువాడటంలేదని రాముద్వారా తెల్సుకున్న శివరాం యింటికివచ్చి బంధుకోటిని చూచి ఆశ్చర్యపోయాడు.

"నమస్కారమండీ!" అందరికీ చిరునవ్వుతో చేతులు జోడించాడు. మారిన అతని వాలకము చూచి సుందరమ్మ సంతోషపడిపోయింది. వ్యవసాయములోని సాధక బాధకాలు చర్చించుకున్నారు.

"అత్తగారిని యిక్కడే ఉంచి వెళ్ళండి. అదిగో.... అమ్మాయిచేసే ఘనకార్యము...." విప్పని మందుల ప్యాకెట్టు వారికి చూపాడు " తెచ్చి యెన్నిరోజులు అయిందో అడగండి ఒక్కసారీ వాటిని వాడిన పాపాన పోలేదు. మీారు దగ్గరుంటే తింటుందేమో ...."

"నీ పెంకితనము వదలలేదా రత్నా! మాకు తెలుసు బాబూ! చాలా అభిమానము, పెంకితనమూ. చిన్నప్పుడు వాళ్ళ పిన్నమ్మ 'రాక్షసిజట్టు తల్లీ నీది. యెక్కడ కొబ్బరనూనే

చాలదు' అంది....అంటే మూడు నెలలు మమ్మల్ని ముప్పు తిప్పలు పెట్టిందని....జుట్టుకు నూనె రాసుకుంటేనా...." ఎస్ ఎస్. రావుగారు చెప్పుకుపోతున్నారు.

"పెదనాన్నా! అన్నయ్యను తీసుకురాలేదేం!" మాట మళ్ళించాలని అడిగింది.

"చాల్లే తెలివి. అన్నయ్య సాయంత్రం వస్తాడుగా. మందు యెందుకువాడటం లేదు?" ధనలక్ష్మి నిలదీసింది.

"నాకేం రోగం పెద్దమ్మా? గుండులా ఉంటేనూ!"

"యెందుకే మొండితనము. నిన్ను చూచుకు యిలా మోడులా బ్రతుకుతున్నాను. నీవు క్షేమంగా వుండాలి" సుందరమ్మ బాధ.

"యెందుకమ్మా కంటనీరు! నాకేమయింది! మందు వేసుకుంటాను సరా." తల్లి కన్నీరు వత్తింది. అల్లుడు పొలాలు చూపడానికి అందరినీ బయటకు తీసుకుపోయాడు. రత్న మాత్రం యింటిదగ్గరే ఉండిపోయింది. నాల్గుదాటాక కిషోర్ వచ్చాడు.

"ఏరా అన్నయ్యా, ఇన్నాళ్ళకా?"

"మీరా గొప్పవారు యెప్పుడుపడితే అప్పుడు యెలా రావాలి? ఏడీ మన గోపాలకృష్ణుడు?"

"ఆయనా!" నవ్వింది. "నాకు చాలా సంతోషంగా ఉందిరా అన్నయ్యా! రాముడికి కృష్ణుడికి తేడా తెలుస్తుంది"

"పోవే శూర్పనఖా" నవ్వుతూ రత్న వీపు నిమిరాడు "ఇక ముందు వారం వారము వస్తానే మేనల్లుడితో ఆడు



కోవడానికి. ఇకనుంచి రోజూ ఫలహారం సిద్ధం చేయి. రజనక్క యింటికెళ్ళితే సమయమే తెలియదే...."

"ఒరేయ్ అన్నయ్యా! నెల్లూరుతో సంబంధం ఉంది టరా."

"నీకు అన్నీ జ్ఞాపకమే....అదో పిచ్చికాలం రత్నా! నువ్వే నన్ను వెలుగులోకి త్రోశావు. నీకు చాలా ఋణపడి ఉన్నాను...."

"అయితే ఋణం తీర్చుకో."

"ఇప్పుడు కాదు. సంపాదించాక."

"డబ్బుతో కాదు, నేను కోరినకోర్కె తీర్చాలి...."

"డబ్బుతో కాకపోతే యిప్పుడే చెప్పాలి...."

"ఏం లేదురా....నిన్ను కట్టుకున్న స్త్రీ ఒక మనిషేననీ, దానికి మనసు ఉంటుందనీ తెలిసి మసులుకో. పెద్దబావలా 'అనుక్షణం' అనుమానించి బ్రతికి ఉండగానే హింసలు పెట్టకు...."

"రత్నా!" కిషోర్ కళ్ళు పెద్దవి చేశాడు

"అవును. నిజం చెబుతున్నానురా. చినబావలాగ స్త్రీ అంటే ఆటవస్తువు 'రికమండేషన్' అని అనుకోకు."

"ఆపావేం?" శివరామ్ యెలా భావిస్తాడో చెప్పవేం?"

"అది నువ్వూహించగలవు. అలాంటి స్థితికి నీవు దిగజారవని నాకు తెలుసు. కనీసం నువ్వయినా దాంపత్యం, సంసారం, అంటే మధురస్వప్నం అని నిరూపించు...." అన్నది. ఆమె కళ్ళు నిండుకున్నాయి.

"నువ్వేడువకు రత్నా! నేను చూళ్ళేను....ప్లీజ్ ప్రామిస్. అలాగే. నువ్వు చెప్పినట్టే చేస్తాను." ఆమె కళ్ళు తుడవటానికి ముఖం యెత్తాడు. అతని చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"యెందుకు? ఎందుకు రత్నా! చెప్పవా? నాతో చెప్పు ప్లీజ్!" అతను ఆమె ముఖం పైకెత్తటానికి ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడే గదిలోకి శివరామ్ వచ్చాడు. ఆ దృశ్యము చూచి అతని ముఖం మలినమయింది.

"బావగారా! రండి....ఇది ఒట్టి సెంటిమెంటల్ ఫూల్. విషయము చెప్పదు. ఏడుస్తుంది. చూడండి...." కిషోర్ అమాయికంగా చెప్పాడు. శివరామ్ తలవంచుకున్నాడు. రత్న తల యెత్తింది. కళ్ళుతుడుచుకుంది.

"కాఫీ అయినా తాగలేదేమిట్రా! ఉండు కాఫీ తెస్తాను...." లేచి బయటికి వెళ్ళింది. పెద్దలంతా హాల్లో లోకాభిరామాయణం మాట్లాడుతున్నారు. రత్నకు అయిదో నెల రాగానే సీమంతం యెక్కడ చేయాలన్నది, సమస్య వారికి.

"ఈ అవకాశాన్ని పురస్కరించుకుని అయినా శ్రీమాన్ బావగారూ, అక్కగారూ మా యిల్లు పావనము చేస్తారని ఆశిస్తున్నాము." ఎస్. ఎస్. రావు ప్రాధేయ పడుతున్నారు.

"రత్నను చూస్తే కోడలని నాకెప్పుడూ అనిపించదు రావుగారూ! మా అమ్మాయి విమలను చూచినట్టే ఉంటుంది ఇక్కడే కానిద్దాం."

"మీరలా అంటే నేను ఏమనగలను!...." నాకు సీమంతం వద్దు. సీమంతం వద్దు! అని గట్టిగా అరవాలనిపించింది



రత్నకు. కసీ, కోపం, దుఃఖం దిగమింగుకుని వెళ్ళిపోయింది వంటశాలవైపు.

## 12

విమలకు అంతా అయోమయంగా ఉంది. డాక్టరు ఖచ్చితంగా చెప్పింది నాల్గో మాసమని. కొందరికి కక్కులు గొడవలుంటాయట. ఖర్మ. నాకు అలాంటివేం లేవు ఇప్పుడు ... అంతా చేయిదాటిపోయింది. యెలా? గోపాల్ పెళ్ళి జరిగిపోయింది. అనుమాత్రం అతన్ని పెళ్ళిచేసుకోవాలని అనుకోలేదు. స్వేచ్ఛగా తిరిగింది. తండ్రిచూచిన సంబంధం అంగీకరిస్తే! అతనికి తనగుట్టు తెల్సిన మర్నాడు ఏమవుతుంది! సాయంత్రం తోటలో కూర్చుని ఆలోచిస్తుంది విమల. భారంగా అడుగులు విన్పించాయి. నిండుగా అందంగా కన్పించింది రత్న.

"ఓ! చిన్నవదినగారా!...." అన్నది.

"ఏమండోయ్ ఆడబడుచుగారూ! ఏమిటి విశేషము. చాలా గౌరవము ఇచ్చి మాట్లాడుతున్నారు!" ఆమెకు కొంచెం దూరములో కూర్చుంది రత్న.

"కాలము యెప్పుడూ ఒకే రీతిగా ఉండదుగా వదినా!" నవ్వలేకపోయింది.

"కాలంతోపాటు తమరూ మారుతున్నారన్నమాట! చాలా సంతోషం. ఈ సమయములో కూడా ఇలా ఒంటరిగా కూర్చోవటం చిత్రంగా ఉందిసుమా."

"నాకో చిన్న సమస్య ఎదురయింది వదినా! పరిష్కారం ఆలోచిస్తున్నాను." అన్నది.

"ఏమిటది?"

"అది ఎలాగా నువ్వే నాన్నగారితో చెప్పాలి. ఈ ఉదయము డాక్టరుదగ్గరికెళ్ళాను. ప్రెగ్నెన్సీ అంటాడు...."

రత్న అదిరిపడింది. విమలకు చీమకుట్టినట్టుకూడా లేనట్టు అనిపించింది.

"మరింకేం, నీ బాయ్‌ఫ్రెండును తెచ్చి మీనాన్నగారికి పరిచయము చెయ్యి. వెంటనే వివాహం జరిపిస్తారు." అన్నది లోపల ఉవ్వెత్తుగా లేచిన కోపాన్ని దిగమింగుతూ.

"గోపీతోనే స్వేచ్ఛగా తిరిగింది వదినా! వాడికి పెళ్ళి అయిందా?"

"మరి అతని పెళ్ళి ఎందుకాపలేకపోయావు?"

"వాడొట్టి పిసినారి వెధవ. చదివింది ఇంజనీరింగు కాని విశాలభావాలు ఏమాత్రం లేవు. నేను మరొకరితో మాట్లాడితే అసూయచెందేవాడు."

"చాలు విమలా! ఇక ఎక్కువ చెప్పకు. పనిలేక ఇంటి కూర్చుని అడ్డమైన చెత్తపుస్తకాలు చదివి నువ్వు చేసిన నిర్వాకమిదా? ఏదమ్మా మీ నాన్నకున్న ఆస్తంతా ధారబోసినా,



ఈ సంగతి నిజం తెల్సుకున్నవాడెవడూ పెళ్ళిచేసుకోడు. చేసుకున్నా అదీ నీ డబ్బుకోసము. ఆ తరువాత నిన్ను.... ఎలా చెప్పేది హీనాతిహీనంగా చూస్తాడు. అది గుర్తుంచుకో."

"నాన్‌సెన్స్! ఏదైనా పరిష్కారం చెబుతావేమో అంటే మాటర్ ఇంకా కాంప్లికేటెడ్‌గా తయారు చేశావు." విసుక్కుంది విమల. అది విమలతప్పు కాదు. అలా స్వేచ్ఛగా వదిలిన తల్లిదండ్రులది. విమలంటే ఆ యింట్లో అందరికీ గారాబం - ముగ్గురు అన్నలతరువాత పుట్టిన చెల్లెలు కావటం మూలాన

"ఈ విషయము-అంటే నాస్థితి-అమ్మతో చెప్పు. వాళ్ళే ఏదో ఆలోచిస్తారు...." అన్నది.

"మధ్య నేను చెప్పడం దేనికి? నువ్వే చెప్పుకో."

"ఎలా చెప్పాలి. పాపం గోపీ మాత్రలు అవి వాడమన్నాడు...."

"ఛీ....ఛీ! ఇక చాలు...." అక్కడనుండి లేచిపోయింది. చీకటిపడేవరకు ఆలోచిస్తూనే వుంది. ఆనాటి సంఘటన తరువాత తనకూ భర్తకూ మధ్య మాటలు లేవు. ఎప్పుడో గాని యింటికి రాడు. పని, పని అంటూ పొలాలదగ్గరే ఉండిపోతాడు. తను పెద్దగా పట్టించుకోవడంలేదు. తను చెప్పగలదా పెద్దవారితో?

"చిన్నదొరసానో, పళ్ళరసం...."

"చూడు హిడింబీ! అత్తగారేంచేస్తున్నారో చూచిరా."

"గదిలో కూర్చుని ఉన్నారమ్మా! ఇప్పుడే మల్లెపూల దండ యిచ్చి వస్తున్నాను. మాగట్టిదానివిలే. మా కొడుకు త్రాగుడు, ముండలయవ్వారం మాన్పించావు." నవ్వింది.

"ఇవన్నీ మీ దొర నాతో చెప్పమన్నారా?" తీక్ష్ణ కంఠముతో ప్రశ్నించింది.

"ఏమిటో నాపైన కోపం!" తలగోక్కుంటూ వెళ్ళిపోయింది అది. కసిగా పళ్ళరసము పారబోసింది. మరో ఐదు నిమిషాలు ఆగి అత్తగారి గదిలోనికి వెళ్ళింది. ఆమె తలలో పూలమాల సరిచేసుకుంటుంది. ఆమె కట్టినచీర, పెట్టిననగలు చూస్తే యెక్కడికో ప్రయాణం పెట్టుకున్నట్టు అనిపించింది.

"యెవరూ?...." ఇటుతిరిగింది. "నువ్వా?" ఆవిడఆశ్చర్యంగా చూచింది. ఇంతవరకు యెన్నడూ కోడలు తనగదిలోకి రాలేదు. వివాహమై అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తుంది. పండుగలకు, పర్వదినాలకు అందరూ కలుసుకోవటం పరిపాటి. ఒకటి రెండుసార్లు పెద్దకోడండ్లు రత్నను ఎద్దేవ చేయటం చూచింది. రత్నమాత్రం వెంటనే అంతకు రెండురెట్లు జవాబు యివ్వటంతో ఆమెజోలికి యెవరూపోరు.

"మీతో.... కాస్త పనుంది." ఇబ్బందిగా కదిలింది.

"మరో పదినిమిషాల్లో సికింద్రాబాద్ వెళ్తున్నాము. అక్కడికి మన బంధువుల అబ్బాయి వస్తాడట......వీలుంటే విమలను చూడ్డానికి పిలుస్తాము." గర్వంగా చెప్పిందావిడ.

"విమల విషయమే చెబుదామని...."



"విమల విషయమా? ఏమిటి? దూకుడుగా మాట్లాడిందా?"

"కాదు....తను గర్భవతి...." యెలాగో విమల చెప్పిన విషయము చెప్పింది. రుక్మిణమ్మ వణికిపోయింది.

"అబద్ధం...."అన్నది నమ్మలేనట్టుగా.

"ఆమె స్వయంగా చెప్పిందండీ!" తను కల్పించి చెప్పటములేదని తెలుపుకుంది.

"అయితే అతను యెవరట?" అసహాయంగా అడిగింది.

"మేనేజర్ గారి కొడుకట. విమలకతన్ని చేసుకునే ఉదేశం లేదట."

"ఆఁ...." ఆవిడ దిమ్మరపోయింది. "ఇప్పుడే మామగారితో చెప్పి వాడిని పిలిపిస్తాను. వాడి కెంతధైర్యం. మన పిల్లతో తిరుగుతాడా?" ఆవిడ లేచింది.

"ఇప్పు డేంలాభంలేదండీ! అతనికి వివాహం జరిగింది. అదంతా మనమ్మాయికి తెలుసు. అతను....ఆ గోపాల్ యెలాంటివాడో మీ అబ్బాయిలందరకు తెలుసు. స్వేచ్ఛగా మన మేడలో తిరుగుతుంటే ఒక్కరయినా గమనించారా? వారించారా?"

"మరిప్పుడేంచేద్దామే...." అత్తాకోడళ్ళు మౌనంగా చాలాసేపు నిల్చున్నారు. తరువాత రుక్మిణమ్మ భర్త గదిలోకి వెళ్ళిపోయింది. రాత్రంతా భార్యాభర్తలు ఘర్షణపడ్డారు. పిల్లలు చెడిపోవటానికి కారణం తల్లి అని తండ్రివాదన, తండ్రే

నని తల్లి వాదన. చివరకు వారేంనిర్ణయించుకున్నారోగాని తెల్లవారే చదువుపేరుతో విమల ఆఊరు వదిలింది ఎక్కడకు పోతుందో. ఏంచదువో యెవరికీ తెలియదు.

"నాగరత్నం! నీకేమయినా తెలుసా? నిన్నటివరకు పెళ్ళిసంబంధాలో అన్నవారు హఠాత్తుగా చదువులంటున్నారు...." పెద్దతోడికోడలు ఆరాతీసింది.

"ఏదైనా తెలిస్తే సాటివారు మీకు తెలియాలిగాని నాకేం తెలుస్తుంది?" అన్నది ఏం తెలియనట్టు.

"అయ్యో తల్లీ! తెలిసినా మాకు చెబుతావటమ్మా! అన్నట్టు ఈమధ్య మరదిగారు ఇంటికే రావటములేదటగా!" రెండోకోడలు అడిగింది.

"యెవరోగాని మీకు నిజాలే చెబుతున్నారే...." అని అక్కడనుండి వెళ్ళిపోయింది.

రెండు నెలలు గడిచాయి. తాను శాంతి నికేతన్‌నుండి మద్రాసు వెళ్తున్నానని రాసింది విమల. ఉత్తరం చదువుతుండగానే సన్నగా నొప్పులు ప్రారంభంఅయ్యాయి. అత్తగారింట్లో సీమంతముజరిగింది. పెళ్ళికివ్వాల్సిన నగలుఅన్నిఇచ్చారు అత్తగారు. ఇరువైపుల బంధువులు కలిశారు. ఏకోశాన ఆనందము లేనిది రత్నకే. నవ్వుతూ, నటిస్తూ తిరిగింది. ప్రసవము తనయింటిదగ్గర జరగాలని రావుగారు యెంతప్రయత్నించినా శివరామ్ అంగీకరించలేదు. విమల వెళ్ళిపోయిన దగ్గరనుండి రుక్మిణమ్మ చాలా మారిపోయింది. కోడల్ని పిలిచి దగ్గరగా కూర్చోబెట్టుకుంటుంది. అప్పుడప్పుడు తిండి విష



యాలలో శ్రద్ధ కనపరుస్తుంది. 'ఈ పిల్లలో యెంత నిబ్బరం.... అత్యాశ్చర్యము! విమల విషయము బయటికి పొక్కనీయలేదు అనుకునేది. శివరామ్ దూకుడు తనే భరించిందిగాని బయటకి రానివ్వటంలేదు. పెద్దకోడండ్లతో యెంతగోల జరిగేది! ఒక్కరోజు ఆలస్యంగా వస్తే నానా గల్లంతు చేశేవారు. చిన్నకోడలు ఓసారి ఆరునెలలు పుట్టినింట్లోనే ఉన్నది. దొరలపిల్లలంటూ ఆడంబరంగా పెంచటం తెలుసుకాని రత్నలాగ ఒక్కపని తెలుసా? తోటలో ఒక్క గడ్డిమొక్క కన్పించటంలేదు.

"హిడింబీ" బాధగా పిలిచింది.

"ఏంటమ్మా అలాఉన్నారు?.... తెలిసిందిలే...." అది నిమిషాలమీద వార్త యజమానులకు చేరవేసింది. అత్తగారు వెంటరాగా ఆస్పత్రికి వెళ్ళిపోయింది. అందరూ నోళ్ళు నొక్కుకున్నారు. యెవరు ఆస్పత్రికెళ్ళినా, పనివారే.... 'హిడింబీ' మాత్రమే వెళ్ళేది. రుక్మిణమ్మ వెళ్ళటం అంటే వింతగా తోచింది.

అప్పుడే హైద్రాబాద్‌నుండి వచ్చిన శివరామ్‌కు వార్త అందినది. వెంటనే అతని జీపు స్టార్టు అయింది. అతని మనసు దానికంటె వేగంగా పరుగెత్తుతుంది. తన అజాగ్రత్తవల్ల తమ మధ్య పెద్దఅగాధమే ఏర్పడింది. అది పూడ్చడానికి తనశక్తి చాలదు. తన తప్పుకు రత్న తనకుతాను శిక్ష విధించుకుంటుంది. కాని ఆమే తనకు పరిష్కారం చూపాలని ఓపికగా నెలలు యెదురుచూచాడు. తాము మరింత దూరం అవుతున్నారే

తప్ప దగ్గరయ్యే మార్గం కన్పించటములేదు. ఒకే ఒక మార్గం. అది పుట్టబోయే శిశువు. ఆశిశువే తమమధ్య వారధి. ఆశిశువు మూలంగానైనా తనకు రత్నతో మాట్లాడే అవకాశము కల్గితే.... కారు వెళ్ళి ఆస్పత్రిముందాగింది. అక్కడ తల్లి దండ్రులను చూచి ఆశ్చర్యపోయాడు. మధ్యలో తమ కారును శ్రీపతిగారు ఆపి, విషయము తెలుసుకుని తనూ ఎక్కారు. తనున్న జీపు యింటికి పంపాడు. 'మనుష్యుల్ని ఆకట్టుకోవటం రత్నకు బాగా తెలుసు.' అనుకున్నాడు. తను పసుత్వముతో ఆమెను వివాహము చేసుకున్నాడు. తనకు ప్రేమఅంటే తెలియజేయలేదూ! నెమ్మదిగా కారుదిగి సిగరెట్టు వెల్గించుకున్నాడు. అక్కడే రెండుదమ్ములు లాగి దాన్ని కాలిక్రిందవేసి నలిపాడు. నెమ్మదిగా తల్లి, తండ్రి వున్నదగ్గరకు వెళ్ళాడు.

"చాలా బలహీనంగా ఉందంటున్నారు. మందులు, పళ్ళు అన్నీ వాడుతూనే ఉన్నాముగా?" తల్లి అంటుంది.

"బలహీనత అంటుండడము మామూలే లే." శ్రీపతి అన్నారు. శివరామ్‌కు అనుమానంగా ఉంది. ఆ మనిషి అవన్నీ వాడిందా?

"తనెలా ఉంది?"

"తెలివిగానే ఉంది. వెళ్ళిచూడు...." తల్లి అన్నది. నెమ్మదిగా తలుపు తోసుకుని లోపలకు వెళ్ళాడు. చుట్టూ నర్సులున్నారు. ఏదో మాట్లాడుకుంటున్నారు. కళ్ళుమూసుకుని నిశ్చలంగా పడుకుంది రత్న.



"హల్లో మిష్టర్ శివరామ్! రేపు ఉదయము అవచ్చు [illegible]...." అన్నారావిడ. ఆవిడే డాక్టరు శాంతాదేవి. వారి ఫ్యామిలీడాక్టరుకూడాను.

"గుడ్ ఈవెనింగ్ డాక్టర్...." విష్ చేశాడు. రత్న కళ్ళు విప్పింది. అతను అప్పుడే ఆమెవంక చూచాడు. ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. రెండు క్షణాలుమాత్రమే. వెంటనే అతన్ని చూడలేనన్నట్టు ఆమెముఖం ప్రక్కకు తిప్పుకుంది. అతని హృదయము దెబ్బతిన్నది. కోపంకూడా వచ్చింది. వెంటనే నిభాళించుకుని దగ్గరగా వెళ్ళాడు. ఆమెను పేరుతో పిలిస్తే ఇంకా రెచ్చిపోతుంది. ఆసమయములో ఆవేశము పనికిరాదని దగ్గరగా వెళ్ళాడు. ఆమెనుదుట పడిన వెంట్రుక సర్దాడు. మరోసారి తలెత్తి చూచి, మళ్ళీ కళ్ళుదించుకుంది.

"మీ అమ్మగారిదగ్గరకు కారుపంపనా?"

"ఊం"

"చూడు! ఇప్పుడన్నీ మరచి మనసు ప్రశాంతంగా ఉంచుకో...."

"ప్రయత్నిస్తాను...." అన్నది. ఆమె కనుకొలుకుల నుండి నీరు జారిపోయింది. అతను నెమ్మదిగా తన రుమాలుతో వత్తాడు. నర్సులు దూరంగా వెళ్ళిపోయారు.

"చూడు.... నన్నేం చేయమంటావు? ఏంచేస్తే కోపం పోతుంది చెప్పు?" అన్నాడు ఆమెచెయ్యి పట్టుకుని. మృదువుగా చెయ్యి విడిపించుకుంది.

"చెప్పు ఏంచేయాలి?"

"త్వరగా చచ్చిపోవటానికి ఏదైనా విషం యివ్వండి."

"ఊఁ...." అతను పళ్ళుబిగపట్టి బయటికి వచ్చేశాడు. డ్రైవరుకు జీపుయిచ్చి రత్న తల్లిదగ్గరకు పంపాడు. రాత్రి గడిచింది. తెల్లవారుఝామున రత్న యెంతో ప్రయత్నం... డాక్టరు నిపుణతవల్ల బ్రతికింది కాని శిశువు మరణించాడు. శివరామ్ కట్టదలచిన వారధి పునాదులతో కూలిపోయింది. అతను బేసిన్‌లో పెట్టిన మృతశిశువువంక చూచాడు. పచ్చగా, మూడు నెలల పాపకుమల్లే ఉన్నాడు. ఒత్తయినజుట్టు నల్లగా ఉంది. రత్నమాటలు ఒక్కసారి అతని చెవులలో గింగురుమన్నాయి. నిజంగా ప్రతిబింబం పుట్టబోయే బిడ్డ చనిపోవాలని కోరుకుందా? అలా అయితే ఎన్నడూ ఆమెను క్షమించలేడు. తను యెందుకిలా మారిపోతున్నాడు. ఒక స్త్రీకోసం యెందుకు తపించిపోతున్నాడు? బేసిన్‌లోని బిడ్డను హృదయానికి హత్తుకోవాలన్నంత కోర్కె కల్గింది. అతని కళ్ళు నీటితో నిండిపోయాయి.

"టేకిట్ ఈజీ శివరాం! నా ప్రయత్నలోపం ఏంలేదు. తల్లిని బ్రతికించడమే గగనమైపోయింది." శాంతాదేవి దగ్గరగా వచ్చి చెప్పింది.

"థాంక్ యూ డాక్టర్! బిడ్డనుమాత్రం తల్లికి చూపకుండా భూస్థాపితం చేయకండి."

"అంత అవసరమా?"

"అవసరమే. ఆమెను మీరు యెరగరు."



"ఇప్పుడప్పుడే ఆవిడకు తెలివి వస్తుందనుకోను.

"ట్రైచెయ్యండి...." త్వరగా బయటికి వెళ్తూ వెనక్కి తిరిగి చూచాడు. ప్రాణంలేనట్టు పడివుంది రత్న. బయట సుందరమ్మ ఏడ్పు సన్నగా విన్పిస్తుంది. అతనేం మాట్లాడక కారు తీసుకుని వెళ్ళిపోయాడు.

"రఘు బి. ఎస్సీ. అగ్రికల్చర్........పొలంలో తిరుగుతున్నాడు. అతనికి పైరు చూస్తే తమ శ్రమ ఫలించిందనిపించింది. కారుశబ్దం విని త్వరగా అతను తను షెడ్డువైపు వచ్చాడు. శివరాం షెడ్డులోకి వెళ్తున్నాడు.

"మీరా?....అబ్బాయా, అమ్మాయా?"

"అబ్బాయి"

"కంగ్రాచ్యులేషన్స్!"

"అవసరం లేదు లే. పుడుతూనే ఈలోకం వదిలిపోయాడు."

"సారీ...." రఘు చిన్నబుచ్చుకున్నాడు. అతను కళ్ళు మూసుకుని ఈజీచైర్లో కూర్చున్నాడు. ఇంకేం మాట్లాడాలో తెలియలేదతనికి. పది నిమిషాలు చూచి వెళ్ళిపోయాడు. భోజనాల సమయానికి వచ్చి లేపాడు.

"నాకు ఆకలిగాలేదు రఘూ!" అన్నాడు.

అతనిబాధ రఘుకు తెలుసు. తన సంతానమునుగూర్చిన ప్రతివిషయము రఘుతో చెప్పుకున్నాడు. కలలన్నీ కల్లలు అయిననాడు జీవితం యెలా ఉంటుందో ఊహించగలడు. తను భోజనముచేసి, ఒకగ్లాసుతో శర్బత్ తెచ్చియిచ్చాడు. మౌనముగా త్రాగి కళ్ళుమూసుకున్నాడు. రఘు ద్రాక్షతోటకు

త్రవ్వేపాదులదగ్గర పర్యవేక్షణకు వెళ్ళాడు. అక్కడే ప్రొ వాలిపోయింది. కూలీలను పంపి షెడ్డులోకివచ్చాడు. శివరా విస్కీ సోడా కలుపుతున్నాడు. అతని గ్లాసు నోటిదగ్గర చే పూర్వమే రఘు దాన్ని అందుకున్నాడు.

"క్షమించండి శివరాంగారూ! మీరు నాతో చె న్నారు, గుర్తుందా! 'ఈ త్రాగుడే మనిషిని పశువుగా చేస్తుం దని. ఆసంగతి తెలిసికూడా యెందుకు మళ్ళీ ప్రారంభిం చారు?"

"విధిలేక.... ఈ విషయాలన్నీ మరచిపోవాలంటే త్రాగుడు ఒక్కటే సాధనము రఘూ!"

"పొరపడుతున్నారు. ప్రపంచములో ఇలాంటి వి యాలు చాలా సాధారణంగా జరుగుతాయి. మా అక్క మొదట అమ్మాయి పుట్టిపోయింది. మా బావగారు ఆబాధ మరచిపోవటానికి త్రాగ లేదు. డబ్బులేక అంటారా? ఆయన బాధలేక అంటారా?"

"రఘూ....!"

"ఆవేశం వద్దండీ. అన్నీ మనము అనుకున్నట్టు జరుగు తాయా? మా అమ్మా, నాన్న నన్నుగూర్చి యెన్నో కలలు కన్నారు. ఒక్కటీ ఫలించలేదు. ఇప్పుడవన్నీ మరిచిపోయారు. నా చదువుకు చేసిన అప్పు తీర్చడానికి డబ్బు పంపుతున్నా అనే సంతోషం వారికి. జీవితంలో కష్ట సుఖాలు సమానంగా ఉంటాయి...."



"నా బాధ నీకర్థంకాదు రఘూ!"

"అర్థం అవుతుంది. మీరు సుఖాలేచూచారు. కష్టాల వ్యధనంకూడా తెలియదు శివరాంగారూ. ఒక పదిరోజుల పాటు మా ఊరు వెళ్దాంపదండి. కష్టాలు, బాధలు అక్కడ చూద్దురుగాని. సంతానమును శత్రువులుగాచూచే తల్లిదండ్రులు కొందరు, వారిక్షేమముకోసం అవినీతి అక్రమాలు చేయువారు కొందరు, నిలువ నీడలేనివారు మరికొందరు, తెల్లవారితే జీవితం సమస్యలా ఉంటుంది కొందరికి."

"వద్దు రఘూ చెప్పకు. నేను వినలేను."

"చూచారా! చెప్పేదే వినలేరు మీరు. చూడలేరు అలాంటికష్టాలు భరించలేరు. నాకు సమస్యలు లేవంటారా? ఇద్దరక్కల వివాహాలకు, నా చదువుకు ఉన్న ఆస్తంతా పోయింది. ఇంకా ఇద్దరుచెల్లెండ్ల పెళ్ళి కావాలి. పెళ్ళికి డబ్బు కావాలి. కొడుకు ప్రయోజకుడై పెళ్ళిళ్ళు చేస్తాడని నాన్నగారి ఆశ...ఆయన ఆశను యెలాతీర్చాలన్నసమస్య నాకు."

"ఇప్పుడవన్నీ చెప్పకు రఘూ! నేను పిచ్చివాడనవుతాను."

"చెప్పనులెండి. మరెప్పుడూ ఈ బ్రాందీ, విస్కీల జోలికి పోకండి అంతా చక్కబడుతుంది. ఆవిడ తాత్కాలికంగా కోపంగా ఉన్నారు. మీరు భయంగా దూరంగా ఉన్నారు. మీరావిడకు పరిస్థితి నెమ్మదిగా అర్థం చేయండి."

"ఏమో? ...నాకు యెక్కడికైనా పోవాలని ఉంది."

"మాఊరు వెళ్దాం పదండి....." విస్కీ పారబోశాడు. ఇంకా అలమరాల్లో ఉన్నాయేమో అని చూడబోయాడు.

"అంత భయం వద్దులే రఘూ! యెవరయినా వస్తే యివ్వాలని ఉంచాను. పారబోయకు."

"ఇక యెవరు వచ్చినా నిష్మరసమే [తాగుతాను]" అన్నాడు దృఢంగా.

"రఘూ! ఈ మర్యాద లెందుకు? స్నేహితుడిలా ఏకవచనముతో పిలువు. నా కెందుకో విపరీతమైన ఒంటరితనము అన్పిస్తుంది....." అతని చేయి పట్టుకున్నాడు.

"అలాగే ..." అతను నవ్వాడు. "పదండి అలా తిరిగి వద్దాము."

ఇరువురు లేచారు.

## 13

అదో పేరుమోసిన హోటలు. నెమ్మదిగా డయాస్ పై నుండి బ్యాండు సంగీతం వినబడింది. అందరూ అటువైపు చూచారు. చక్కని పదహారేళ్ళ అమ్మాయి నాట్యం మొదలు పెట్టింది. ఓ సర్దార్ జీ తలాడిస్తూ చికెన్ పని పడుతున్నాడు. ఓ మూల కూర్చున్న యువతి వెయిటర్ ని పిలిచింది.

"ఒన్ సిగరెట్ ప్యాకెట్..."



"ఏమాట్క్యా?"

"ఏదో ఓటి...." అని తనముందున్న సావు బాటిల్ బ్రాండి గ్లాసులోకి ఒంపుకుంది. టైట్ జీన్స్ వేసుకుంది. దానిపై సెల్లబ్లౌజ్, బాబ్డ్ హేర్. కొందరు మొగవారు విచిత్రంగా ఆయువతిని చూస్తున్నారు. తమను మించిపోయిం దేమిటా యువతి తాగడంలోనని.... ఒక యువకుడు మరొకరిని అడిగాడు ఆమెగురించి.

"ఆమె... ఆమె ఓ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ భార్య."

"షి ఈజ్ అప్టుడేట్...." అతను నవ్వుకున్నాడు. అతను నెమ్మదిగా లేచి ఆమెదగ్గరకు వచ్చాడు. ఆమె సిగరెట్టుపొగ వదిలింది.

"కెన్ యూ డాన్స్ విత్ మి?" మృదువుగా అడిగాడు.

"వైనాట్!" ఆమె లేచి చేతులు అందించింది. ఇరువురూ డయాస్ పైకి వెళ్ళారు. సంగీతానికి అనుగుణంగా కాళ్లు కదులుతున్నాయి. అలా ఒకరితరువాత ఒకరు జంటలు జంటలుగా డాన్స్ చేస్తున్నారు. సమయము ఏఒక్కరికీ జ్ఞాపకం లేదు. ఫుల్ సూట్లో ఉన్న యువకుడు గబగబా ముందుకు వచ్చి, తప్పతాగిన యువతిని చెయ్యిపట్టి లాగాడు.

"యు...." ఆమె గట్టిగా నవ్వింది. "ఆర్ యు..."

"పద." అతను ఆమెచేయిబట్టి బరబరా బయటికి లాక్కొని వచ్చి కార్లో కూలేశాడు.

"ఓ మై రెవరెండ్ హాస్బెండ్ .... వై య్యార్యూ యాంగ్రీ?" అంటూ నవ్వింది.

"సాధనా!" అతను గట్టిగా అరిచాడు.

"వ్వాట్ మిస్టర్ పాణీ?"

"నీ ఆగడాలు మితిమీరుతున్నాయి...."

"నీకంటేనా? డోంట్ బి సిల్లీ మైడియర్."

"ఆడవారు త్రాగడం, సిగరెట్టు కాల్చటం యెక్కడయినా చూచావా?"

"మనము చూడనివీ, విననివి ఎన్నో తమాషాలు జరుగుతున్నాయి, మై డియర్ చక్రీ! యెప్పుడైనా మొగాడు పెళ్ళాం శీలాన్ని యెరగాపెట్టి ఉన్నతపదవులు అలంకరించాడా?"

"ఆమాట అనొద్దని యెన్నిసార్లు చెప్పాను? సబలలు, వీరనారీమణులు అంటావుకదా అని పనుండి క్లబ్బులో వదిలాను. మేజర్ పశుత్వానికి నేను బాధ్యుడనా? నిన్ను నీవు రక్షించుకునే తెలివిలేదా?...."

"షటప్! అబద్ధాలకు అంతువుండాలి. సిగ్గులేదూ! నీ బ్రతుకెంత? నీవెంత? ఫస్టుక్లాసులో పాసయినవారు ఉద్యోగాలు లేక ఏడుస్తుంటే, అనుభవములేని నీకు ప్రిన్సిపాల్‌షిప్ యెలా వచ్చింది? వాడు పశుత్వముతో ప్రవర్తించాడే అనుకుందాం. మొగవాడివి నువ్వేంచేశావు? ఈసారి చార్‌మినార్ దగ్గర చక్కని గాజులు తెస్తాను, వేసుకుందువు."

"వాగావంటే.... ఇక్కడే చంపిపారేస్తాను."

"అంత అవసరంలేదు. నువ్వు కారు స్పీడుగా పోనియ్యి, నేదూకేసేస్తాను. త్రాగి అలా చేసిందని రేపు అందరితో చెబు



తువుగాని. నీ మొసలికన్నీటికి అందరూ సానుభూతి చూపుతారు...." సాధన కారుహాండిల్ పట్టుకుంది. అతను భయంతో కారు ఆపాడు.

"నన్ను శాంతిగా బ్రతుకనివ్వవా సాధనా!"

"శాంతి.... అదెట్లా ఉంటుంది డియర్! బ్రాందీలాగుంటుందా? విస్కీలాగనా?" నవ్వుతూ సిగరెట్టు వెల్గించింది.

"యెందుకు సాధనా? జరిగినవి మరిచిపో. నేను నిన్ను బాధిస్తున్నానా, అనుమానిస్తున్నానా! హాయిగా ఉందాము. నువ్విలా హోటళ్ళవెంటా, క్లబ్బులవెంటా తిరుగుతుంటే నా పరువేంకాను?"

"భేష్! బాగుంది. పరువు అనే పదానికి అర్థం తెలుసా?" పకాపకా నవ్వింది. సిగరెట్టు గట్టిగాపీల్చి పొగ అతనిమీదికి వదిలింది.

"మిస్టర్ చక్రపాణీ! ఒకప్పుడు నేను హాయిగానే బ్రతకాలని కలలుకన్నాను. కన్నవారు కాబోయే అల్లుడు టీచరే అని బాధపడుతుంటే నవ్వుకున్నాను. ఉన్నంతలో అందరిలా సంసారం చేసుకుంటూ, వీలయితే యేదైనా ఉద్యోగం చెయ్యాలని అనుకున్నాను. మేడలు, మిద్దెలు కావాలని కోరలేదు. కార్లు, షికార్లు కావాలని ఆశపడలేదు. హాయిగా బ్రతకాలనే అనుకున్నాను.... కాని ఆశలు, ఆశయాలు అన్నీ, నీ కోర్కెలకు బలి అయిపోయాయి.... నాలో మిగిలింది.... ఏం మిగిలింది?...." తల డోరుకేసి కొట్టుకుంటూ ఏడ్చింది. వలవలా ఏడ్చింది. ఆమె వెంట్రుకలు చెదిరిపోయాయి. పెదవుల రంగు చెదిరిపోయింది. కళ్ళకు గీసుకున్న

గీతలు కరిగిపోయాయి. ఆమె ముఖం వికృతంగా, వికారంగా కన్పించింది.

"పోనియ్యి....నీకు కావల్సిన హోదా వచ్చిందిగా. సంతోషించు. నన్నేం అనకు. సిగరెట్టులో పోయినజీవిత సుఖాలు కన్పిస్తాయి. సారాయిలో సర్వసుఖాలు కన్పిస్తాయి. ఇంకేం కావాలో చెప్పు! నాశరీరంవల్ల నీకు జరిగే మేలుఏమిటో చెప్పు...." అతను కాసేపు తలపట్టుకు కూర్చున్నాడు. నెమ్మదిగా కారు స్టార్టు చేశాడు. ఇల్లుచేరారు. పనివాడు కనిపెట్టుకుని ఉన్నాడు.

"డైనింగ్ టేబుల్ పై భోజనము పెట్టు. ఇప్పుడే వస్తాను. బట్టలు మార్చుకో సాధనా! భోంచేద్దాం."

"కర్నల్ సింగ్ యింట్లో హోటల్ కు వెళ్ళకముందే తిన్నాను...." నిర్లక్ష్యంగా అని బెడ్ రూమ్ వైపు వెళ్ళిపోయింది. అతను బట్టలుమార్చి తల దిమ్ముగా ఉంటే స్నానము చేశాడు. తల తుడుచుకుని, ఆకలిగా ఉంటే భోజనము చేశాడు. లైట్లు ఆపి పడకగదిలోకి వచ్చేసరికి సాధన గాఢంగా నిద్రపోతుంది. బట్టలుకూడా మార్చలేదు. 'ఈమనిషి కింతతొందరగా నిద్రెలావచ్చింది?' ఆశ్చర్యపోయాడు. బల్లమీద నిద్రమాత్రల సీసా, మంచినీళ్ళ గ్లాసు కన్పించాయి. 'ఇవెక్కడ సంపాదించిందో!' అని నిట్టూర్చాడు. అతన్ని యెన్నో ఆలోచనలు చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. కొన్నాళ్ళపాటు సాధనను తీసుకెళ్ళమని రావుగార్కి ఉత్తరం రాసి పోస్టుచేయాల్సిన ఉత్తరాలలో వేశాడు. యెంతసేపైనా నిదుర రాదు. సాధన అతని కోసమస్య అయింది. కళ్ళు మూసు



కున్నాడు. ఉంహూ! హాల్లోని గడియారం రెండు గంటలు మ్రోగింది. ఇక పని కాదని తనూ ఓ నిద్రమాత్ర వేసుకుని నిదురపోయాడు.

మర్నాడు పదిగంటలకు కాని మెలకువ రాలేదు చక్రపాణికి. మనసంతా మొద్దుబారిపోయినట్టుంది. బద్ధకంగా లేచాడు. పనివాడిచేత సెలవుకబురు పంపాడు స్కూల్ కి. సాధన అప్పటికే తయారయి యెటో వెళ్ళిపోయింది. పనిఅమ్మాయిని అడిగాడు.

"ఏదో తెల్లకారు వచ్చింది. దాంట్లో వెళ్ళిపోయింది" అన్నది. అతను పళ్ళుకొరికాడు. ఆకారు యెవరిదో తనకు తెలుసు. అతను ఓ పెద్ద బిజినెస్ మ్యాన్. పేరు కుమార్ వర్మ. అందరూ వర్మ అంటారు. అతను బంటరిగాడు. యెప్పుడో స్త్రీ మోసంచేసిందట అందుకని పెళ్ళిచేసుకోలేదు. అతనికి ఆడవాళ్లతో తిరగటం అంటే సరదా. సాధన అతనితో తిరగటం అన్నా, అతనింట్లో కూర్చుని పేకాడ్డమన్నా చాలా సరదా. అతనికి చక్రపాణికీ అసలు పడదు. కాఫీ త్రాగి మళ్ళీ పడుకున్నాడు. నిద్రొచ్చింది. పన్నెండు గంటలకు మెలుకువ వచ్చింది. భార్య వచ్చిన జాడలేం కన్పించలేదు. పనిపిల్ల మాత్రం వంటచేసి బల్లపై పెట్టింది. ఈరోజు వర్మతో తాడో పేడో తేల్చుకుంటాం అని వెళ్ళాడు. క్రింద అంతా నిశ్శబ్దంగా ఉంది. నౌకరు పైనున్నారని చెప్పాడు. కోపంగా పైకి వెళ్ళాడు. సాధనేకాక మరో యువజంట ఉన్నారు. అందరూ పేక ఆడుతూ ఉన్నారు. చుట్టూ సిగరెట్టు పీకలు, బల్లమీద బీర్. గ్లాసులు కన్పించాయి అతనిరక్తం సలసల కాగిపోయింది. అక్కడే పీక నులిమి సాధనను చంపేద్దాం అనుకున్నాడు. సభ్యతకాదని ఊరుకున్నాడు. వర్మనే తిరిగి చూచాడు.

"హల్లో మైడియర్ పార్టుమ్యాన్! హౌ డూ యు డూ" వర్మ పలుకరించే విధానముచూచి పాణికి మండిపోయింది. 'వీడొక్కడే ప్రపంచములో టాల్ మ్యాన్ అయినట్టు.'

"హల్లో! సాధనా ఇంటికి వెళ్దాం పద" అన్నాడు. అక్కడ కూర్చున్న మరోజంటకు అప్పుడుగాని టైము [illegible] రాలేదు. త్వరగా లేచి వెళ్ళిపోయారు.

"బై....బై సాధనా...." వారు వెళ్ళిపోయారు "చీరియో వర్మా" అంటూ. అక్కడ చక్రపాణి ఉన్నట్టు ఎ రికీ గుర్తున్నట్లు కన్పించలేదు.

"నాకిప్పుడప్పుడే రావాలని లేదు. మీరు వెళ్ళి భో చేయండి."

"నువ్వు రాత్రికూడా భోంచేయలేదు సాధనా! పద" మృదువుగా ఆమె భుజాలపై చేయివేశాడు.

"శ్రీవారూ! నేనంటే మీ కెంతప్రేమో బెంగుళూ రు లో ప్రతివారికీ తెలుసు. ప్రత్యేకంగా పనికట్టుకు రావాల్సి అవసరంలేదు. నేను చిన్నపిల్లనుకాను. నాకు ఇల్లు తెలుసు. అవసరము అనుకుంటే వస్తాను." అన్నది నిర్లక్ష్యంగా చే కలుపుతూ. తనకేం పట్టనట్టు వర్మ సిగరెట్టు కాలుస్తున్నాడు....

"ఊఁ....నిన్నని ఏంలాభం! సంసారుల కొంపలకు నిప్పులు పెట్టేవారిని అనాలిగాని." కొరకొర వర్మవంక చూచాడు. అతను వంకరగా నవ్వాడు. సిగరెట్టు యాష్ట్రేలో పడే శాడు.

"మిస్టర్ పాణీ! నీ భార్యను అదుపులో పెట్టుకోలే



వన్నా అనేది? నేను ఆమెను కట్టివెయ్యలేదు. తీసుకువెళ్ళు." అన్నాడు.

"ఊఁ...." కోపంగా, అసహాయంగా వెనుతిరిగాడు. సాధనను కొట్టాలన్నా భయమే. యెవరన్నా ఉంటే మరీ విదిలించి వేస్తుంది. ఒకోసారి నాల్గుమెట్లు దిగుతూ, క్రిందకు వచ్చాడు. అతనికి తోచిన తరుణోపాయం ఒక్కటే - బెంగుళూరు వదిలివేయటం. ట్రాన్స్ఫర్ అడగాలని తన ఆఫీసరువద్దకు వెళ్ళాడు.

సాధనా, వర్మా నిశ్శబ్దంగా కూర్చున్నారు. పది నిమిషాలు దొర్లిపోయాయి.

"పద సాధనా భోజనం చేద్దాం."

"మీరు వెళ్ళండి. నాకు ఆకలిగాలేదు."

"డోంట్ బి సిల్లీ. పద." అతను మృదువుగా ఆమె చేయిపట్టి లేపాడు.

"నేనంటే మీ కెందుకింత అభిమానం వర్మాజీ!" ఆమె కళ్ళల్లో నీరూరింది.

"కొన్నింటికి అర్థాలుండవు సాధనా! ఒకవిషయము చెప్తాను వింటావా?" ఇద్దరూ మెట్లు దిగుతుండగా అడిగాడు.

"చెప్పండి. సందేహమెందుకు?"

"నీవు నీ భర్తమీది కోపంతో నీ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నావు. పతనమై పోతున్నావు. భర్తతప్ప నీకెవరూ బంధువులు లేరా?"

"యెందుకు లేరూ! వద్దు....అవన్నీ గుర్తుచేయకండి" అన్నది.

"గుర్తుచేసుకోకుండా యెలా వుంటావు? నిన్ను కన్న తల్లిదండ్రులు నీపై యెన్ని ఆశలు పెట్టుకున్నారో తెలుసా!"

"వారికి కూతురు లేదు....సాధన చచ్చిపోయింది."

"యెంత తేలికగా అనేశావు? నేనూ నీలాగే ఆలోచించాను. సుమన నన్ను మోసంచేశాక, అందరినీ మరిచిపోయాను. కనిపించిన స్త్రీనల్లా నలిపివేశాను. త్రాగాను....తందనాలాడాను. ఏవిధంగా సుమనపై కసితీర్చుకున్నానో తెలియలేదు ఆమె హాయిగా భర్తతో ఉంది. నష్టపోయింది నేను. తెలివి వచ్చి చూచుకుంటే ఏముంది? అంతా శూన్యం. నా పతనం చూడలేక అమ్మ చనిపోయింది."

"నన్నేం చేయమంటారు?" పసిపిల్లలా బావురుమంది.

"నిన్ను నీవు సంబాళించుకో. ఇంకో ఆరునెలలు చూస్తాడు. అతను తిరిగి వివాహం చేసుకుంటాడు. నీ నడత బాగా లేదని నిరూపిస్తాడు. నష్టపోయేది అతనా? నీవా?"

"నాకిప్పుడు లాభ నష్టాలు రెండూ సమానమే వర్మగారూ! అత నెలా పోయినా నాకేం అవసరం లేదు."

"జీవితంలో ప్రేమ ఫలించకపోతే పతనమయిపోవడమేనా?"

"నా కిన్ని చెప్పారు; మీ రెందుకు వివాహం చేసుకోలేదూ?"

"చెప్పానుకదా, నిజాన్ని గ్రహించలేక. ఇకపైన ఆ విషయము ఆలోచిస్తాను. శ్రేయోభిలాషిగా చెబుతున్నాను. ఈ త్రాగుడు, సిగరెట్లు, క్లబ్బులు అన్నీ మానేయి. వివాహమే జీవితానికి సార్థకత కాదు. పై చదువులు చదువు...."



"నామనసు నాఅధీనంలో లేదు వర్మగారూ!" "నీవు ప్రయత్నిస్తే అదే నీఅధీనంలోకి వస్తుంది." ఇద్దరూ చేతులు కడుక్కొని బల్లముందు కూర్చున్నారు. అతను ప్లేటులో అన్నం పెట్టి నెయ్యి వేశాడు.

"కూర వెయ్యమంటావా, పప్పు?" సాధన అతనివంక చూచింది.

"త్వరగా చెప్పు" 'చెల్లాయి! ఉప్మాలో పచ్చిమిరపకాయలా, యెండుమిరపకాయలా?' అని అడిగే కిషోర్ గుర్తుకు వచ్చాడు.

"ఏమిటలా చూస్తున్నావు?"

"ఏం లేదు...." అన్నది అన్నం కెలుకుతూ. తనను ప్రేమించే అన్నా, అభిమానించే తల్లిదండ్రు లున్నారు. చక్రపాణితో తన ప్రేమ, వివాహము పీడకల అనుకుంది.

"అలా కెలికితే కడుపునిండదు." వర్మ హెచ్చరించాక త్వరగా అన్నం కలిపి ముద్దలు మింగింది.

"ఇంటికి వెళ్తావా. రెస్టు తీసుకుంటావా?"

"ఇంటికి వెళ్తాను. వెంటనే అన్నయ్యకో ఉత్తరం రాయాలి." అన్నది. అతను తన కారులో తెచ్చి ఆమెను దిగబెట్టాడు.

"వస్తాను...." దిగింది.

"సిగరెట్టుపెట్టె ఇలా యివ్వు." అన్నాడు. ఆమె ఇచ్చింది.

"మీరు అమాయకులండీ వర్మగారూ! నేను కాల్చుకుంటే సిగరెట్లు కరువా? ప్రామిస్ చేస్తున్నాను. త్రాగను, పొగ పీల్చను. సరా?"

"బి ఎ గుడ్ గర్ల్. చీరియో...." చెయ్యి నొక్కి వదిలాడు. సాధన ఇంట్లోకి వచ్చేసరికి చక్రపాణి బోనులో పులిలా తిరుగుతున్నాడు. అతన్ని చూచి నవ్వుకుని గదిలోకి వెళ్ళింది. అతను గది గుమ్మములో ఆగిపోయాడు.

"ఏమైనా చెప్పాలా?"

"వినేస్థితిలో ఉన్నావా?"

"అంతగా దిగజారలేదు మై రెవరెండ్ హస్‌బెండ్!" నవ్విందామె.

"ఇలాగయితే సంసారం సాగేది యెలా?"

"యెలాగంటే సాగుతుందో చెప్పు?"

"..........."

"చెప్పలేవు కదూ! వండిపెడుతూ, సీతాకోకచిలుకలా అలంకరించుకుని తిరగాలి. మనకు ఉపయోగపడనివారు ఇంటికి వస్తే పురుగును విదిల్చినట్టు విదిల్చి కొట్టాలి. మనకు పనులు గడుస్తాయి అనుకుంటే పడకగదిలోకి పిల్చి లాలించాలి. కవ్వించి, సర్వస్వము దోచి యివ్వాలి. అవునా! పదిమందిలో పతివ్రతలా పోజులు పెట్టాలి. మీరే నా దైవము... అంటూ పూజించాలి...."

"చాలు.... ఇక ఆపు." అరిచాడు.

"నిజాలు.... నీ హృదయములోని భావాలు చెప్తే వినలేం? అంతా మేకపోతుగాంభీర్యమేనా?" పకపక నవ్వింది.

"అలా నవ్వకు. నాకు చిరాకు...."

"నీకు చిరాకెత్తించే పనులంటే నాకు చాలా సరదా!"

"అయితే మనము కలిసి ఉండటం సంభవము కాదు."



"కలిసిఉండామని యెవడు ఏడ్చి నీ పాదాలు పట్టుకున్నాడు?"

"అయితే ఆ దగాకోర్....లుచ్ఛా వర్మగాడితో ఉంటావా?"

"ఉంటే తప్పేం? హోదా, డబ్బూ మీ ఆఫీసర్లకంటె చాలానే ఉందతనిదగ్గర."

"ఛీ....వాడిదీ ఓ బ్రతుకే...."

"ఆపండి. మర్యాదలేక మాట్లాడకండి. భార్యశీలాన్ని తన ఉన్నతికోసం వెచ్చించే మనుష్యులకంటె నీచులు యెవరూ ఉండరు. అతను మీలాంటి యెంతోమందికంటె ఉత్తముడు."

"అయితే అతని ఆకర్షణ బాగా ముదిరింది."

"నోరు ముయ్యి. లోకమంతా నీలాగే అనుకోకు."

"నేను ఊరుకుంటే నన్నే దబాయిస్తున్నావే...." కోపంగా ముందుకు వచ్చాడు.

"యెందుకా కొరగాని పౌరుషం పాణిగారూ! అక్కడే ఉండండి. నన్ను ముట్టుకునే అర్హత నీకు లేదు. రెండు మూడు రోజులలో వెళ్ళిపోతాను. నువ్వే ఉండు. మరో అమాయకురాలి గొంతు కొయ్యి. మరో బంగళా సంపాదించు. ఆమె ద్వారా పనులు సాధించు."

"అదంతా నీ కనవసరం...."

"అనవసరం గనకనే వెళ్ళిపోతున్నాను. అవసరమనుకుంటే నీజీవితం నరకం చేయగలను. నరకం ఎలా ఉంటుందో, ఈ నాల్గు నెలల్లో అనుభవానికి వచ్చిందనుకుంటాను."

"ఇంకా వాదంమెందుకు? వెళ్ళిపో. నాడు....వర్మగారు తన్ని తగిలేసినరోజుగాని తెలిసిరాదు."

"అలాంటి అవకాశం వచ్చినా, నీదగ్గరకు రాను తెల్సిందా?" విసురుగా చేతిలోని బ్యాగు దూరం గిరాటు వేసింది. బయట కారుహారన్ వినిపించింది. చక్రపాణి కోపంగా బయటికి వెళ్ళాడు. సాధన కిటికీలోంచి చూచింది. కొత్తగా క్లబ్బులో చేరిన శ్రీకాంత్. ఆమెకు పాణిని ఉడికించాలని బుద్ధిపుట్టింది. వెంటనే బట్టలు సర్దుకుని, పౌడరు అద్దుకుని బయటకు వచ్చింది.

"హల్లో శ్రీకాంత్!" అతనితో చేయి కలిపింది.

"మీవారు నీకు ఒంట్లో బావుండ లేదన్నారుగా!"

"ఆయనకు మనసులో బావుండలేదు. మెంటల్ ఆస్పత్రికి పంపాలి. పద." అతని కార్లో కూర్చుంది. ఇక ఏవిధంగానూ, తనకూ సాధనకూ పొత్తు కుదరదని తెలుసుకున్నాడు పాణి. గాఢంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయాడు.

## 14

"రజనీ! బావగార్కి సీరియస్‌గా ఉందట, అక్క టెలిగ్రాం ఇచ్చింది." హడావుడిగా వచ్చాడు రంగారావు.

"అయితే వెంటనే వెళ్ళండి పాపం! మొన్నటూ తొందర పెట్టారు మీ అక్కయ్య." రజని బాబును జోకొడుతూ అన్నది.



"ఎలా వెళ్ళాలి రజనీ? చేతిలో డబ్బేదీ? నెలాఖరు రోజులు. ఇంటి అద్దెలు అవి ఉంటే ఇంకా బావుండేది."

"అందుకే నేను అంటాను. ఏదైనా ఉద్యోగం చేస్తానని...."

"చాల్లే. ఉద్యోగం చేసే ఆడవాళ్ళసంగతి నేను ఎరగనా! ఓ నీతా, నిజాయితీనా?...."

"నన్ను వద్దంటేమానె. అందరినీ అంటారేం?" అందామని నోటివరకు వచ్చింది. తరవాత జరిగే గొడవ తెలుసు. అందుకే మౌనము వహించింది.

"రేపు ఎక్కడయినా ప్రయత్నిస్తానులే." అన్నాడు. అతనికి వచ్చినదాంట్లో ఇంటికి పంపాలి. తల్లి దండ్రు లున్నారు. వారికి ఎంతతక్కువ చూచినా వంద అవుతుంది. ఇద్దరన్నలు తమ సంసారాలతోనే ఆరాటపడుతున్నారు. ఒక్క అక్క పెళ్ళయింది. బావ హైస్కూల్లో టీచరు. ఇద్దరు పిల్లలు. మర్నాడు స్నేహితులదగ్గర ఓ యాభై రూపాయలు పుట్టించుకుని బ్యాగు సర్దుకుంటుండగానే మరో టెలిగ్రాము వచ్చింది- బావగారు పోయారని. వెంటనే కర్నూలు వెళ్లాడు. బావగారి దినవారాలకు అంతా వచ్చారు. సానుభూతి చూపారు. అతనికి గుండెజబ్బట. విశ్రాంతి తీసుకొమ్మని డాక్టర్లు చెప్పారు. అయితే ఇల్లు గడిచేదెలా? జబ్బును నిర్లక్ష్యం చేస్తూ అతను ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు. పదకొండో రోజున ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. రంగారావు తండ్రికి కూతుర్ని గూర్చిన దిగులు ఉంది; అయితే అతను ఏమీ చెయ్యలేడు. రెక్కలువిరిగిన పక్షి. ధైర్యంగా ఏకొడుకుతోనూ చెప్పలేదు.

"ముందు సంగతెలా తల్లీ? మీ అత్తగారింటివాళ్ళు ఒక్కమాట అయినా అనలేదు."

"ఆడపిల్లలకు చదువెందుకని నన్ను బడి మాన్పించారు ఆనాడు. ఈనాడు నా చేతులు విరిగిపోయాయి. నాల్గిళ్ళు చల్లగాఉంటే పాచిపని దొరక్కపోదు...." ఏడుస్తూ అంది రంగారావు అక్క సుగుణ.

"ఊర్కో అక్కా! మేమంతా లేమూ!" ధైర్యం చెప్పాడు. అయితే దూరంగా ఆమెను ఒంటరిగా వదలటమెందుకని తన వెంబడే తీసుకుని వచ్చేశాడు. తల్లిదండ్రులు విశాఖదగ్గరున్న తమ ఊరెళ్ళిపోయారు.

"ఇంతకంటె మరోమార్గం కన్పించలేదు రజనీ! అక్కయ్యను గాలికివదిలి రావాలన్పించలేదు. తనకు చదువులేదు. మరేపనీ రాదు." ఆరాత్రి భార్యకు సంజాయిషీ యిచ్చాడు రంగారావు.

"మంచిపని చేశారు. అయినవాళ్ళము మనము కాకపోతే యెవరు ఆదుకుంటారు? సుందరమ్మపిన్నికి అన్నలు తమ్ములు లేక ఎంత బాధపడిపోయిందో. మనతోపాటే ఆవిడ ఉంటారు" అన్నది రజని. కాలంరాపిడికి, భర్త సాధింపులకి నలిగి చాలా ఓర్పు అలవర్చుకుందామె.

"అన్నయ్యలు మాటవరుసకైనా రమ్మని అనలేదు." అతని బాధ.

"వాళ్ళకు పిల్లలు, ఖర్చులు....పోనివ్వండి మనదగ్గర ఉంటారు." రజని ఏఅడ్డూచెప్పకపోయినా, రావుకే యెన్నో



ఇబ్బందులు కన్పించాయి. తమకే బొటాబొటిగా సరిపోయేది. ఇకా ముగ్గురు జత. ఇద్దరుపిల్లలు చదువుకున్నారు. ఎలా? బాబు పుట్టినప్పుడు స్నేహితులు బలవంతముచేస్తే పదివేలకు ఇన్సూర్ చేశాడు. అదన్నిపోగా వచ్చేదాంతో గడపటం చాలా కష్టం. తనుమాత్రం ఏంఖర్చు చేస్తున్నాడని తగ్గించటం? అతనికి అదే దిగులు.

"నాలాంటివారికి వంటపనితప్ప మరేపనీ దొరకదా రంగా!"

"నేనుండగా నువ్వు పనిచేయాల్సినస్థితి రాదక్కా ..."

"నువ్వు లేవనికాదురా. అమ్మా, నాన్నలకు పంపుతున్నావు. మేం ముగ్గురము. ఏమిటో నాకాలం ఇలా గడిచిపోతుంది. భీమా చేయించమని అంటే ఆయన అశుభంగా భావించేవారు. ఉన్న చదువేదో చదువుతారు. నేనూ ఊర్లోనే పిల్లలతో ఉంటాను." అన్నది సుగుణమ్మ.

"అలా అంటావేం? రజని ఏమైనా అన్నదా?" అతని ముఖంలో రంగులు మారిపోయాయి.

"ఛ. ఆ అమ్మాయి చాలా మంచిదిరా. నాకెన్నో విధాలుగా ధైర్యం చెబుతుంది."

"నువ్వేం దిగులుపడకు ఉన్నదాంట్లోనే అందరం గడుపుకుందాం." అన్నాడు. నెల గడిచేసరికే రజని గొలుసు తాకట్టు పడింది. పిల్లలను కొత్తగా బడిలో చేర్పించటం, ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాలు అన్నీ అయ్యేసరికి అప్పు తెచ్చిన డబ్బుకూడా మిగల్లేదు.

"రజనీ! ప్రతినెలా అప్పుతెచ్చి యెలా తీరుస్తాం?"

"ప్రతినెలా యెందుకవుతుంది? ఈనెలంటే ... లున్నాయి."

"అన్నయ్యలకు ఉత్తరం రాయరా? అమ్మా, నా సంగతి వాళ్ళు చూచుకుంటారు."

"ప్రయత్నించండి" అన్నది. 'నేను యెక్కడయినా ప... చేస్తే' అందామని నోటివరకు వచ్చి వెనక్కు తీసుకుంది. ... జవాబు ఆమెకు తెలుసు.

"అమ్మాయి నువ్వు యెందాక చదివావు?" సుగు... అడిగిందో రోజు రజనిని.

"బి.ఎస్సి. వరకు చదివానండీ" వినయంగా జవాబు చెప్పింది.

"అదేమిటమ్మా! మెట్రిక్ చదివినవారు ఉద్యోగాలు చేస్తున్నారు. నీ కిష్టంలేదా?" సుగుణకు దాపరికాలు, ఫార్మా... లిటీస్ తెలియవు. మనసులో ఉన్నమాట అడిగేస్తుంది.

"ఉద్యోగం. ఇంటిపనీ అంటే కుదరదండీ. అదీకా... బాబును యెక్కడ వదలాలి? అత్తయ్యవచ్చి ఉంటానేమో అంటే ఆవిడ ఊరువదలి రానన్నారు." భర్తసంగతి చెప్పలే... అప్పటికి ఆసంభాషణ ఆగిపోయింది. మర్నాడు నీరద వచ్చింది. రజనికి ప్రాణం లేచివచ్చింది.

"నేను....చూస్తుంది రజని....రజనేనా?"

"నీ ఆశ్చర్యంకూల, రావే...." నవ్వుతూ ఆహ్వా... చింది. ఒక్కఛాయ తక్కువ ఉన్నవారు కాస్త నిండురంగు... కట్టుకుంటే వారికి టేస్టు తెలియదని గంట లెక్చరిచ్చే రజ...



ముదురు వంగపండురంగు రాజ్‌కోటచీర కట్టుకుంది. పూర్తిగా కాంట్రాస్టురంగు జాకెట్టు వేసుకుంది.

"ఇదిగో మా బాబు యెలా వున్నాడు?"

"వాడికేం రాజాలా వున్నాడు." కుర్రాడిని యెత్తుకుని ఎగురవేసింది.

"ఏమిటే మొరటుతనము...."

"వీడా అబ్బాయి అరిగిపోడులేవే" నీరద నవ్వింది. ఎమ్. ఎస్సి.పూర్తిచేసి ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేస్తోంది.

"మా వదిన...." అక్కడికి వచ్చిన సుగుణను పరిచయము చేసింది రజని. పరస్పరం నమస్కరించుకున్నారు.

"ఏమే పెళ్ళెప్పుడు?"

"మీరంతా సుఖపడుతున్నారుగా. చాలు తల్లీ. గోపాల్‌ను పెళ్ళిచేసుకోక చంద్ర పెద్దగండం తప్పించుకుందే."

"పెళ్ళి జూదంలాంటిదే నీరదా! రాధన చూడు, ప్రేమించి పెళ్ళిచేసుకుంది. ఇప్పుడు చదువుకుంటానని వచ్చేసింది. అసలేంజరిగిందో చెప్పదు."

"నిజమా! అతను చాలా సరదా అయిన మనిషిలా కన్పించాడుకదే." అన్నది నీరద ఆశ్చర్యంగా.

"మనుషులు పైకి కన్పించినంత మంచిగా వుండరు. అతనో అవకాశవాది. దీనిసంగతి తెలుసుగా అటు రత్నకు ఏంతక్కువ చెప్పు? అది తనబాధ ఏమిటో చెప్పదు. రోజు రోజుకు నీరసించిపోతుంది. బాబు పుట్టిపోయినదగ్గరనుండి

మంచం పట్టింది. డబ్బున్నవారు, నీళ్ళలా ఖర్చుపెట్టి రక్షించు కున్నారు."

"ఇవన్నీ వింటుంటే పెళ్ళే వద్దనిపిస్తుందే."

"అదేం మాట. ఇప్పుడు మాత్రం సమస్యలులేవా అమ్మాయ్?" సుగుణ అడిగింది. "సమస్యలు లేకేం? ఆలస్యంగా ఇంటికివస్తే అనుమానంతో చూచే జనం, ఆరాతీసే పెద్దలు ఒంటరితనం, ఏదో వెలితి."

"మీరన్నది నిజమేనండీ. పెళ్ళి అయినవారికీ, కాని వారికీ ఎవరి సమస్యలు వారికున్నాయి. రజనీ! నేనోమాట చెప్పాలని వచ్చానే." బాబు జారుతున్నాడు.

"ఏమిటమ్మా? త్వరగా చెప్పు." బాబును అందుకుని

"మరి నాకేమిస్తావు?"

"ఏంకావాలంటే అది. ఊరించక చెబుదూ."

"మా కాలేజీలో డెమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసే అమ్మాయికి పెళ్ళి అయింది. వాళ్ళాయనతో స్టేట్స్‌కి వెళుతుంది. ఆపోస్టు ఎవరికివ్వద్దు, నా స్నేహితురాలుందన్నాను. ప్రిన్సిపాల్ చాలా మంచావిడ. అంగీకరించింది. తమరు వేంచేసి మా కాలేజీ పావనం చేయాలబ్బా....మరిచిపోయాను....పావనము చేయాలమ్మా."

"అంత కంగారెందుకే? మా రత్న లేదు వెక్కిరించటానికి."

"అది పోనివ్వు. నే నింత మంచివార్త తెస్తే థాంక్స్ కూడా లేవులే?" చిన్నబుచ్చుకుంది నీరద.



"నీ అభిమానానికి థాంక్స్. నాకు ఉద్యోగం చెయ్యాలని లేదు."

"ఇలా ఆయన వద్దంటారా?"

"అలాంటిదేం లేదు. ఇల్లూ, బాబు....ఎక్కడ కుదురుతుంది?"

"ఇల్లూ, బాబును నేను చూసుకుంటానుగాని, ఆ పనేదో నువ్వు చేసుకో అమ్మాయి" సుగుణ అడ్డువచ్చింది.

"అదికాదు వదినా!"

"ఏదికాదు....నామాట విను. నేనా ఏం చెయ్యలేను. ఈ విధంగా ఇల్లయినా చక్కబెట్టుకుంటాను. రంగడి బరువు తగ్గుతుంది."

తను ఏవిధంగా వారికి చెప్పాలో తెలియలేదు. వాళ్ళు అలా మాట్లాడుతుండగానే రంగారావు వచ్చాడు. 'దీనమ్మ నవ్వు చల్లగుండ ఆయనముందు ఉద్యోగంమాట ఎత్తకుంటే బావుండును. నాసంగతి దేముడెరుగు. దాన్ని అవమానిస్తారు' అనుకుంది.

"నమస్కారమండీ...." నీరద నవ్వుతూ చేతులు జోడించింది.

"నమస్కారము....అంతా క్షేమమా?"

"ఏదో మీదయవల్ల."

"ఇదిగో నీరదా! బాబును కాస్తతీసుకో. నేను కాఫీ తెస్తాను." వారిద్దరి సంభాషణ త్రుంచాలని బాబును అందివ్వబోయింది.

"ఆవిడ కెందుకు? ఇలా తే." సుగుణ బాబును ఎత్తుకుంది. రజనికి ముచ్చెమటలు వస్తున్నాయి. వంటయింట్లోకి వెళ్ళింది. చెవులుమాత్రం డైనింగ్ రూమ్‌లోనే ఉన్నాయి.

"మీ కాలేజీ విశేషాలు ఏమిటమ్మా?"

"విశేషముండే వచ్చానండీ. అక్కడో డెమాన్‌స్ట్రేటర్ పోస్టు ఖాళీగా ఉంది. రజని చేస్తుందేమో అడగాలని వచ్చాను."

రజనికి వణుకుపుట్టింది. ఏమంటారో. నీరద ఏం మిస్‌అండర్‌స్టాండ్ చేసుకుంటుందో నని. 'ఆపద్బాంధవా!' అనుకుంది. ఊపిరి బిగబట్టి భర్తమాటలకు వేచింది.

"తనకు చెప్పు. ఇష్టమైతే చేస్తుంది." రజని తన చెవులను తాను నమ్మలేకపోయింది. 'కలా'నిజమా!' 'నువ్వు చేస్తున్నావు చాలదూ?' అనో లేక ఉద్యోగాలుచేసే స్త్రీలపట్ల నాకు నమ్మకం లేదనో అంటాడనుకుంది. అలా మొన్నొకసారి తండ్రిముందు, ఇతరులముందు అవమానము పొందినది.

"తనతో చెప్పాను. ఏవో కుంటిసాకులు చెబుతుంది." రజనిపైన నేరారోపణ చేస్తున్నట్లు అన్నది నీరద.

"మీ స్నేహితురాలికి మీరు చెప్పలేకపోతే నేను చెయ్యగలను?" అతను నవ్వాడు.

"మీరు గట్టిగా చెప్పండి. ఇల్లు తను చూచుకుంటాను మీ అక్కగారు హామీ యిచ్చారు. ఇంకేంకావాలి?"

"సరే. ప్రయత్నిస్తాను." అన్నాడు. రజని ఆశ్చర్యంలో కాఫీలో పంచదార వెయ్యటంకూడా మరిచిపోయింది.

"చూచారా, మీ ఆవిడ ప్రేమ! స్నేహితురాలుకదా అని యింత మంచివార్త మోసుకువస్తే పంచదారలేని కాఫీ యిచ్చింది."



"సారీ నీరూ!...." రజని సిగ్గుపడిపోయింది. పంచదార తెచ్చి కలిపింది. మరో అరగంట ఉండి నీరద వెళ్ళిపోయింది. రజనికి భయంగానే ఉంది. కొన్నిసార్లు అప్పుడు మౌనము వహించి తరువాత సాధిస్తాడు రంగారావు. అందుకే భోజనాలు అయ్యాక చాలాసేపు బయటగదిలో మేనల్లుడికి పాఠాలు చెప్తు మిషతో ఉండిపోయింది.

"రజనీ! బాబు లేచినట్లున్నాడు." భర్త కంఠము విని తప్పదురా....అనుకుని గదిలోకి వెళ్ళింది.

"రజనీ! ఇలా రా...." అతను పిలిచాడు. ఆమె క్రింది పెదవి కొరుకుతూ వెళ్ళి మంచం చివర కూర్చుంది.

"మీ నీరద కేంచెప్పావు?"

"నేనా! ఏం చెప్పందే? అయినా ఆడవారికి ఉద్యోగాలు ఎందుకండీ. మంచి మర్యాద ఉండదు. నీతి, నిజాయితీ మరచిపోవాలి." అన్నది పాఠం వప్పగించినట్లు.

"రజనీ!" అతను ఆశ్చర్యపోయాడు. స్త్రీ....ఆమె స్వాతంత్ర్యం అంటూ వివాహమైన కొత్తలో వాదించే భార్యేనా! పురుషుడి ఆధిక్యతకు అబలయై స్త్రీ ఎలా లొంగిపోతుంది! లొంగిపోక తప్పదా! లొంగకపోతే తమ సంసారము....సాధన సంసారంలాగే అయ్యేదా!

"మీరా విషయము మరచిపోండి. ఏదో తను చేస్తుంది కదా అని నన్ను చెయ్యమంది. స్నేహితురాలు గట్టిగా చెప్పకే...."

"రజనీ! నీవు హృదయపూర్వకంగా అంటున్న మాటలా?"

"బావుంది. హృదయంలో ఓటి, బయటికో ఉద్దేశం ఉంటుందా!" అన్నది 'పెళ్ళిరోజే ఆ హృదయము మూలకు దాక్కుం'దని మనసులో రోదిస్తూ.

"నిజం?"

"నిజమండీ...." పడుకుంది. "నాకు నిద్రొస్తుంది. ఆ విషయము మరిచిపోండి." ముసుగు తన్నింది.

"ఇదివరకు నీకు ఉద్యోగం చెయ్యాలని సరదా ఉండేది కదా?"

"ఏదో పిచ్చి. తెలియక అనేదాన్ని. ఆడదానికి వంటిల్లే స్వర్గం...." అన్నది. అతని కేం తెలుసు ఆమె కన్నీరు బలవంతంగా ఆపుకుందని. తను బ్లాంకెట్టు తీసి కప్పుకున్నాడు.

మర్నాడు ఎందుకో ముభావంగా ఉన్నాడు రంగారావు. అతని ముభావానికి కారణం తెలియలేదు.

"మీ అన్నగారు ఉత్తరం రాశారా?" అన్నది.

"ఆఁ...." అన్నాడు.

"ఏం రాశారు?"

"వాళ్ళ గొడవలు ఎందుకులెద్దూ, ఇక్కడ మనకు గొడవలు లేనట్టు" విసుక్కున్నాడు.

"దానికి విచారం దేనికి? మనమే ఎలాగో అవస్థ పడుదాం."

"ఎలాగ రజనీ! నా కేం తోచటం లేదు. ఇన్సూరెన్స్ కట్టడం ఆపుదామంటే మనసురాదు. ఒకవేళ నేను బావలా..."



"ఊర్కుందురూ, మీరూ మీ మాటలూను. మనము పైగదులలోకి వెళ్ళి క్రిందఇల్లు అద్దెకు ఇద్దాం."

"పైన మన వాటావి రెండుగదులేగా?"

"మరేం ఫరవాలేదు. ఎందరో అలా రెండు గదులలో ఉండేవారున్నారు." అన్నది నచ్చచెప్పే ధోరణిలో.

"మనము అలా ఉండలేము రజనీ....నువ్వు....నువ్వు.." సైన అతనికి మాటలు కరువయ్యాయి.

"నేను....ఏంటో చెప్పండి."

"ఈ పరిస్థితులలో నువ్వు .... మీ స్నేహితురాలు చెప్పిన జాబ్ లో చేరు రజనీ...." అపరాధిలా తల దించుకున్నాడు.

"మీరు నన్ను పరీక్షిస్తున్నారా?" ఆమె అహం దెబ్బతిన్నది.

"లేదు రజనీ! నిజమే చెబుతున్నాను. నన్ను అవకాశవాది అన్నా, ఇంకేమన్నా సరే. చేతులారా వచ్చిన ఛాన్స్ పోగొట్టుకోవద్దు."

"మీరు...." ఆమె నోరు వెళ్ళబెట్టింది. తన భర్తయిలా అడగటం?

"నాకు అప్పులన్నా, అబద్ధాలు ఆడి జీవితం వెళ్ళమార్చడం అన్నా చాలా భయం. నా ప్రవర్తనకు నాకే సిగ్గుగా ఉంది."

"వద్దండీ. ఎలాగో సర్దుకుందాం. బయటకు వెళ్ళాక

ఎందరితోనో మాట్లాడాలి. మన సంసారంలో గొడవలు రావటం నా కిష్టంలేదు." అన్నది తలాడిస్తూ.

"అలాంటి గొడవలు రావని నేను హామీ యిస్తున్నాను. ఇంట్లోకూడా ఇబ్బందిలేకుండా అక్కయ్య చూసుకుంటుంది. ఆమె అందరిలాంటిది కాదు. అమాయకురాలయినా పరిస్థితులు అర్థంచేసుకోగలదు. అక్కయ్య పిల్లలు తెలివిగలవారు. వారిని వారిమానాన వదలివేస్తే నాకు శాంతి ఉండదు.'

"అలా వదలమని నేను అన్నానా?"

"లేదు రజనీ! నన్ను క్షమించు. నాలో ఏవో భావాలు పాతుకుపోయి, స్త్రీ స్వేచ్ఛ అంటే గిట్టేదికాదు.'

"ఒకేసారి అంతలా దిగజారిపోవద్దు...." అక్కడినుండి వెళ్ళిపోయింది. ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చింది.

"ఊహుఁ....తన అవసరంకొద్దీ ఆశయాలను మలచుకునే మనుషులు. నేను ప్రాణంఉన్న మనిషిని అనే జ్ఞానము ఈ మనిషికి ఎందుకు లేదు? నా ఆశయాలను, ఆచరణను నిర్దాక్షిణ్యంగా, కఠినాతికఠినంగా విమర్శించిన వ్యక్తి! 'క్షమించు' అని ఒక్క పదంతో అన్నీ కడిగేసుకున్నాడు. శాసించడమే తమ హక్కు అనుకుంటారీ మొగవారు. తనను బజారుకు ఒంటరిగా పోవద్దన్నాడు.... నైటు డ్రెస్సులు భోగంవాళ్ళేసుకుంటారన్నాడు. మాచింగులు, ముస్తాబులు సంసారలక్షణాలు కావన్నాడు. అన్నీ సహించటం నేర్చుకుంది. ఎందుకు? ఆడదై పుట్టినందుకు. అన్నీ తనిష్టమేనట. ఏమయినా సరే, ఈ ఉద్యో



గం చెయ్యనుగాక, "చెయ్యను...." దిండులో తలదూర్చి ఏడ్చింది. అతను బయటికి వెళ్ళినట్టున్నాడు. పిల్లల గోల వినిపిస్తుంది.

"రజనీ!" సుగుణ పిలిచింది. ఆమె నెమ్మదిగా వచ్చి మంచముపై కూర్చుని మరదలి తల నిమిరింది.

"ఎందుకమ్మా! నీ బాధ ఏమిటో నాతో చెప్పకూడదూ?"

"ఏం లేదు వదినా....ఏం లేదు." లేచి కూర్చుంది. తొందరపాటు జరిగింది. 'ఈ అభాగ్యురాలు తనవల్లే ఈ ఏడ్పులు, అంగలార్పులు అనుకోదుకదా!"

"ఏం లేనిదే ఏడుస్తారా? రంగడు ఏమైనా అన్నాడా?"

"అదేం లేదు వదినా! ఏదో గుర్తుకు వచ్చింది, అంతే. రేడియోలో మంచినాటిక ఉంది విందాం పదండి."

"రజనీ! నేను చిన్నపిల్లను కాను మరిపించటానికి. నీవేదో బాధ పడుతున్నావు. ఆర్చడం, తీర్చడం నా వల్ల కాకపోయినా, కనీసం వినగలను. నీ హృదయము తేలికపడుతుంది...." ఏ ఆడబిడ్డా అంత ప్రేమగా అడుగదు. దాచుకోలేక అంతా చెప్పి ఆమె భుజంపై తలవాల్చి భోరుమంది.

"ఊరుకో....ఊరుకో రజనీ! అనాదిగా పురుషుడు శారీరకంగా బలవంతుడు కావడంవల్ల అతనికి స్వాతంత్ర్యం లభించిందమ్మా! నేను ఎక్కువ చదువుకోలేదు. మీరు యిన్ని పుస్తకాలు చదివారుగా. పూర్వం స్త్రీజీవితం ఇంకా హీనంగా ఉండేది. ఇష్టమున్నా లేకపోయినా భర్తతో సజీవదహనం చేసేవారు. అంతదాక ఎందుకు? అమ్మను చూడు. నాపెళ్ళి

వరకు నాన్నతో మాట్లాడటం నేను చూడలేదు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఇంట్లో వస్తువులన్నీ తన్నేవారు."

"మామగారు అలా కన్పించరు." కళ్ళు తుడుచుకుంది రజని. "కాలంతో పాటు మారుతున్నారు. రంగారావుకు వారి సత్వం కొంచెం వచ్చిందేమో. నా తమ్ముడని కాదుగాని, స్వతహాగా మంచివాడు రజనీ! చదువుకున్న దానవు. ఇంత దానికే ఏడుస్తారా? నెమ్మదిగా వాళ్ళే మారిపోతారులే. ముఖం కడుక్కో." ప్రేమగా వెన్ను నిమిరింది.

## 15

"ఏమిటి శివరామ్‌గారూ! చాలా సంతోషంగా ఉన్నారు!" అతను కూర్చున్న దగ్గరకు వచ్చాడు రఘు.

"సంతోషంగా ఉన్నానని నీ కెలా తెలుసు!" నవ్వుతూ అడిగాడు.

"అదిగో ఆ నవ్వే చెబుతుంది." తనూ కూర్చున్నాడు.

"నిజంగా చాలా సంతోషంగా ఉంది రఘూ. రత్న యెప్పటిలా లేచి నవ్వుతూ తిరుగుతుంది."

"మీరామెకోపం ఇంత బాధపడ్డారని, పడుతున్నారని ఆమె కేం తెలుసు? మీ రిలా దూరంగా ఉంటే, మీమధ్య అగాధం పెద్దదవుతుందే తప్ప పూడుకోదు."



"ఆసంగతి నాకు తెలుసు రఘూ! ఆమెదగ్గరకు వెళ్ళే మనోధైర్యం లేదు. ఇద్దరమూ మాటలతో మనసులు పాడు చేసుకుంటాం."

"ఇప్పటికే పనివారంతా తలోకరకంగా మీ దాంపత్యంగురించి చెప్పుకుంటున్నారు. అది నాకిష్టం లేదు."

"నాకూ యిష్టంలేదు. ఇంతకంటె మరో మార్గం లేదు."

"ఇద్ద రిలా బిగదీసుకుంటే యెలా? నీవు మొగవాడివి అనేఅహం వదలవు. ఆమె తను చూచింది మరిచిపోయి క్షమించ లేదు. పొరపాటు నీదని అనుకున్నప్పుడు ఆమెతో రాజీపడటం నీవిధి." ఇప్పుడిప్పుడే రఘు శివరామ్‌తో చనువుగా మెదులుతున్నాడు.

"నీవన్నదీ నిజమే. నాది తప్పే. రత్న మరచిపోలేని శిక్ష విధించింది." అతని కంఠం బాధగా మారిపోయింది.

"నీ పిచ్చిగాని యెందరో తమ గర్భం విచ్ఛిన్నమయితే బాగుండు అనుకుంటారు. అలా జరుగుతుందా? ఏదో కోపంలో అవి డలా అన్నది. కాని, తమ సంతానంపై యెవరికి ప్రేమ ఉండదు!" యెన్నోవిధాలుగా ఓదార్చినాడు రఘు.

"రఘూ! ధనవంతుల పిల్లలంతా నాలాగే తయారవు తారా!"

"అది పెంపకాన్నిబట్టి." రఘు చిన్నగా నవ్వాడు. వ్యవసాయం వారిద్దరికీ యెన్నో జీవితసత్యాలు నేర్పింది. విద్యాగర్వంతో, ధనగర్వంతో మనుష్యులు ఇతరులను, ముఖ్యంగా రైతులను అవమానిస్తారు. సంసారంలోని సర్వసుఖాలకు రైతే

మూలాధారం. ప్రభుత్వోద్యోగి నెలనెలా జీతాలు అందుకుంటూ ఒక్కరోజు జీతం రావడం ఆలస్యమయితే అల్లాడిపోతాడు. వ్యాపారస్తుడు ఇటు కొని అటు అమ్ముతాడు. రైతు అలాకాదు. సంవత్సరమంతా తన పెట్టుబడికోసం కాచుకూర్చోవాలి. లాభనష్టాలు విధిచేతిలో ఉంటాయి. రఘు తన చాతుర్యమంతా చూపినా ఆశించిన ఫలితం పొందలేకపోయాడు. ద్రాక్షతోట వేశారు. దానిపై వచ్చే ఫలితాలకై వేచియున్నారు. శివరాం పొలం అమ్మాడు. డబ్బు రాగానే ఏదైనా వ్యాపారం పెట్టాలని చూస్తున్నాడు. అది తొందరగా తేలితే అదృష్టవంతుడే. మరో రెండుసంవత్సరాలకైనా ఓ చెల్లెలి పెళ్ళి చేయకల్గుతాడు. తనలాంటి నిరుద్యోగులెందరో, కాళ్లమ్మట తిరుగుతున్నారు. పని లేదు. ఏదో ఉద్యమము లేవదీస్తున్నారు. ఉద్యోగాలు అర్హతనుబట్టి ఇచ్చేకాలం ఏనాడో పోయింది. తనకెవరూ తెలిసినవారు లేరు. రికమండేషన్ కోసమే శివరామ్‌దగ్గరకు వస్తే అతను తనతోనే ఉండిపొమ్మన్నాడు. ఉద్యోగం చేసినా యింతకంటె యెక్కువ సంపాదించ లేడుగాని నిశ్చింతగా ఉంటుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? నన్నుగురించా?"

"కాదు, నన్నుగురించే." అన్నాడు.

"నువ్వు ఆలోచించేది నీ చెల్లెండ్ల వివాహంగూర్చి. నాకు తెల్సు. అప్పగానే డబ్బు తీసుకో. తరువాత తీరుద్దువు గాని."

"అలాగే. సంబంధాలు స్థిరపడనీ" అన్నాడు. తరువాత ఇద్దరూ తమతమ పనులవైపు వెళ్ళారు.



సాయంత్రం ఇంటికి వెళ్ళాడు. హాల్లో అడుగు పెట్టబోయి, అక్కడే ఆగిపోయాడు. చక్కగా మఠం వేసుకుని కూర్చుని రత్న పాపకు సీసాతో పాలుపడుతుంది. దగ్గరే తల్లి కూర్చుని సంబరంగా చూస్తూంది. పాప బుగ్గలు, ఒళ్ళు నిమురుతూ అమితానందం పొందుతూంది రత్న. మాతృత్వపు మమత ఆమె ముఖంలో స్పష్టంగా కన్పిస్తుంది. యెవరిబిడ్డనో అంత తల్లీనతలో, తన్మయత్వములో చూచే తనభార్య తనకు సంతానం వద్దని యెందుకు అనుకుంది? తన ప్రవర్తన కేనా! అతని ముఖం నల్లబడింది.

"రా....శివా...." తల్లి పిలిచింది. లోపలికి అడుగు పెట్టాడు. యెవరో క్రొత్తవారు వచ్చినట్టు భుజాలనిండుగా ముసుగు సవరించుకుంది రత్న.

"యెవరమ్మా పాప...." అడుగబోయి ఆగిపోయాడు.

"చల్లగాలి వీస్తుంది. గదిలోకి తీసుకెల్తాన త్తయ్యా!" రత్న పాపను పొదివిపట్టుకొని లేచిపోయింది. అతని ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది.

"రత్న మరీ దిగులుగా వుందని.... ఈ పాపను తెప్పించాము."

"యెవరి పాపమ్మా?"

"ప్రస్తుతం మనపాపే. కోడలి దిగులు పోగొట్టేపాప ఈ యింటికి మనుమరాలే అవుతుంది. శివా! రేపు స్టేషన్ కెళ్ళాలిరా. విమల వస్తుందట."

"అదేం అప్పుడే చదువు చాలించిందా?"

"నా కేం తెలుసు నాయనా! మీ రంతా స్వతంత్రులు. నువ్వు యింటిముఖమే చూడటం మానావు. మెవరేమంటున్నారు. ఆవిడ నీ చెల్లెలుకాదా!" అన్నది నిష్ఠూరంగా.

"సరేలే. స్టేషన్ కెళ్లాం. నాన్నగారు లేరా?"

"ఎక్కడో బడిలో ఫంక్షనట, వెళ్ళారు. కాలం స్తబ్ధంగా గడుస్తుంది. తల్లి లేచిపోగానే నెమ్మదిగా గదిలోకి వెళ్ళాడు. సన్నగా కూనిరాగంతీస్తుంది రత్న. అతను నోరారా ఆ పేరుతో పిలువబోయాడు. అభిమానం అడ్డువచ్చింది. ఆరోజు ఆమె యెంతలా విదిలించివేసింది. ఆమెకు అడుగులచప్పుడు వినబడిందేమో ఇటు తిరిగింది. ఇద్దరూ ఒకరినొకరు పరికించి చూచుకున్నారు.

"ఆరోగ్యం ఎలాఉంది?"

"విధికి కూడా నాలాంటివారంటే పగే కాబోలు. రాయిలా ఉన్నాను." అన్నదీ ముఖం మరోవైపుకు తిప్పుకుని.

"ఇంకా బాధ దేనికీ? పుట్టినబిడ్డ బ్రతికితే నావంటి త్రాగుబోతు అవుతాడేమోనని భయం. వాడు పోయాడుగా! నిశ్చింతగా ఉండు." నెలలతరువాత కలుసుకున్న భార్యాభర్తలు మాట్లాడే విధాన మదికాదని యిద్దరికీ తెలుసు. ఆమాట వింటూనే ఆమె నిలువెల్లా వణికిపోయింది. ఆవేశంలో అలా అన్నది కాని....అప్పుడే తెలివివస్తున్న తనకు బిడ్డ మృతదేహం చూపారు. యెంత అందంగా, బొద్దుగా వున్నాడు. వాడు చావాలని తనుకోరిందా? వాడే బ్రతికితే?....

"దుఃఖం యెందుకు? సంతోషించవలసిన సమయం."



అన్నాడు వ్యంగ్యంగా. తనమాటలు ఆమెపై పనిచేస్తున్నాయని తెలియగానే అతనిలో ఏదో కసి, కక్షా బయలుదేరాయి. ఇంటికి వస్తూ భార్యను యెలా లాలించాలో, యెలా ప్రసన్నం చేసుకోవాలో పథకం వేశాడు. అదంతా మరిచిపోయాడు.

"మీకు....పుణ్యం ఉంటుంది ఆ విషయం యెత్తవద్దు.... నేను యెంతో ప్రయత్నంమీద మరిచిపోతున్నాను." అన్నది వణికే కంఠంతో.

"యెత్తకుండా యెలా వుంటాను? త్రాగుబోతుకైనా, వ్యభిచారికైనా తనసంతానం అంటే తీయని ఊహాలు కల్గుతాయి. వాటిని కూకటివేళ్ళతో కూలద్రోశావు. అనుక్షణం సంతానం అంటే అసహ్యించుకొన్నావు....అదే వాడిని పొట్టన పెట్టుకుంది.... తెల్సిందా?"

"కాదు...." ఈసారి రోషంగా తలెత్తింది. "మీ పాపం...మీ తిరుగుళ్ళు వాడిని కబళించాయి. సాధనలా మీ పతిత్వానికి గురికాబోయినవారెందరు శపించారో....ఆ శాపం తాకు కొట్టింది." ఆవేశంతో ఊగిపోయింది. అతనిదగ్గర సమాధానంలేదు. కిటికీలోంచి బయటకుచూస్తూ నిలబడ్డాడు. నిశ్శబ్దంగా పదినిమిషాలు దొర్లాయి. అతనిటు తిరిగి సిగరెట్టు వెల్గించుకున్నాడు. పాప నాపీలు, చొక్కాలు సర్దుతున్నా ఆమెకళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

"రత్నా! వద్దు ఏడ్వవద్దు. నీవు క్షేమంగా వుంటే బిడ్డల కేంతక్కువ." అని చెప్పాలనిపించింది. ఒక్కసారి ఆమెను హృదయానికి హత్తుకుని గుండెలలో దిగులంతా మరిచిపోదాం అనుకున్నాడు. ఏదీ చేయలేక ఆమెను చూస్తూ నిల్చున్నాడు.

అర్ధరాత్రి మేలుకుంది రత్న. తన మంచం చివరగా భర్త పడుకొని వుండటం చూచి ఆశ్చర్యపోయింది. "మొగవారు యెన్ని వేషాలయినా వేస్తారు." అనుకుంది. మందంగా వెల్గుతున్న లైటులో పాపముఖంలో తన బాబుముఖం కన్పించింది. నెమ్మదిగా లేచి వెళ్ళి వుయ్యాలదగ్గరున్న కుర్చీలో కూర్చుని తదేకంగా పాపను చూడసాగింది. అలా చూస్తుంటే ఆ అనాథపై విపరీతమైన జాలివేసింది. పాపనుచూస్తూ అలాగే వుయ్యాలకు తల ఆన్చి నిదురబోయింది. తలుపుచప్పుడుకు మేల్కొంది. రాము టీ తెచ్చాడు. మంచంపై కూర్చున్న భర్త తదేకంగా తనవంకే చూడటం గమనించింది. రాము టీ బల్లపై పెట్టి వెళ్ళిపోయాడు. అతను లేచివచ్చి టీ వంచుకున్నాడు.

"బయటివాళ్ళు ఇప్పటికే మనగురించి యెన్నో విధాలుగా అనుకుంటున్నారు. వారికి ఆ ఆస్కారం ఇవ్వవద్దని గదిలోకి వచ్చాను" అన్నాడు నెమ్మదిగా.

"నా దంటూ ఇక్కడేం లేదు. ఈ గది మీది. యధేచ్ఛగా రావచ్చు." అన్నది, పాపకు పాలు కలుపుతూ.

"ఆ సంగతి తెలుసు. నువ్వు కుర్చీలలో, నేలపైనా పడుకోవాల్సిన అవసరం ఏంలేదు. నేను మంచివాడిని కాను. నీ అంతట నీవు నేనంటే యెంతఅసహ్యమో చెప్పాక నిన్ను బలవంతంగా నాదాన్ని చేసుకునేటంత పశువును కాను. యధేచ్ఛగా ఉండొచ్చు." అన్నాడు.

"మీకు భయపడికాదు...." ఆపైన ఏం చెప్పాలో తెలియలేదు.



మరో కప్పులో టీ తెచ్చి ఆమెముందుపెట్టి వెళ్ళిపోయాడు. ఆమెతల భారంగా ఉంది. అభిమానపడకుండా టీ త్రాగేసింది. రాత్రి అందరి భోజనాలు అయ్యాయి. రత్న ఒంటరిగా బల్లమీద కూర్చుంది. ఏం ముట్టుకోవాలనిపించలేదు. మజ్జిగ పోసుకుని లేచింది. డైనింగ్‌హాలు గుమ్మంలో శివరామ్ నిల్చుని చూస్తున్నాడని ఆమెకు తెలియదు. మర్నాడు రాము భోజనం గదిలోకి తెచ్చాడు. రత్న ఆశ్చర్యపోయింది.

"యెవరికి రామూ?"

"చిన్నదొరగారికమ్మా."

"ఆయన పొలం వెళ్ళలేదూ?"

"వెళ్ళారు. వచ్చారు. భోజనంచేసి వెళ్ళాలట. త్వరగా రమ్మన్నారు." వాడిమాట పూర్తికాకపూర్వమే శివరామ్ గదిలోకి వచ్చాడు. అక్కడఉండి వడ్డించాలా. వెళ్ళిపోవాలా? రత్నకర్థంకాలేదు. హిడింబి అప్పుడే పాపకు స్నానం చేయించి పడుకోబెట్టింది. తనకు టీ కలిపియిచ్చే సహృదయత ఆయన చూపినప్పుడు, తను వెళ్ళిపోవటం అంత మంచిపని కాదని భోజనం బల్లపై సర్దింది. అతను కూర్చున్నాడు.

"నువ్వూ రా."

"నేను తరువాత భోంచేస్తాను."

"అలాకాదు, ఇప్పుడే రావాలి. త్రాగుబోతును, వ్యభిచారిని, హంతకుడిని కావాలని నీ అభిప్రాయమా?"

"అంటే?" వెనుదిరిగి చూచింది.

"తిండితినక ప్రాణంమీదికి తెచ్చుకుని యెవరిని సాధించాలని?"

"నాకెవరున్నారని సాధించటానికి?" ఆమె కంఠం రుద్ధం అయింది.

"నేనున్నాను." అని హృదయానికి హత్తుకోవాలనిపించింది. అలా చెయ్యలేకపోయాడు. కూర్చున్నచోటునుండి లేచాడు.

"ఈరోజునుండి నాకెవరూ లేరు. నాకు భోజనం వద్దు."

"బావుంది. నాకు భోజనం వద్దనలేదే." అన్నది.

"కావాలనుకుంటే నాతోపాటే భోంచేయాలి." ఆమె ఏంమాట్లాడలేదు. అతను పోబోయాడు. చెయ్యిపట్టుకుని ఆపింది.

"భోజనముచేసి వెళ్ళండి."

"అయితే నువ్వూరా." తప్పదన్నట్లు వచ్చికూర్చుంది. అతనికి నవ్వు వచ్చింది. ఒకప్పుడు తను ఎంతో అల్లరిగా తిరిగి తప్పత్రాగి వస్తే ఆప్యాయత నటిస్తూ వచ్చేది భార్య. దగ్గరుండి తినిపించేది. ఇప్పుడు తను మనిషిగా మారి వస్తే దూరం పెరుగుతుంది. జీవితం అంటే ఇదేకాబోలు. ఇద్దరూ మౌనంగా భోజనము పూర్తిచేశారు. చాలా రోజులకు ఆరోజు తృప్తిగా భోజనము చేసినట్టనిపించింది శివరామ్‌కు. పాప ఏడ్వడంతో ఆమె త్వరగా అటు వెళ్ళింది.

"సాయంత్రం విమల వస్తుంది."

"ఊఁ."

"తయారుగా ఉండు స్టెషకిన్ కి వెళ్దాం."



"నేనెందుకు?"

"మేంమాత్రం పనివుండి వెళ్తున్నామా! తిరిగితే రావుంటుంది."

"సరే" అన్నాడు. ఆ సాయంత్రం నిశ్చింతగా, నిర్వికారంగా బండి దిగే ఆడబడుచును చూస్తే కంపరమెత్తింది రత్నకు. అయితే కట్టు బొట్టులో హుందాతనము కన్పిస్తుంది.

"ఏం వదినా! అంతమౌనంగా ఉన్నావు?" ఆమె అప్యాయంగా పలుకరిస్తూ దగ్గరకు వచ్చింది.

"అందరం ఒకేసారి మాట్లాడితే యెలా?"

"చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టు, నీవు చిక్కినా అందంగానే ఉన్నావు వదినా!" అన్నది.

"ఇంటికెళ్ళి తీరిగ్గా కబుర్లు చెప్పుకుందురు పదండి." శివరామ్ తొందరపెట్టాడు. అందరూ ఇల్లు చేరారు. విమల తను చూచిన ప్రదేశాలు, అనుభవాలు చెబుతుంటే ఆప్యాయంగా వింటున్నారు అందరు. రత్నకు అక్కడ ఉండాలనిపించలేదు. నెమ్మదిగా గదిలోకి వచ్చేసింది. రాత్రికూడా భార్యాభర్తలు కలిసే భోజనము చేశారు. రత్నకు ఆశగా వుండింది, విమల తప్పక తన గదిలోకి వస్తుందని. ఏ చిన్నచప్పుడయినా ఆమె అనుకుంది. ఆమె రానేలేదు. గొప్పవారి గోత్రాలపై, వారి మనస్తత్వాలపై గట్టిగా నవ్వాలనిపించింది.

"అలా శూన్యంలోకి చూస్తూ కూర్చుంటే శాంతి లభిస్తుందా?" భర్త ప్రశ్నకు మారుమాటాడకే వచ్చి పడుకుంది. ప్రక్కకు తిరిగి పడుకున్నా, ఆమె ఏడుస్తుందని అతనికి తెలుసు. ఎలా ఆమెతో మాట్లాడాలో తెలియలేదు. తను ఉపేక్షిస్తే ఆమె తనకు దక్కదేమో అన్పించింది.

"చూడు, నీలాంటి స్వాభిమానిని తెచ్చి యిక్కడ బంధించాను. అది నాతప్పేకావచ్చు. తప్పుకు క్షమలేదా!" మెల్లని స్వరాన అడిగాడు. ఆమె ఏంజవాబు చెప్పలేదు.

"ఏం చేస్తె నీ దుఃఖం పోతుందో చెప్పు?" చేయిచాచి ఆమెభుజాలు నిమిరాడు. దానికి మౌనమే వహించింది. ఆమెను తనవైపుకు తిప్పి కళ్ళుతుడిచాడు. అలాగే చేతులలో వాలిపోవాలనుకుంది. వెంటనే గతించిన దుర్ఘటనలు కళ్ళముందు కదలాడాయి. కళ్ళుమూసుకుని దిండుపైకి ఒరిగిపోయింది.

మర్నాడు రత్న వంటయింటిలో వుంది. పాప గుక్కపట్టి ఏడుస్తుంది. ఆమెకు విన్పించినా అలా చూస్తూ ఊర్కుంది. హిడింబి పరుగెత్తింది. అటునుండి రుక్మిణమ్మ వచ్చింది. ఆమెకు తన అంచనా తప్పుకాలేదనిపించింది. విమలకీమధ్య క్రొత్త అలవాటు వచ్చింది. పెద్దవదినలముందు కూర్చుని నైతికంగా పతనము అయ్యే స్త్రీలనుగూర్చి మాట్లాడుతుంది. రత్నతో సరిగ్గా మాట్లాడదు. ఆమె పాపతో ఉంటే మరీదూరంగా పోతుంది. వారంరోజులు గడిచాయి. ఒకనాటి సాయంత్రం శివరామ్ ఇంటికి వస్తున్నాడు. జీపు రఘు తీసుకువెళ్ళాడు, మెరువులకు ఆర్డరు ఇస్తానని. నడచిరాక తప్పలేదు. అతనికి గేటు దగ్గర గుసగుసలాడుతున్న హిడింబీ, సుశీల కన్పించారు.

శివరామ్‌ను చూస్తూనే హిడింబి ఏదో పనిఉన్నట్టు అక్కడినుండి వెళ్ళిపోయింది. సుశీలమాత్రం మూతి మూడు వంకర్లు తిప్పింది.

"గొప్పోరి గోత్రాలు అన్నీ యిలాగే ఉంటాయి. నాలాంటివారు ఏవన్నా చేస్తె తప్పు. పెళ్ళికాకుండానే పిల్లలు



పుడతారు వారింటి ఆడవారికి. రోజుకో క్రొత్తపిట్ట కావాలి మొగవారికి........" శివరామ్ విననట్లే ముందుకు సాగిపోయాడు. అతని కెన్నో అనుమానాలుకల్గినాయి సరాసరి భార్య గదిలోకి వెళ్లాడు. ఆమె పాపఉయ్యాలదగ్గరుండి స్వెట్టరల్లుతుంది.

"ఈ పాప యెవరు?" పరీక్షగా చూస్తూ అడిగాడు.

"ఏమో...." అన్నది. అలాంటి ప్రశ్న వస్తుందని ఆమె ఊహించలేదు.

"అంత ఆరా తెలియని వాళ్ళని పెంచడం దేనికి? ఇప్పుడే నీవు ముసలమ్మవయిపోయావా?" ఈసారి అతని గొంతు కఠినంగా ఉంది.

"మీ అమ్మగారికి తెలుసునేమో అడగండి." అన్నది. ఆమెకు చాలా బాధగా వుంది. భార్యాభర్తలమధ్య ఏ రహస్యాలు ఉండవని అంటారు. తామిద్దరూ ఇలా యెందుకు మారిపోతున్నారు? ఇంతలో రాము, రత్న పేరవున్న ఉత్తరం తెచ్చియిచ్చాడు. రత్న ఉత్తరం చదువుతుంటే ఆమె ముఖంలోని రంగులు మారిపోసాగాయి. ఉత్తరం పూర్తిచేసి గాఢంగా నిట్టూర్చింది.

"ఎవరు వ్రాశారు?" అడగకూడదనుకుంటూనే అడిగాడు.

"సాధన ..." వత్తి పలుకుతూ అన్నది. అతని ముఖంలో రంగులు మారాయి. బలవంతంగా తన భావాలను అదిమిపెట్టాడు.

"ఏం రాసింది?"

"చదవండి...." ఉత్తరం అందించింది.

"అక్కరలేదు. విశేషాలుంటే చెప్పండి!" 'అండి' అనే మాట ఒత్తి పలుకుతూ.

"అందంగా, ఆనందంగా చర్చించుకునే విషయాలు ఏం లేవు...." ఉత్తర మలా వదిలి లేచిపోయింది. చదవాలా, వద్దా? అనుకుంటూ క్షణం ఆలోచించాడు. తరువాత ఉత్తరం తీసుకుని చదివాడు.

ప్రియమైన రత్నా!

అన్నిబంధాలు త్రెంచుకుని ఇంతదూరం వచ్చాను ఎందుకో తెలుసా? తెలిసిన వారెవరికీ కన్పించకూడదని. అమ్మా, నాన్నా ఎంతో ఏడ్చారు. శ్రీమాన్ అల్లుడుగారిని పిలిచి నన్ను అనునయింపజూచారు. నామనసు సంసారజీవితం పట్ల ఎంత విరక్తి పొందినదో నీవు అర్థంచేసుకోగలవు. క్రితంసారి కలిసినప్పుడు నన్ను పదేపదే అడిగావు—నేను భర్తను వదిలి వచ్చినందుకు కారణం చెప్పమని. నీవే పుట్టెడు దుఃఖంతో వున్నావని చెప్పలేదు. ఇంతవరకు అసలు కారణం చెప్పలేదు. ఈ బరువు గుండెల్లో మోయలేనే.... ఎవరితో చెప్పుకోను! అక్కతో చెప్పుకోలేను. సిగ్గువిడచి అమ్మా, నాన్నకెలా చెప్పను? అన్నయ్య ఆచారవ్యవహారాలలో తేడావచ్చింది. కాని మనసు మెత్తనిది. నేను చెప్పిన విషయంవిని భరించలేడు. నా హృదయాన్ని అర్థంచేసుకోగలదానివి నీవు ఒక్కర్తెవు.

శ్రీ చక్రపాణిగారు అబద్ధాలకోరు, మోసగాడు, అవకాశవాది. అతని డిక్షనరీలో అవినీతికి అర్థంలేదు. అతను చెప్పే



తీయనిమాటలు నమ్మి మోసపోయాను. వివాహం తరువాత మా యిద్దరిమధ్య మధురంగా గడిచిన క్షణాలు వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. తన పని జరిగిపోతుందనుకుంటే ఏంచేసినా తప్పులేదు. అలాగే మాజీవితం గడవసాగింది. పొలం చవకగా సంపాదించటానికి నాశీలం ఎరగాపెట్టిన సంగతి నీకు తెల్సిందే. ఆరోజు నీవు రక్షించావు. బెంగుళూరులో నీలాంటి రత్నాలు ఎవరూ నన్ను రక్షించటానికి రాలేదే. ఆయన పనిచేసే బడిలో ప్రిన్స్‌పాల్ పోస్టు ఖాళీగా వుంది. మరో పదిసంవత్సరాలు తపస్సుచేస్తేగాని ఆయన కాపదవి లభించదు. ఆయన పథకాలు వెయ్యటంలో ఘనులు. పై అధికారి బలహీనత కనిపెట్టాడు. అతనికి బార్‌లలో తప్పత్రాగించటం. ఇరవైనాల్గు గంటలు అతన్ని ముఖస్తుతి చేస్తూ తిరిగేవాడు. ఒకరోజు అతనితో క్లబ్బుకి వెళ్దాం తయారవ్వమన్నాడు. తయారయ్యాను. మాట్లాడుతూ అతనిల్లు చేరాం. తనకేదో పనుందని వెళ్ళిపోయారు. ఆయింట్లో నాఏడుపు, అరుపులు వినేవారెవరూ లేరు. అతనిచేతులలో నలిగిపోయాను.

"యూ ఆర్ ఏ మార్వెలస్ గర్ల్...." అన్నప్పుడుగాని స్పృహ రాలేదు. నా మనసంతా మొద్దుబారిపోయింది. లేచి ఎలా పరుగెడుతూ ఇల్లుచేరానో! అంతా ఆలోచిస్తే ప్లాను ప్రకారం జరిగిందనిపించింది. పదిహేనురోజులు పిచ్చిదానిలా గడిపాను. చక్రపాణిగారెన్నోవిధాలుగా ఓదార్చే ప్రయత్నం చేశారు. నెల తిరక్కముందే ఆయనకు ప్రమోషన్ వచ్చింది. కారు కొనటానికి లోన్ వచ్చింది. కారుకొన్నారు. ఆ కారును సుత్తితో ముక్కలుచేయాలనిపించింది. ఏమీ చెయ్యలేక పిచ్చిగా తిరి ను.

"ఒంటరితనం నిన్ను మరీ పిచ్చిగా చేస్తుంది. క్లబ్బుకెళ్దాం పద...."

బలవంతంగా లేవదీశారు. ఆయన తనకారును, అందమైన భార్యను అందరికీ చూపాలనే తాపత్రయంతో తీసుకెళ్ళారు. అక్కడ అందరినీ చూడగానే పిచ్చిఆవేశం బయలుదేరింది. కన్పించిన మొగాడితో నల్లా డ్యాన్స్ చేశాను. అందించిన ద్రవాలన్నీ త్రాగేశాను. వాళ్ళు సిగరెట్టు ఆఫర్ చేస్తే తీసుకున్నాను. కాల్చాను అలా చేస్తుంటే చక్రపాణిముఖం చూడాలి-ఆముదంత్రాగినట్టు అయ్యేది. అతనిబాధ చూస్తే నాకు పిచ్చిఆనందం కల్గేది. ప్రతిరోజూ క్లబ్బుకో, హోటల్కో వెళ్ళనిదే ఉండలేని స్థితికి వచ్చాను. త్రాగడం, సిగరెట్టు కాల్చడంలో స్వర్గం కన్పించేది. చక్రపాణి కిది ప్రాణాంతకంగా తయారయింది. పతివ్రతాముసుగులో మరో పదిమంది మొగాళ్ళతో తిరిగినా ఆయనకు బాధలేదు. బాహ్యంగా, విచ్చలవిడిగా తిరిగితే అందరూ అతన్ని చిన్నచూపు చూడరూ! ఎంతమోసగాడో అంత పిరికివాడు రత్నా! నాదగ్గరకు వస్తే పీకనొక్కేస్తానని అరిచాను. అదిరిపోయాడు. ఆ మొగధీరుణ్ని తలచుకుంటే నవ్వు వస్తుంది. అప్పుడే క్లబ్బులో ఒక వ్యక్తితో పరిచయం అయింది. అతను నాలాంటి బాధితుడే. అతన్ని చూస్తే నిజంగా అతనిలాంటివారు భర్తగా లభించటం అదృష్టం అనుకుంటాం. అయితే సృష్టిలో విపర్యయాలకు నవ్వు వస్తుంది. అతను ప్రేమించిన యువతి కాదన్నది. అతనే నన్నీరొంపిలోనుండి బయటికి లాగాడు. అతని ఆప్యాయత చూస్తే అన్నయ్య గుర్తుకు వచ్చేవాడు. త్రాగి తందనాలాడితే నన్ను వదిలేస్తాడు. అతని దేంపోయింది! అందుకే వచ్చేశాను.



నాది తప్పంటావా? సంసారమన్నాక కలతలూ, గొడవలూ ఉంటాయి. జీవించాలి అంటుంది అమ్మ నిజం తెలిస్తే యిలా అనగలదా? 'ఏదో నానాకాలపు చదువులకే మేం నెరజాణలమంటూ విర్రవీగి పోరాదమ్మా....!' అంటారు నాన్న. నా హృదయంలో రగులుకునే అగ్ని అతని కెలాని వేదించనే! నా భర్త తాగుబోతు అయినా భరించేదాన్ని. వ్యభిచారి అయినా సహించేదాన్ని. దుర్మార్గుడై నిత్యం తన్నినా ఓర్చుకునేదాన్ని. ఈ అన్యాయం యెలా సహించేదే! అతనికి డబ్బు, అధికారం, హోదా....ఇవే కావాలి. ప్రతి నిమిషం అతన్ని అసహ్యించుకుంటూ అక్కడ ఉండలేను. అందుకే వచ్చేశాను. అమ్మా నాన్నల దగ్గరుంటే ప్రతినిమిషము వారికి నన్నుచూస్తే బాధ. అందరూ నాగురించి ఆరా తీస్తారు. అందుకే ఇంతదూరం వచ్చాను...." ఉత్తరం చదవటం ఆపి పైనఅడ్రసు చూచాడు. పూనా కాలేజీ అడ్రసుంది. "నాన్నతో చెప్పాను. నాకిచ్చిన ఇంటిఅద్దెలు వసూలుచేసి ప్రతినెలా పంపమని. డిగ్రీ వచ్చాక ఆలోస్తాను ఏం చేసేది!

నువ్వు అంత బేలగా ఉండటం యెప్పుడూ చూడలేదు. ఆనాటి సంఘటన ఇంకా మనసులో పెట్టుకున్నావా? అది మరిచిపో. మనందరికంటె కూడా శివరామేగారి గోపాలకృష్ణ లీలలు చక్రపాణికే తెలుసు. అతని బలహీనతను ఆధారంగా చేసుకుని మోసంచెయ్యాలని చూచాడు. తప్పెవరిదంటావు? నాకు ఆయనపై యెలాంటికోపం లేదు. నువ్వూ మరిచిపో. హాయిగా సుఖంగా ఉండాలని నాకోరిక. నాకిప్పు డెంతో తేలికగా ఉందే....ఒక్కసారి మనమంతా పిల్లలమయి సుంద

రమ్మ పిన్ని చుట్టూ చేరి ఆవిడ చేత తిట్లూ, వేడివేడి పలహారాలు తింటే ఎంత బాగుండును! అన్నయ్యకేవో సంబంధాలు చూస్తున్నా రనుకొంటాను. వాడిగురించి దిగులేం లేదు. ఈలోకంలో అమాయకులే సుఖపడతారు. వెంటనే ఉత్తరం రాయి.

ఇట్లు,
నీ సాధన."

ఉత్తరం పూర్తి అయ్యేసరికి అతని హృదయమంతా బరువుగా మారిపోయింది. చక్రపాణి అసలురూపం కళ్ళముందు కదలాడింది. అమాయకంగా నవ్వుతున్న సాధన ముఖం ప్రత్యక్షమయింది. బాధగా కళ్ళుమూసుకున్నాడు.

## 16

శ్రీపతిగారు భార్యా కూతురులతో భోజనానికి కూర్చున్నారు. రత్న వడ్డిస్తుంది.

"అతను తన కంగీకారమే నన్నాడట. ఇక మీ అమ్మాయిదే అభిప్రాయం కావాలి...." శ్రీపతిగారు అడిగారు భార్యను.

"దానికిమాత్రం ఎందుకిష్టముండదు? ఏమమ్మా! రఘునుగూర్చి నీ అభిప్రాయమేమిటి?"



"హో అమ్మా....అతను వ్యవసాయం చేయటం ఏంనచ్చలేదు." ముద్దుగా గునిసింది విమల.

"అందరికీ కలెక్టర్లూ, డాక్టర్లూ కావాలంటే ఎలా వస్తారు?"

"అదికాదు నాన్నగారూ...."

"నాకు తెలుసునమ్మా....మీ రలా చదువుకున్న వాడు కావాలనుకుంటే, నీవు చక్కగా చదువుకుంటే బావుండేది. వెనకటికాలంలో అబ్బాయి చదువునుగూర్చే ఆరా వుండేది. ఇప్పుడు అమ్మాయి ఏంచదివింది అంటారు...." అంతకంటె నీ తిరుగుళ్ళు అందరికీ తెలుసు అని అనలేక. రెండు మూడు చోట్ల ప్రయత్నించాడు. ఈ విషయం వింటూనే వాళ్ళు లేచిపోయారు. అవినీతి జమీందార్లలో దాగిపోతుంది. బీదవారిలో నలిగిపోతుంది. ఎటొచ్చీ మధ్యతరగతి కుటుంబీకులలోనే భయంకరంగా వ్యాపిస్తుంది. వారి జీవితాలతో ఆడుకుంటుంది. జమీందార్లందరూ తమ కూతుర్లను సాటివారికే ఇవ్వాలనుకుంటారు. అది సాధ్యపడనినాడు తమ డబ్బు అనే వల బీదవారిపై విసురుతారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువకులు జీవితంలో ఒడుదుడుకుల రాపిడికి అరిగి విసిగి వేసారి ఉంటారు. డబ్బువస్తుంది చాలనుకుంటారు. కొందరు పురుషులే దాసోహం అని భార్యావిధేయులవుతారు. మరి కొందరు అభిమానం చూపబోతే అనుక్షణం అశాంతి, కలతలు. జీవితంలో సుఖం అన్నది గగనకుసుమమే అవుతుంది.

రత్నకు ఆయింట్లో అందరిపైనా విపరీతమైన కోపం వచ్చింది. ఒక మంచివాడిని మోసంచేసి పెళ్ళిచెయ్యటం అంత

కంటె నిజం చెప్పేస్తే? అది అసాధ్యం. మనుష్యుల్ని మోసంతో అనునయించినంత తొందరగా నిజం చెప్పి ఒప్పించలేరు. నవ్వుతూ మితంగా మృదువుగా మాట్లాడే రఘు ఆమె కళ్ళ ముందు తిరిగాడు. అతనితో తాను యెన్నడూ మాట్లాడలేదు. అతనినిగూర్చి పనివారు చెప్పేమాటలు విని అతనిపట్ల సదభిప్రాయం ఏర్పరుచుకుంది. అతనికి నిజం తెలిస్తే విమలయినా సుఖపడుతుందా? సాయంత్రం తన అభిప్రాయం చూచాయగా అత్తగారితో చెప్పింది.

"ఇంకానయం....ఏదో జరిగిపోసి. ఏ మొగాడూ నిజం తెలిస్తే అంగీకరించడు. ఏదో ఏఆటంకం లేకుండా ఇలా జరుగనీ...." అన్నది. రత్నకుమాత్రం చాలా చిరాకుగా ఉంది. ధనవంతులందరూ ఇలా డబ్బు ఎఱచూపి కష్టజీవులను కొనాలని యెందుకు చూస్తారో! తన భర్తను ఓ మనిషిగా చేయటంలో పాలుపంచుకున్న వ్యక్తికి అన్యాయం జరుగరాదు.

"హిడింబీ! సాయంత్రం ద్రాక్షతోటలవైపు వెళ్దాం వస్తావుటే?"

"చిన్నయ్యగారితో జీపులో ఎల్దామా?"

"ఏం రాజభోగమే! నడిస్తే అరిగిపోయామా!"

"నాకేం, నడువుమంటే రాజమండ్రిదాక నడుస్తాను మీగురించే."

"ఏమ్మా నాగురించి అంత దిగులెందుకు? నీకు వయసు ఎక్కుతుంటే నేను ముసలిని అయ్యాననే?"

"అట్లాకాదమ్మా; జమీందారుకోడలు నడవటమా!"

"జమీందార్ల కోడండ్లకు కాళ్ళనొప్పులా!"



"దర్జా....దర్జా చిన్నమ్మా."

"దర్జా అంతా ఇక్కడే వదలి వస్తాను పద."

"మీకు కష్టంలేకపోయాక నాకేం కష్టం." అన్నది. రత్నకు తెలుసు శివరామ్ సిటీకి వెళ్ళాడని. ఇద్దరూ పొలాలవైపు వెడుతుంటే అందరూ వింతగా చూడటమే. వాళ్ళడిగే ప్రశ్నలకు హిడింబి సమాధానం చెబుతుంది. అక్కడివారిని చూస్తుంటే వాళ్ళలో కలిసిపోవాలనిపించింది. ఇద్దరూ పొలాలు చేరుకున్నారు.

"మీరా!" రఘు ఆశ్చర్యంగా చూచాడు.

"పనిలో ఉన్నారా?" నవ్వింది చిరుగా.

"పని ఏముందీ? రండి. ద్రాక్షతోటలు చూద్దురుగాని." అతనితో బయలుదేరి, తోటలన్నీ తిరిగారు. చక్కగా పెరిగాయి.

"అదిగో ఆ సన్నగా వచ్చే తీగెలను యెప్పటికప్పుడు తెంపాలండీ...."

"కూలోల్లు అంతా మీసాలు తెంపుతాం....మీసాలు తెంపుతాం అంటారు. దీన్నే కాబోలు." హిడింబి అందుకుంది.

"ఈ పొలంలో అరటితోట వేయాలని వుంది." మరో పక్కకు తయారుగా ఉన్న పొలం చూపాడు.

"పైరులూ అవీ చూస్తుంటే యిక్కడే ఉండాలనిపిస్తుందండీ."

"ఇంకేం శివరామ్ ఉత్సాహంగా పనిచేస్తారు." అతను నవ్వాడు. రెండెకరాల పొలంలో కాయకూరలు వేశారు.

"అదుగో ఆప్రక్కన రేకులషెడ్డు వేస్తున్నాం; అక్కడ డైరీ ప్రారంభించాలని. వచ్చేనెలలో బిదర్ వైపు వెళ్తాం గేదె

లను కొనటానికి. అది సక్రమంగా నడిస్తే పౌల్ట్రీకూడా పెట్టాలని...." అతను తమ పథకాలనన్నిటినీ చెప్పుకుపోతున్నాడు.

"ఆ దూరాన ఇల్లు కన్పిస్తుంది యెవరిదండీ?"

"మీరు యెప్పుడూ ఇటువైపు రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు. "అక్కడ మా రెండవ బావగారు వడ్లాడించే మర, పిండివిసిరే మర పెట్టారు. దూరాన కన్పించే ద్రాక్షతోటలు వారివే."

"అన్నదమ్ములంతా పోటీలపై పనిచేసుకుంటున్నా రన్నమాట. సంతోషమండీ." తిరిగి షెడ్డుదగ్గరకు వచ్చారు.

"అమ్మా.... ఈతకల్లు అమ్ముతాడు...." బుర్రగోక్కుంటూ నిలబడింది హిడింబి.

"నువ్వు డబ్బులడుగుతావని నాకేం తెలుసు? వట్టిచేతులతో వచ్చాను." రత్న చిన్నబుచ్చుకుంది.

"నేను ఇస్తాను...." రఘు ఇచ్చాడు డబ్బులు.

"మీరు కూర్చోండి. ఈడున్నట్టు వస్తాను." అది ఉత్సాహంగా వెళ్ళిపోయింది.

"మీకు అభినందనలు తెలుపాలని వచ్చాను...." అన్నది. నవ్వబోయిందిగాని సాధ్యం కాలేదు.

"ఎందుకు?....ఓ అదా!" అతను నవ్వాడు. అతను రెండు కుర్చీలు బయట వేశాడు. దూరంగా జీతగాళ్ళు తమ తమ పనులు చేసుకుపోతున్నారు. కూర్చున్నారు.

"ఒరేయ్ సంగయ్యా! తోటలో జామిపళ్ళున్నాయేమో చూడు" అని ఓ కుర్రాడిని కేక వేశాడు.



"మీతో ఓవిషయం మాట్లాడాలని వచ్చాను...."

"నాతో నా!" అతనాశ్చర్యపోయాడు. శివరామ్ భార్యకు తనతో మాట్లాడే అవసరం ఏముంటుంది? విషయమేమయి వుంటుంది?

"శివరామ్ గారున్నప్పుడు మాట్లాడుదామండీ!"

"మరేం భయం లేదు. ఆయనలో కొన్నిలోపా లున్నమాట నిజమే. కాని నన్ను అనుమానించేటంత సంకుచితులు కారు" అన్నది.

"చెప్పండి."

"వివాహంపట్ల మీ అభిప్రాయం ఏమిటి?"

"అభిప్రాయాలు, ఆశయాలు చాలా ఉండేవి. అసలు జీవితం అర్థం అయ్యేసరికి అన్నీ చప్పగా చల్లారిపోయాయి." అన్నాడు.

"అంటే?"

"మీకు తెలియని విషయాలేమున్నాయి. నాకు జమీందార్ల అల్లుడిని కావాలని, కట్నండబ్బుతో అమెరికా వెళ్ళాలని లేదండీ. పరిస్థితులు ఒత్తిడిచేస్తున్నాయి. సంవత్సరంనాడు అమ్మను[?] చూచినవా రెవరూ ఇప్పుడామెను పోల్చరు. యెదిగిన కూతుర్లను యెదుటబెట్టుకుని, ఊళ్ళోవారి మాటలకు జవాబు చెప్పలేక సతమతమవుతుంది. ఆమె తలంతా ముగ్గుబుట్ట."

"నిజంగా పల్లెటూర్లలో అలా అడుగుతారండీ! నాకు తెలుసు."

"వారి అడుగుడు ఒకవైపూ, అటూ చదువూ లేక, ఏ వ్యాపకం లేక వున్న ఆడపిల్లలను అదుపులో పెట్టటం రెండో

వైపు వారిని కృంగదీశాయి. ఈ వ్యవసాయంలో ఆదుకోవాలంటే మరో రెండుమూడు సంవత్సరాలు కావాలి. శివరాంగారు సహాయం చేస్తానన్నారు. అంత పెద్దమొత్తం అప్పుగా తీసుకుని తీర్చగలనంటారా? అందుకే లక్షరూపాయలకట్నం తీసుకుంటున్నాను. అర్థంచేసుకుంటున్నారనుకుంటాను?"

"పూర్తిగా అర్థం చేసుకున్నాను. అదికాదు నాకుమరో అనుమానమండీ! వివాహం తరువాత స్త్రీ తను నమ్మినంత పవిత్రురాలు కాదని తెలుస్తుందనుకోండి. అప్పుడు పురుషుడు ఏం చేస్తాడు?"

"దానికి నే నెలా సమాధానం చెప్పగలనండీ. అది వారివారి మనసునుబట్టి వుంటుంది."

"మీ స్వవిషయంలో జరిగితే ఏం చేస్తారు?"

"ఏంచేస్తాను?...." ఈసారి అతనిముఖం గంభీరంగా మారిపోయింది. ఆలోచనలో పడ్డాడు.

"ఆ ప్రశ్న నన్ను మెందుకడుగుతున్నారు?"

"కారణం ఉందిగనుకనే...."

"ఏంచేస్తాను....స్త్రీ పవిత్రత కోల్పోవటానికి చాలా కారణాలుంటాయి. అది ఆమె అబలత్వం... అని సానుభూతితో చూస్తాను."

"నిజంగా హృదయపూర్వకంగా అనే మాటలా?"

"నిజంగానే అంటున్నాను." అన్నాడు దృఢంగా.

"అయితే నేనోవిషయం చెప్పాలని వచ్చాను. మిమ్మల్ని చూడగానే ఎందుకో నాకో గౌరవమైన అభిప్రాయము ఏర్పడింది. మిమ్మల్ని మోసం చెయ్యాలని లేదు."



"చెప్పండి." అతను ఉత్కంఠతను భరించలేకుండా ఉన్నాడు.

"విమల కన్యాత్వం కోల్పోయింది...."

"ఆఁ!"

"అవును. ఆడపడుచు వివాహం చెడగొట్టాలనికాదు, ఆమెపై అసూయచేతకాదు, మీకీ విషయం చెప్పేది. అబద్ధం చెప్పి మోసంచేస్తే రేపు మీసంసారంలో కలతలు రావచ్చు."

"మీరుకాస్త వివరంగా చెప్పండి." అతను తల రెండు చేతులతోను పట్టుకున్నాడు.

"అన్నివివరాలు చెబుతాను. అబద్ధంఆడి పనిజరుపుకుపోయినట్టే, నిజంచెబితే పనిజరగదని బాధపడుతూ నేను వెళ్ళకూడదు. నిజానికి విలువ వుందని మీరు నిరూపించాలి."

"ఆ భయం మీకు అక్కరలేదు. విమలను వివాహం చేసుకోటానికి అంగీకరించాను. మీరు చెప్పకుండా ఉండి, వివాహంతరువాత నాకా విషయం తెలిసినా ఏంచేయలేను. మంచో, చెడో వివాహబంధం అంత త్వరగా త్రెంచుకునేది కాదు."

"మీ అభిప్రాయాలకు ధన్యవాదాలు. విమల జమీందారుల ఇంట పుట్టిన ఏకైక ఆడసంతానము. అందునా ఆఖరున పుట్టిందవటంచేత అతిగారాబం చేశారు."

"అది సహజమేకదండీ!"

"అయితే మితం ఉండాలి ప్రతిదానికి. ఆమె చదువు మానుతానంటే అంగీకరించారు పెద్దలు. లక్షాధికార్లం మాకెందుకు అనుకున్నారు. అయితే నేను మానివేశాను. ఇతరుల

దయాభిక్ష స్వీకరించలేక ఏవ్యాపకం లేదు. దొరికిన పుస్తకమల్లా చదువుట, వచ్చిన సినిమాలల్లా చూడటం, పనిలేపోవటంమూలాన, వారిలా ఉండాలనే ఆలోచన వచ్చిందనుకుంటాను."

"ఈ రోజులలో చాలామంది యువతుల కది సహజం. ప్రతివారూ యాక్ట్రస్లై పోదామనుకుంటారు."

"అలాంటప్పుడే పెద్దలజోక్యం యెంతయినా అవసరం. జీన్స్ వేసుకుని అచ్చు విదేశవనితలా తిరిగేటప్పుడు, 'యిది మనపద్ధతి కాదమ్మా' అని చెప్పాలి. అలా చెప్పకపోగా, తమ పిల్లలు నాగరికులవుతున్నారని మురిసిపోతారు. విమల విషయంలో అదే జరిగింది. బాయ్‌ఫ్రెండ్ అంటూ మేనేజర్ కొడుకుతో తిరిగింది. అతనో పచ్చిరాడీ. శివరామ్‌గారి స్నేహితుడుకూడాను. ప్రేమించటానికి నవనాగరికత నేర్చిన అమ్మాయి కావాలి. పెళ్ళిచేసుకోవడానికి పురాణాలలో చదువుతామే—సీతా, సావిత్రి లాంటి స్త్రీలుకావాలి. అతను విమలను మోసంచేశాడు."

"అతనికి పెళ్ళి అయిందా?"

"ఆ....విమలతో ప్రేమాయణం. అటు మరో అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. పిటీ యెక్కడా అంటే, ఇద్దరినీ కాదని యెక్కువ కట్నం ఇస్తున్నారని మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అప్పటికే విమల తను గర్భవతినని తెలుసుకుంది."

"విమల గర్భవతా?...."

"కాదు; ఇప్పుడు తల్లికూడాను. ఆమోసగాడిని బ్రతిమాలినా ప్రయోజనంలేదని తెలుసుకున్న పెద్దలు తమకు



తెలిసినవారిదగ్గర దూరంగా ఉంచారు. అందరూ చదువుకుంటుందని అనుకుంటారని పెద్దల భావన. అంటే అందరికీ అసలువిషయం తెలుసు. డబ్బుకి. హోదాకు దాసోహం అని ముఖాన అనరు."

"అయితే....మీదగ్గరున్న పాప విమలకూతురా?"

"అవును. అత్తగారు ఏదో అనాథ ఆశ్రమములో వదులుదామన్నారు. నేను పెంచుతానని ఒప్పించాను."

"నాదగ్గర ఇంత చనువుండికూడా శివరామ్ ఇవన్నీ దాచాడన్నమాట. అతను వివాహవిషయం కదిపాడుగాని చూచాయగానైనా ఈ విషయం చెప్పలేదు...."

"రఘుగారూ! క్షమించండి. అతనికీవిషయాలేం తెలియవు. విమల గోపాల్‌తో తిరగటంచూచి ఓసారి మందలించారు. చెల్లి తనమాట విందనుకున్నారో ఏమో. ఇంట్లోకూడా యెవరికీ తెలియవు; నాకూ అత్తమామలకు తప్ప."

"మీకు తెలిసినప్పుడు....మీరు శివరామ్‌తో చెప్పలేదా?"

"మా విషయాలు మీకు తెలిసినంతగా యెవరికీ తెలియవు. ఇంచుమించు సంవత్సరంగా మేం పట్టుమని పదినిమిషాలు మాట్లాడింది లేదు. ఆయన పాపవిషయములో అనుమానించారు. యెవరిపాపని అడిగారు. అత్తగారికిచ్చిన మాటప్రకారం నేను వారి కీవిషయము చెప్పలేదు. మీతో చెప్పాల్సిన అవసరమొచ్చిందికాబట్టి చెప్పాను."

"నా తల తిరిగిపోతుందండీ!"

"అది సహజమే. మీరు తీరికగా ఆలోచించి ఓ నిర్ణయానికి రండి. మీ సాహచర్యంలో నాభర్త ఒకమనిషిగా

తయారు అయ్యారు. దానికి ప్రతిగా నేను ఏమీ ఇవ్వలేను. ఈ విషయంలో మిమ్మల్ని మోసంచేయటం ధర్మంకా దనిపించింది. అందుకే చెప్పాను."

"చేదు అయినా నిజంచెప్పి చాలా ఉపకారం చేశారు."

"మీరు బాగా ఆలోచించి మీ మనస్సు అంగీకరిస్తేనే విమలను స్వీకరించండి." అని లేచింది.

"పదండి. మిమ్మల్ని ఇంటివరకు పంపించి వస్తాను."

"అరే చీకటిపడిందే! హిడింబీ!....ఇది కల్లుపాకనుచూస్తె బయటికిరాదు."

"అదెప్పుడూ కర్తవ్యం మరిచిపోదు. వచ్చింది, నేనున్నానని పంపివేశాను." శివరామ్ గొంతు వినిపించింది. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. రఘు ముఖం మలినము కావటం చీకట్లో ఇద్దరూ గుర్తించలేదు.

"మీ రెప్పుడొచ్చారు?" రత్న అడిగింది.

"చాలాసేపయింది. రసపట్టులో మీసంభాషణకు అంతరాయం కల్గించరాదని ఊరుకున్నాను."

"శివరామ్....!" ఆశ్చర్యంగా పిలిచాడు రఘు.

"పొద్దుపోయింది రఘూ! రేపు కలుసుకుందాం." అతను జీపువైపు నడిచాడు. మౌనంగా అతన్ని అనుసరించింది రత్న. రఘుకు వెళ్తానని చెప్పటంకూడా మరిచిపోయింది.

## 16

త్రన అవసరమున్నా లేకపోయినా ఏదో ఒకటి చెప్పే శివరామ్ గంభీరంగా ఉండటం రత్నకు ఎన్నో శంకలు కలుగ



చేశాయి. అతను మౌనంగా అన్నం తిని లేచాడు. తరువాత దూరంగా ఆడుతున్న పాపను తదేకంగా చూశాడు. తను చెప్పింది విని గంభీరంగా మారిపోయారా? లేక తన రఘు ఆవేశం మరోరకంగా ఊహించారా? ఆమె హృదయం కంపించుకుపోయింది. అతను అలా ఊహిస్తె అంతకంటె అవమానము తన కేంవుంది? అతను సిగరెట్టు వెలిగించుకుని ఈజీ చైర్లో కూర్చున్నాడు. చాలా రోజులకు తనంతటతానుగా అతనికి సమీపంగా వెళ్ళింది.

"నేను రఘుగారితో మాట్లాడ్డం మీరు ఎలా అన్వయించుకున్నారో! దురుద్దేశంతో మాత్రం వెళ్ళలేదు."

"నాకు చెప్పడం దేనికి?"

అతనలా అడిగేసరికి ఆమెకు తలతిరిగిపోయింది. అప్రయత్నంగా కళ్ళవెంట నీరు జలా జలా రాలింది.

"నన్ను నమ్మండి."

"మనకు ఒకరిపై ఒకరికి నమ్మకం ఉందంటావా?"

"ఎందుకులేదు .... ఎందుకు లేదు? నేను చెప్పేది పూర్తిగా వినండి. తరువాత ఏమైనా అనండి."

"నామాట విన్నవారెవరని నేను నీమాట వినాలి? నేను చూచిందే, నాకు తోచినవిధంగా అన్వయించుకుంటాను."

"ఏమిటి మీరంటున్నది?"

"నిజమే...." అతని కంఠములో ఈసారి గంభీరత లేదు.

"సరే. నేను చెప్పాల్సింది ఏంలేదు...." క్రింది పెదవి పళ్ళమధ్య బిగబట్టి అక్కడనుండి వెళ్ళిపోయింది. పాపనుతీసి ఉయ్యాల్లోవేసి నెమ్మదిగా ఊపింది. రెండు నిమిషాలలో పాప హాయిగా నిదురపోయింది. అదిచూచి ఉయ్యాల వదిలివచ్చింది.

పడుకుందిగాని నిదురరాందే. అటు ఇటు దొర్లింది.

"ఇదిగో...." శివరామ్‌వచ్చి ఆమెదగ్గరగా కూర్చున్నాడు.

"నా పేరు ఇదిగో....అదుగో కాదు, రత్న...." అన్నది రోషంగా అటుతిరుగుతూ.

"భలేదానివి. నువ్వేగాఅంది ఆ పేరుతో పిలువవద్దని." అతని మాటలలో నవ్వు మిళితమయింది.

"నేను ఏదిచెబితే అది చేస్తున్నారా?"

"అందుకు విరుద్ధంగా ఏంచేశాను?"

"చెప్పాలంటే చాలా ఉన్నాయి."

"చాలా ఉన్నాయా? ఒకటి చెప్పుపోనీ."

"ఎందుకు చెప్పటం? మనకు ఒకరిపై ఒకరికి నమ్మకమే లేదుగా?"

"రత్నా!" అతని కంఠములో ఆప్యాయత, అనురాగం నిండుగా విన్పించాయి.

నువ్వు నన్ను నమ్మినా మానినా ఒకవిషయము చెబుతున్నాను. నీ ప్రతిపనిపట్ల నాకు గౌరవముంది. నిన్న రఘుతో వివాహవిషయము మాట్లాడి, నాకు నిజం తెలియదు. నిజంగా నువ్వు అంత నిక్కచ్చిగా జరిగిన విషయాలు చెబుతుంటే నీపట్ల గౌరవము పెరిగిందేగాని తరిగలేదు" ఆమె నడుము చుట్టూ చెయ్యివేశాడు. ఆమె హృదయం కరిగిపోయింది. అతనిచేతులలో ఒరిగిపోయి, వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎందుకు రత్నా! ఊరుకో...." ఆమె కన్నీరు మృదువుగా వత్తాడు.

"ఎందుకు....మీకెందుకండీ! ఈ దిక్కులేనిదంటే!"



"మళ్ళా ఆమాటను!" అతను ఆమెను మరింత దగ్గరకు లాక్కున్నాడు.

"నీవు దిక్కులేనిదానివి కాదు రత్నా! నీకందరూ ఉన్నారు. నిన్ను ఏడిపించి, సాయంత్రం సన్నివేశం ఆనాడు హోటల్లో జరిగినవిషయం పోల్చిచూపాలనుకున్నాను. హాస్యానికైనా....నిన్ను అనుమానించలేకపోయాను. చూచావా...."

"వద్దండీ....అన్నీ మరిచిపోండి. నన్ను క్షమించండి...." మొదటిసారిగా హృదయపూర్వకంగా అతని హృదయంలో తల దాచుకుంటూ.

"పూర్తిగా విను రత్నా! నేను విచ్చలవిడిగా తిరిగిన మాటవాస్తవమే. కాని నిన్ను ఏక్షణంలో చూచానో....ఆక్షణం నుండి మెరన్ని చూచినా, నీ అందమైన పొగరుమోతు ముఖం మెదులుతుండేది." ఆమె కన్నీరు ఒత్తుకుంటూ. నవ్వుతూ చూచింది.

"నిజం! మరి ఏ స్త్రీజోలికి పోలేదు. ఆరోజు నేను తాగి పశువులా ప్రవర్తించాననుకోకు. ఎంతత్రాగినా చక్రపాణి ఆశించినంత నిషాలోకి దిగలేదు. సాధనను ఏడిపించాలనిపించింది. ఆమెభర్త యెటువంటివ్యక్తో, అతని ఆశయము ఏమిటో తెలియజేయాలనుకున్నాను. నన్ను నమ్ము రత్నా! ఏ పనూ గను చేయమన్నా చేస్తాను. సాధనకు, క్షమార్పణకోరుతూ అసలువిషయము తెలియజేస్తూ మొన్ననే ఉత్తరం రాశాను." అన్నాడు ఆమె ముంగురులు సవరిస్తూ.

"నమ్ముతానండీ....నన్ను మీరు నమ్మండి. కోపంలో అన్నాను కాని, సంతానం చావాలని ఏ తల్లికి ఉంటుందండీ?"

"ఎలా అన్నా అశుభం జరిగిపోయింది. పోనీ సంవత్సరంనాటికి మరో బాబును...."

"పొండి...." చేత్తో అతనినోరు మూసింది.

"అయితే వెళ్తాను."

"వద్దు, మీకు దూరంగా ఉండలేను. ఉండటానికి ఎంత బాధ అనుభవించానో మీ కేం తెలుసు?"

"నేను ఆబాధ అనుభవించలేదనా?" ఇరువురూ సంవత్సరంనుంచి తమలో దాచుకున్న మాటలు ఒకరి కొకరు చెప్పుకుంటుంటే రాత్రి గడిచిందే తెలియలేదు.

మామూలుగా టీ తెస్తూ ఓ చీటీ పట్టుకొచ్చాడు రాము. అది చదివిన శివరామ్ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఏమండీ!" ఆదుర్దాగా అడిగింది రత్న.

"రఘు తమఊరు వెళ్ళిపోయాడు. వచ్చినాక మాట్లాడుదాం, అని రాశాడు."

"ఏమండీ! అత నొకవేళ మనసు మార్చుకుంటే యెలా! కారణం నేనని తెలిస్తే పెద్దలు క్షమించగలరా?"

"ధైర్యంగా అతనితో నిజం చెప్పావు. ఆ ధైర్యంతోనే అన్నీ యెదుర్కోవటానికి సిద్ధంగా ఉండు. ప్రయత్నిస్తే విమలకు భర్త దొరక్కపోడు" అతను ధైర్యం చెప్పాడు.

"ఏమో!...." ఆమెకు చాలా ఆందోళనగా ఉంది. మూడురోజులు గడిచాయి. క్షణమొక యుగంగా గడిపారు. రుక్మిణమ్మ అన్నీ కుదిరినట్టే మాట్లాడుతుంటే రత్నకు గుండె దడగా ఉండేది. అపరాధం చేసినదానిలా ముఖము మరో దిక్కుకు తిప్పుకునేది. నాల్గోరోజు ఉదయము రఘు సరాసరి



ఇంటికే వచ్చాడు. హాల్లో అతన్ని కూర్చోబెట్టి కాఫీ, ఫలహారాలు ఇచ్చింది.

"శివరామ్ లేడా?"

"పొలాలవైపు వెళ్ళారు."

ఆ తరువాత సంభాషణ పెంచడం ఇద్దరికీ చేతకావటం లేదు. రత్న మొదట అడిగింది:

"ఇంటిదగ్గర అంతా క్షేమమా?"

"అంతా క్షేమమే. ఇద్దరి చెల్లెండ్ల వివాహం రెండు గంటల తేడాలో కుదిరింది. శివరామ్ రాగానే డబ్బు తీసుకెళ్ళి కట్నం బాపతు.... వారి కడ్వాన్సు చెల్లించాలి."

"మీరు ఊరు వెళ్ళారంటే నేను చెప్పిన విషయాలు మిమ్మల్ని ప్రభావితం చేశాయేమోనని చాలా ఆందోళన పడ్డాను."

"అందులో అబద్ధం ఏం లేదు. ఆలోచించుకోవటానికి రెండు రోజులుపట్టింది. నాలాంటివాడికి ఆశలు, ఆశయాసలుండరాదు. పరిస్థితుల ప్రభావంతో జీవితం మలుపు తిరుగుతుంది గాని నా యిష్టప్రకారం కాదు. దీనివల్ల వృద్ధులు, తల్లిదండ్రులయినా తృప్తి చెందుతారు. అదేచాలు."

"మీ మనోధైర్యానికి జోహార్లు అర్పించలేకుండా ఉండలేను." ఆమె కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

"జీవితం రాపిడికి నిగ్గుతేలిన మనుషులమండీ...." బయటనుండి రాబోయిన విమల ద్వారం వెనుకే ఆగిపోయింది.

"రా విమలా!" రత్న పిలిచింది.

"నే నెందుకు?" సిగ్గుపడుతూనే వచ్చింది. రత్నకు కొత్తగా

వుంది. పాపం, తన తప్పును కప్పిపుచ్చడానికి తన అలవాట్లు కూడా మార్చుకుందేమో! ఆమెకు ఆశ్చర్యం కలిగేవిషయము ఏమిటంటే, ఒక్కసారికూడా మరిచికూడా విమల పాట ను ఎత్త లేదు.

"వదినా మరదళ్ళు యిద్దరూ మౌనము వహించారు నన్ను వెళ్ళమనా?" నవ్వుతూ అడిగాడు రఘు.

"మీరు కాస్త పాతకాలంవారు, మా మరదలేమో నవనాగరికురాలు. మరియెట్లా వేగుతారో!"

"నువ్వేమో పాతకాలందానివి." విమల బుంగమూతి పెట్టింది.

"ఫరవాలేదు లెండి. మీరు శివరామ్‌తో వేగినట్టే నేను...."

"ఏమిటీ నన్నాడిపోసుకుంటున్నారు?" శివరామ్ నవ్వుతూ వచ్చాడు.

"నూరేళ్ళ ఆయిష్షు....రా." రఘు లేచి అప్యాయంగా శివరాం చేతులుపట్టుకున్నాడు.

## 17

రఘు వారపత్రిక తిరగేస్తూ మంచంమీద దొర్లుతున్నాడు. శివరాం వచ్చాడు.

"ఏం మహాశయా! నిశ్చింతగా పడుకున్నావ్?"

"మరేంచెయ్యను? అహోరాత్రాలు చెల్లెండ్ల వివాహాలగూర్చి ఆలోచించేవాడిని, నీదయవల్ల ఆసమస్య తీరిపోయింది బావా!"



"అలా అనకు రఘూ! నే నేంచెప్పినా ముఖస్తుతి అవుతుంది. నీ విశాలహృదయానికి మేము, మాచెల్లి ఎంతో ఋణపడివున్నాము." రఘు దగ్గర కూర్చుని ఆప్యాయంగా అతని చేయి నొక్కాడు.

"అదంతా నీ సహృదయత..............పోనివ్వు. సినిమా కెళ్దామా?"

"సినిమాకుకాదు. హనీమూన్‌కు బెంగుళూరు వెల్తావా? కాశ్మీరా?"

"ఆ రెండింటిపైనా మోజులేదు. మనతోటే హాయిగా ఉంటుంది."

"ఆ సంగతి తెలుసులేవయ్యా! మా చెల్లాయికి తిరగాలని ఉందట. గారాబంగా పెరిగింది. గాభరా పెట్టకుమరి!"

"నేను గాభరాపెడితే నువ్వూరుకుంటావా? అలాగే; ఎప్పుడు వెళ్ళమంటే అప్పుడు సిద్ధం." వివాహము అయిన వారమునుండి తీరికే.

"అదే ఏఊరని? టికెట్లు బుక్ చెయ్యొద్దూ?"

"కాశ్మీర్ కే చేయించు. మీరూ రాకూడదూ?"

"ఇద్దరన్నయ్యలను, ఒదినలను, అమ్మా, నాన్నఅందరినీ పిలువవద్దూ" వెక్కిరించాడు. ఇద్దరూ నవ్వుకున్నారు.

"వెళ్ళు.... వెళ్ళి విమలను పిలువు. నువ్వు ప్రయాణానికి సుముఖంగాలేవని పెడముఖం పెట్టింది."

"చూద్దాం....అన్నాను." లేచి. బట్టలు మార్చుకున్నాడు.

"మీకోపగృహ మెక్కడ?"

"ఉద్యానవనమే...." కాఫీ పట్టించుకువస్తున్న రత్న వైపు

కొంటెగా చూచాడు.

"కోపంవస్తే నేనేమిటి అక్కడ కూర్చునేది! తమరి సంగతి తెలియనట్టు." వెక్కిరించింది. కాఫీ త్రాగి రఘునెమ్మదిగా తోటలోకి నడిచాడు. దూరంగా గులాబిరంగు పమిట కనిపిస్తుంది. అటువైపుపోయినాడు. పురుషకంఠము వినిపించగానే అనుమానంతో ఆగిపోయాడు. కోపంతో అతని ముఖం జేవురించింది. నిలబడలేనట్టు చెట్టును ఆనుకున్నాడు. అతనికి అంతా అయోమయంగా ఉంది.

"విమలా! అయిదువేలు నీ పచ్చని సంసారముకంటె యెక్కువా?"

"అయ్యో! పదివేలయినా పారేద్దును నా దగ్గరంత డబ్బేది: గోపాల్? నువ్వు చాలా దుర్మార్గుడివి" విమలవణుకుతున్న కంఠం.

"మీనాన్న నడుగు...."

"యెందుకంటే యేంచెప్పను?"

"రంకు నేర్చిన దానివి బొంకు నేర్వలేదా? యేదో చెప్పు. లేకపోతే నీజీవితం నీభర్తముందు బట్టబయలు అవుతుంది."

"గోపాల్!"

"అంత భయం దేనికి? అయిదువేలు పారెయ్యి." నిర్లక్ష్యంగా ఉంది గోపాల్ కంఠము.

"అంతడబ్బు నాదగ్గర లేదు. ఒక నెలరోజులు అయ్యాక కనపడు. ఓ వెయ్యిరూపాయలు ఇస్తాను."

"భలేమాట!" అతను పెద్దగా నవ్వాడు. "నీ మర్యాద ఖరీదు వెయ్యి రూపాయలా? సరే. నువ్వు నాతో కలిసి



తీయించుకున్న ఫోటోలు, నాకు రాసిన ఉత్తరాలు భద్రంగా మీఆయనకు పంపుతాను."

"గోపాల్! నువ్వు మోసగాడివి....రాక్షసుడివి."

"అరిస్తే నీకే ప్రమాదం. మీఆయన దేవదాసు అవుతాడు."

"ఛీ!....నన్నంటే అన్నావు. ఆయనను అనొద్దు. ఆ పేరెత్తే అర్హత లేదు."

"అచ్చు పెళ్ళాంలా మాట్లాడుతున్నావు. నీ భర్త ప్రేమంతా లక్ష రూపాయలపైన, నీపైన కాదు. రేపు నేను పంపే ఉత్తరాలు చూచాక, అప్పుడు ఆయన ఏమంటారో విని, మంచివారయిందీ లేనిదీ చెప్పు. వస్తా."

"ఆగు...." విమల అడిగింది. "ఉత్తరాలు, ఫోటోలు ఏవి?"

"డబ్బు ముట్టగానే వెళ్ళి తెస్తాను."

"డబ్బు లేదు. ఈ రవ్వల దిద్దులు అమ్ముకో. అయిదు వేలకంటే యెక్కువే వస్తాయి."

"గుడ్.... యెలాగయినా బంగారుపిచ్చుకవిసుమా! అప్పుడు స్నేహితుల మాటలువిని వదులుకున్నాను నిన్ను...."

"షటప్....ఇదిగో...."

"విమలా!...." రఘు రంగంలోకి వచ్చాడు. "ఏమిటది?"

"ఆఁ....ఏం లేదు" ఆమె ముఖం వెల వెల బోయింది.

గోపాల్ మాత్రం నిబ్బరంగా నిల్చున్నాడు.

"యెవరండీ మీరు?"

"మీ భార్యను అడగండి."

"గోపాల్! వెళ్ళిపో." ఆమె అభ్యర్థిస్తున్నట్టు చూస్తుంది.

"ఆల్ రైట్ సి యూ అగేన్." గోపాల్ వెనక్కి తిరిగాడు.

"ఆగు ..." రఘు అరిచినట్టే పిలిచాడు.

"ఏం?" నిర్లక్ష్యంగా వెనక్కి తిరిగాడు.

'మళ్ళీ రావాల్సిన అవసరం లేదు. ఈరోజు తప్పించుకున్నావు. మరోసారి ఇక్కడ కన్పించావంటే పోలీసులకు పట్టిస్తాను."

"సరే. పోలీసులకు పట్టించేపాటివాడవా?" కోపంగా వెనక్కి తిరిగి వచ్చాడు గోపాల్. ఏమంటావన్నట్టు విమల వంక చూచాడు.

"ఏమండీ...." విమల వణికే చేతులతో రఘు చేయి పట్టుకుంది.

"నువ్వుండు విమలా!" అతను కంఠము మృదువుగా మార్చి ఆమెను అనునయించాడు.

"వద్దండీ.... అతనితో విరోధం వద్దు."

"బ్లాక్ మేల్ చేసేవారితో స్నేహమెందుకు? మిస్టర్ గోపాల్! ఎందుకు చదువు చదివావు? మోసంతో బతకడం గొప్పపని అనుకోకు. ఇంజనీరువు. ఇంత నీచంగా ప్రవర్తిస్తావా? నీవు పంపే ఫోటోలు, ఉత్తరాలు భద్రంగా దాచుకో. వాటి విలువ ఒక్క పైసాకంటె తక్కువ...."

"ఆం...." విమల తల తిరిగిపోసాగింది.

"ఉత్తరాలతోనే మీఆవిడ ప్రేమాయణం ముగిసిందనుకోకు...."



"నువ్వు చెప్పవల్సిన అవసరం ఏంలేదు. అంతా నాకు తెలుసు."

"ఏం తెలుసు? మీ శివరామ్ భార్య పెంచుతుందే.... ఆ పిల్లయెవరో తెలుసా?" వెటకారంగా అడిగాడు.

"రాస్కెల్! గో అవుట్! అంతా తెలుసు. ఆ అమ్మాయి విమలకూతురు...." నిర్వికారంగా జవాబుచెప్పే అతన్ని చూచి గోపాల్ అవాక్కయ్యాడు. విమలముఖం నల్లగా మారిపోయింది. ఆమె పడిపోయేదే కాని అక్కడున్న జామచెట్టు ఆసరాగా నిల్చింది.

"ఐ సీ...." గోపాల్ వెళ్ళటానికి తిరిగాడు.

"ఒక్కమాట గుర్తుంచుకో. డిగ్రీ కోసమైనా ఈ వెధవ వేషాలుమానెయ్యి. మరోసారి ఈ ప్రాంతంలో చూస్తే పోలీసులకు అప్పజెబుతాను." రఘు మాటలు విన్పించనట్టే వెళ్ళిపోయాడు.

"విమలా!...." అతను మృదువుగా పిలిచాడు.

"వద్దు.... ప్లీజ్ అంత దయవద్దు" వణుకుతూ అరిచింది.

"దయా! అలాంటిదేం లేదు. పద ఇంట్లోకి."

"ఏమండీ.... నావిషయం...." అడుగలేకపోయింది. కుంచించుకుపోతుంది.

"నాకెలా తెలుసని అనుకుంటున్నావా? పెళ్ళికిముందే అన్నివిషయాలు నాకు తెలుసు."

"పెళ్ళికిముందే తెలుసా!" గొంతు గీరబోయింది.

"అవును. రత్న.... మీ వదిన ఇలాంటి పరిస్థితి వస్తుందని నిజంచెప్పింది."

"వదినా!" ఆమె మనసు అల్లకల్లోలమయింది. మొదటి సారిగా జీవితాన్ని గూర్చి గంభీరంగా ఆలోచించింది విమల. ఆమె కళ్ళముందే రత్న, రఘు ఎంతో ఎత్తుకు పెరిగి పోయారు. ఒకవేళ తన డబ్బునుచూచి పెళ్ళాడితే, ప్రవర్తనలో నిర్లక్ష్యం. ముఖంలో నిరాశ ఉంటుంది. రఘుముఖంలో అలాంటిదేం లేదు. తనను ఎంతో ప్రేమగా లాలించి ప్రేమించాడు. అదంతా నటనా? నటకునికళ్ళు అంత నిర్మలంగా వుండవు.

"ఏమిటి విమలా అలా చూస్తున్నావు?"

"ఏంలేదు...." అతన్ని తప్పించుకుని ఇంట్లోకి చరచరా వెళ్ళిపోయింది. ఒక గాఢమైన నిట్టూర్పువదలి అతను ఇంటివైపు దారితీశాడు.

"మరదలు ఇంకా అలక మానలేదేమిటి?" నవ్వుతూ రత్న అడిగింది.

"ఆడవారి...." తరువాత మాట పూర్తి చెయ్యకనే విమల గదివైపువెళ్ళాడు. ఆమె మంచముపై పడి ఏడుస్తుంది.

"విమలా!" అతను దగ్గరగాకూర్చున్నాడు. తలెత్తి అతని వంకచూచింది. తెల్లని ధోవతీ, లాల్చీలో అతను మహాపురుషుడిలా కన్పించాడు. ప్రతిదీ క్షుణ్ణంగా ఆలోచించే వారితో చిక్కువుండదు. ప్రతిదీ నిర్లక్ష్యంగా త్రోసివేసి ఎప్పుడో క్షుణ్ణంగా ఆలోచించేవారితో కష్టం. విమలకూడా తన ఇరవై మూడేళ్ళ జీవితంలో మొదటిసారి మంచి చెడ్డల తూకం వెయ్యసాగింది.

"లే విమలా! మా అన్నయ్య మనకోసం కాశ్మీరుకు టికెట్లు బుక్ చెయ్యడానికి వెళ్ళాడు."



"ఆఁ...." అంది అతన్ని చూస్తూ.

"ఏమిటా పిచ్చిచూపులు! అంతా మరిచిపో. భవిష్యత్తు గుర్తుంచుకో. త్వరగా తయారవ్వు. రవీంద్రభారతిలో మంచి నాట్యం ఉంది వెళ్దాం. గంధంరంగు చీర.... ఆ రోజు కట్టావే, అది కట్టుకో." అన్నాడు. విమల మరీ కుంచించుకుపోయింది.

"నా కెక్కడికీ రావాలని లేదండీ...."

"అయితే నాకు కోపం వస్తుంది."

"ఈ ఒక్కరోజు క్షమించండి."

"అదేం లేదు." ఆమెను దగ్గరకు లాక్కోబోయాడు.

"ఒక్కమాట చెప్పండి" అన్నది అతని చేతిని మృదువుగా విడిపించుకుంటూ.

"ఏమిటి?"

"నేనంటే అసహ్యంగా లేదూ?"

"నేను చెప్పిందంతా మరిచిపోయావా? అంతా మరిచిపో. ప్రతిమనిషీ తప్పుచేస్తాడు. తప్పు క్షమించిననాడే మానవుడు."

"కాదు దేవుడు...." కన్నీరు ఒత్తుకుని అంది.

"సరే ఏదోఒకటి లే." అతను లేవదీశాడు. బలవంతంగా తయారు చేశాడు. అతనలా వెనకాలే తిరుగుతూ ఉంటే ఎన్నిజన్మలయినా అతని ఇల్లాలుగా ఉండాలని వుంది.

"మా మరదలు కోపగృహం వదిలిందే!" నవ్వుతూ రత్న ఎదురు వచ్చింది.

"వదినా!" రత్న భుజంపై తలవాల్చింది.

"ఏమిటి విమలా? ఏం జరిగింది?"

"లేదు....ఏంలేదు వదినా!" అని దూరంగా జరిగింది. భర్తవంక చూస్తూ 'పదండి' అన్నది. ఇద్దరూ వెళ్ళిపోయాక రత్న నవ్వుకుంది. పదకొండు గంటలు దాటాకకూడా రత్న చదువుతూ కూర్చుంది.

"పడుకుందూ!" విసుగ్గా అన్నాడు శివరామ్.

"పుస్తకం చాలా బావుంది."

"ఇంటిపనులమీదా పుస్తకాలమీదా ఉన్న శ్రద్ధ భర్తపై యెందుకుంటుంది?"

"అలాగా?" అంది నవ్వుతూ.

"కాకపోతే? ఆడబడుచు పెళ్ళంతా నువ్వే చేసినట్టు, నేను నిదుర లేవకముందే గదిలోంచి మాయమయి, నేను నిదురపోయాక గది చేరేదానివి...."

"ఇంత గోలదేనికి? పుస్తకం మూస్తున్నాను సరా...." పుస్తకం మూసి టేబుల్ లైటు ఆర్పేయబోయింది. తలుపుపై టకటక మన్న శబ్దం అయింది.

"రాము అయ్యుంటాడు...." అలా వచ్చి అప్పుడప్పుడు మంచినీళ్ళు పెట్టి వెడతాడు. లేచి తలుపు తీసింది. విమల నిల్చుంది.

"రా విమలా!...." దారి వదిలింది. శివరామ్ లేచి కూర్చున్నాడు. విమల లోపలికి వచ్చింది. సరాసరి పాప ఉయ్యాల దగ్గరకు వెళ్ళింది. నిదురబోతున్న పాపను తీసి యెత్తుకుంది. నిదురలో లేచింది, అందులో ముఖం క్రొత్తగా కన్పించిందేమో, బావురుమంది పాప.



"లేదు ... లేదమ్మా.... నేను ఏం అనలేదు." అంటూ సముదాయించసాగింది.

"రఘు నిదురబోయాడా విమలా?"

"లేదన్నయ్యా.... ఊరోఁ....ఊఁ...." అంటూ పాపను ముద్దుపెట్టుకుంది. ఏడ్పు హెచ్చిందేగాని తగ్గలేదు.

"రామ్మా..." అంటూ రత్న అందుకుంది. పాప రత్నను కరుచుకుపోయి ఏడ్పు మానింది. దంపతులను ఆశ్చర్యపరిచిన విషయమేమంటే, ఇన్నాళ్ళకు పాపపై ధ్యాస యెలా కల్గిందా అని. ఆశ్చర్యం కప్పిపుచ్చింది రత్న.

"ఆయనొక్కరున్నారు వదినా ..." అనేసి త్వరగా గదిలోకి వచ్చేసింది.

"నిద్రొస్తుంది. లైటుతీసేయి" రఘు అన్నాడు. అతనప్పటికే పడుకున్నాడు. లైటుతీసి టేబుల్ లైటువేసి వచ్చింది. అతను ఆమెను కాంక్షతో చేరబోయాడు.

"ప్లీజ్! ఈరోజు నా మనసేం బావుండలేదు...." అతన్ని తప్పించుకుంది. కొంచెం దూరం జరిగింది.

"నేను చెప్పింది మరిచిపోయావా? నా దగ్గరకు రా. అన్నీ మరిచిపోతావు."

"వద్దండీ ...ఇంత మంచితనం భరించలేను. తిట్టండి....కొట్టండి...." అన్నది బావురుమంటూ.

"ఊరోఁ. ఇక నువ్విలా బాధపడితే తిట్టాల్సిందే."

"ఇంత....వద్దండీ! క్షమకు, సానుభూతికి హద్దుండాలి."

"హద్దుమీరి యెవరూ ప్రవర్తించలేదు" అతను ఆమె తల నిమిరాడు.

"పొరపాటు అందరివల్లా జరుగుతుంది." అతనెంతో

ఓదార్చాడు. కన్నీరు తుడిచాడు; కాని హృదయంలోని పంచలనాన్ని చల్లార్చలేకపోయాడు. అలా ఇద్దరూ యెప్పుడు నిద్రపోయారో!

ఉదయము లేచి రఘు, శివరామ్ హనీమూన్ ట్రిప్పును గూర్చి చర్చించుకున్నారు.

"ఇక మీదే ఆలస్యం....ఎప్పుడు బయలుదేరుతారు!"

"అది విమలను అడుగు. నిన్న గోపాల్ వచ్చినట్టున్నాడు. తను బాగా అప్‌సెట్ అయింది."

"రాస్కెల్!...." తిట్టాడేగాని, శివరామ్ ముఖం మలినమయింది. తన పై నేగాని....తన స్నేహితుడు....

"రఘూ! నువ్వేమయినా అన్నావా!"

"అంటానని అనుకున్నావా ?"

"లేదులే." ఇద్దరూ కూర్చుని కాఫీ త్రాగారు.

"పడమటిదిక్కు పొలంలో యెరువులు వేయించాలి. ఈరోజు వచ్చి అదంతా చలమయ్యకు చెప్పాలి."

"అదంతా నేను చూచుకుంటాను. నువ్వు హాయిగా తిరిగిరా." శివరామ్ హామీయిచ్చాడు. శ్రీపతిగారుకూడా వచ్చి వ్యవసాయంలోని కష్టనిష్ఠురాలనుగూర్చి చర్చించారు.

"ఈపిల్ల ఇంకా నిద్రలేవలేదు. యెలా బ్రతుకుతుందో!" చిరుకోపం మిశ్రమైన కంఠంతో పలికింది రుక్మిణమ్మ. అప్పుడే రత్న కెవ్వున అరిచింది. అందరూ అటు వెళ్ళారు. ఆమె విమల పడకగదిలో ఉంది. విమలను అటూ యిటు కుదుపుతుంది.

"అత్తయ్యా! ....విమల....విమల నిదురమాత్రలు మింగింది."

"ఆ...." ఆమె కూతురుమంచంపై కూలబడింది.



"నా గదిలోని నిదురమాత్రలసీసా ఇక్కడ కెలా వచ్చింది?" శ్రీపతిగారు ముందుకువచ్చారు. నిమిషములో ఇల్లంతా గందరగోళంగా తయారయింది. వెంటనే విమలను ఆస్పత్రిలో చేర్పించారు.

విమలను ఆసుపత్రికి చేర్పించారు. అప్పటికే సమయము మించిపోయింది. నవవధువు విమల ...వారం రోజులు వివాహ జీవితం అనుభవించిన విమల అత్తగారింటికి పోవటానికి బదులు పరలోకం ప్రయాణం అయింది. రఘు రాయిలా ఉండిపోయాడు. కొన్నిసార్లు మంచితనంకూడా ప్రమాదాలకు దారి తీస్తుందని మొదటిసారి తెలుసుకున్నాడు. కూతురికోసం రోదించే తల్లిదండ్రులను చూడలేక ఆస్పత్రి వార్డు వదిలి బయటికి వెళ్ళిపోయాడు.

# 18

"రత్నా!" బయటినుండే పిలుస్తూ వచ్చాడు శివరామ్.

"నాన్నా!" అంటూ మానస యెదురు వచ్చింది. ఆ పిల్లను యెత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"అమ్మేది?"

"అమ్మ ...తమ్ముళ్లు .... అబ్బి...." చేత్తో యెటో చూపించింది. సంవత్సరం కొడుకును యెత్తుకుని రత్న వచ్చింది.

"మనూ!....ఏడుస్తుందనుకున్నాను. బాబుకు నలతగా ఉంటే డాక్టరుదగ్గరకు తీసుకెళ్ళాను. మానసవస్తే ఇద్దరూ గంతులేస్తారు"

"మానస ఆడుకుంటుంది చక్కగా, కదమ్మా."

"ఊఁ...."నవ్వింది పసిపిల్ల.

"రత్నా! సాధన ఉత్తరము రాసింది. తనేదో నర్సరీ స్కూల్ పెట్టబోతుందట. గురువారం సాయంత్రం ప్రారంభోత్సవమట. మనల్ని తప్పకుండారమ్మంది." రత్నముఖం గంభీరంగా మారిపోయింది.

"ఈరోజు వార్తాపత్రిక చూశారా?"

"లేదు. ఏం?"

"ఇదిగో చూడండి." మొదటిపేజీలో చక్రపాణి, మరో యువతి ఫొటో వుంది. మెడనిండా పూలదండలతో, చిరునవ్వులు చిందిస్తున్నారు.

"శ్రీయుతులు చక్రపాణిగారు సహృదయులు, సదాచారపరాయణులు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, పూజ్యులగు బాపూజీ అడుగుజాడలలో నడిచే పురుషులని తమ వివాహంద్వారా ప్రకటితంచేశారు. వీరు సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ గారు. బాల్యవితంతువు అయిన సువర్చలాదేవిని వివాహం చేసుకున్నారు. వారి వివాహమునకు పలువురు పెద్దలు విచ్చేసి, ఆశీర్వదించారు. దంపతులను అభినందించారు...." చిరాకుగా పేపరు మడిచి అవతల పడేశాడు.



"ఇలాంటివారిగురించితప్ప నిజమైనవార్తలు లభించవు కాబోలు?" రత్న నిట్టూర్చింది.

"వాడు ఒక వితంతువును వివాహం చేసుకున్నాడంటే, దానివెనకాల ఏదో కథ ఉంది. ఆవిడ చాలా ధనవంతురాలయి ఉంటుంది."

"పాపం! సాధన ఏంపాపం చేసిందని దానిజీవితం ఇలా అయింది?"

"విధి....అంతకంటె ఏం చెప్పలేము. సాధనలాంటివారు ఎందరులేరు ఈ ప్రపంచములో?"

"గురువారం తప్పక వెళ్దామండీ! పాపం ఇలాగైనా దాని జీవితము ఓ దారినపడితే నయమే." అన్నది రత్న.

"రఘు వచ్చి వెళ్ళాడు. మిమ్మల్ని చూడటానికి మరోసారి వస్తానన్నాడు."

"అతని ఉద్యోగం యెలావుందట?"

"బాగానేవుందట. ఇప్పటికైనా మించిపోయిందేం లేదు. వ్యవసాయం చేద్దాం రమ్మన్నాను. అతను అంగీకరించలేదు. గతము అంతా మరిచిపోగల్గిననాడు వస్తానన్నాడు."

"మళ్ళీ వివాహము చేసుకోడటనా?"

"[illegible]గాను, తల్లిదండ్రులను సంతోషపెట్టడానికయినా చేసుకోవాలని అన్నాడు. చేసుకుంటాడనుకుంటాను."

రఘు తనకంటే, తనవారికే ఎక్కువ ప్రాముఖ్యత యిస్తాడు."

"అందుకే ఇన్ని సమస్యలు" ఓ నిట్టూర్పువదిలాడు.

"ఎంత ఆలోచించినా విమల ఆత్మహత్యకు కారణం ఊహించ లేను రత్నా! కన్యగా ఉండి గర్భవతి అయినప్పుడుకూడా అధైర్యపడలేదని చెబుతుంటివి."

"అది నిజమే. విమల జీవితాన్ని తేలికగా తీసుకుందని అనుకున్నాం. కాని ఆమెలో దాగిన అభిమానము మనము గుర్తించలేదు. రఘు హింసించి, అపహాస్యంచేస్తే ఆమె తట్టుకునేది. అతని విశాలహృదయంలో ఇముడలేకపోయి...."

"ఆ రాస్కెల్ గోపాల్ రాకపోతే అంతపని జరిగేది కాదేమో."

"అని మనము అనుకుంటాము. విధి లిఖితం అలావుంది. మరొక్క మాటండీ! మీరేమనుకున్నా సరే. మన మిక ఈ ఇంట్లో ఉమ్మడిగా ఉండరాదు. ఈరోజు మీ పెద్దవదిన మానసను ఏమేమో అంది. ఈ సంవత్సరం చిన్నపిల్ల. పెరుగుతూ ఉంటే ఎంత బాధపడుతుందని!"

"మానసకు కష్టం కల్గేచోట ఉండాలని నాకేం లేదు రత్నా!" ఇద్దరూ ఇద్దరు పిల్లలు చెప్పే కబుర్లు విన్నారు. మానసను విమల కన్నదే కాని, మాతృప్రేమను రంగరించి పోసింది రత్న. తనకొడుకుకన్న మానసంటే ఎంతో ప్రేమ ఆమెకు. శ్రీపతిదంపతులు అంతులేని కృతజ్ఞతాదృక్కులతో ఆమెను.... తమకోడలిని....స్త్రీ....పరిపూర్ణత్వాంగల స్త్రీగా చూస్తారు. ఆశీర్వదిస్తారు.

గురువారం సాయంత్రం పిల్లలతో హైద్రాబాద్ చేరుకున్నారు. క్రొత్తగా కట్టిన చిన్న ఇంటిముందు షామియానా



కట్టబడివుంది. రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. కారు ఓ పక్కన పెట్టి లోపలికి వెళ్ళారు.

"ముందుగానే వచ్చారే...." నవ్వుతూ సాధన ఎదురు వచ్చింది. ఆడంబరాలు, అతిశయాలు, ఆశలు అడుగంటిపోగా, మిగిలిన శిల్పం. తెల్ల మిల్లుచీర, మోచేతులవరకు ధరించిన తెల్లని జాకెట్టు, పొడుగాటి జుట్టును ముడివేసుకుంది. చేతులకు రెండేసి మట్టిగాజులు, నుదుట ఎఱ్ఱకుంకం బొట్టుతో పెద్దమనిషిలా కన్పిస్తుంది. వచ్చేదుఃఖాన్ని అణచుకొని "సాధనా...." అంటూ కౌగలించుకుంది.

"ఏమిటే సెంటిమెంటల్ ఫూల్....బావగారూ! బాబిగాడిని నాకు దత్తు ఇవ్వాలి...." నవ్వింది సాధన. ఆ నవ్వు వెనకాల అగాధం అందరికీ తెలుసు.

"అక్కయ్యకు నా సగం పోర్షన్ అమ్మానే. ఈ స్థలం కొని, బస్తీకి అనువుగా ఉంటుందని ఇలా కట్టించాను...." ఆవరణ అంతా తిప్పింది. హెచ్ ఆకారంలో కట్టింది. మధ్య రెండుగదులు తనకట మిగిలిన ఆరుగదులు క్లాసులకు కేటాయించింది. వెనకవైపు ధనలక్ష్మి, సుందరమ్మ ఫలహారాలు చేస్తున్నారు.

"పిన్నీ! ఎవరొచ్చారో చూడు...." సాధన మాటలకు సుందరమ్మ ఇటుతిరిగి చిరునవ్వుతోనే అందరినీ పరామర్శించింది.

"ఏరా తాతా!" అంటూ ధనలక్ష్మి రత్న కొడుకును ఎత్తుకుని ముద్దాడింది.

"రత్నా! ఎప్పుడొచ్చావే...." ఆనందంగా పరుగెత్తు

కుంటూ వచ్చింది రజని. ఆమె వెనకాలే ఇద్దరి కొడుకులను జాగ్రత్తగా నడిపించుకుని వచ్చాడు రంగారావు.

"పది నిమిషాలు అయిందక్కయ్యా...." శివరామ్ ఉత్సాహంగా రంగారావుతో కబుర్లు మొదలుపెట్టాడు.

"ఏమే నల్లపూసవయిపోయావు?"

"పిల్లలతో తీరికేది అక్కయ్యా! అత్త, మామ-విమల పోయాక చాలా దిగులుగా ఉంటున్నారు. వారి కేదో చదివి వినిపిస్తూ ఉంటాను. అకస్మాత్తుగా మా గుమస్తాగారు రాని రోజు ఆ పనులన్నీ నా నెత్తిన రుద్దుతారు మీ మరిదిగారు."

"ఎంత నెఱజాణవే!" నవ్వింది రజని.

"నువ్వు మాత్రం! పర్దాచాటున బ్రతకమనే బావను మార్చలేదూ? ఎలాఉంది ఉద్యోగం?"

"నేను కాదే చిట్టితల్లీ! పరిస్థితులు మార్చాయి. హాయిగా ఉంది"

"రోడ్డుపై వెళ్ళేవాడిని చూచావని ఇంకా తగవు వేసుకుంటారా?"

"మనసులో అనుకుంటారేమోగాని బయటకి తేలరే."

"అక్కయ్యా....ఓయ్ రత్నా! నా పతి రాక్షసుడు, సంఘసంస్కర్త, ఆదర్శపురుషుడేవ్ ...." సాధన నవ్వబోయింది.

"పేపర్లో చూచామే." అన్నారిద్దరూ.

"ఇంకెన్ని అవతారాలెత్తాలో!"

"పోవే. అతని ఊసు ఎందుకు? నీకు తగినవాడు దొరకడా!"



"తగినవాడు, తన్నేవాడు...ఆ శ్రీరామచంద్రమూర్తి వచ్చినా నా కొద్దే రత్నా! వివాహజీవితం అన్నా, పురుషులన్నా నాకు పరమ అసహ్యం...." సాధన చెప్పింది.

"ముగ్గురూ, ముగ్గురే. అలా అల్లుండ్లను నిలబెట్టి ఏం మాటలే? గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకోండి." ధనలక్ష్మి కేక వేసింది.

"నీ అల్లుళ్ళు అరిగిపోరులేవే!" సాధన పరిహాసం చేసి, అందరినీ గదిలోకి తీసుకువెళ్ళింది.

"మీరు మాట్లాడుతూ ఉండండే. ఇప్పుడే వస్తాను." సాధన వెళ్ళిపోయింది.

మొగవారు వారి కష్టనిష్ఠురాలు చెప్పుకుంటున్నారు.

"ఏమో శివరాం! న్యాయంగా వుంటే పై అధికార్లకు లోకువ, యిటు క్రిందివారికి చులకన. అన్యాయంగా ఆర్జించలేము. మీ పనే హాయి."

"రంగా! అలా అనకు. దాంట్లో ఉండే కష్టసుఖాలు చెబితే భారతం అవుతుంది. చక్రపాణిలాంటివారికి ఏచోటయినా, ఏఉద్యోగమైనా బ్రతకటం తెలుసు."

"ఏదో సరదాకి చిన్న అబద్ధాలు ఆడుతాడని తెలుసుగాని, ఇంతకు తెగిస్తాడనుకోలేదు. పాపం! సాధన జీవితము పాడుచేశాడు." "పోనివ్వండి బావా! ఇక ఈసానుభూతిభరించే శక్తిలేదు." అక్కడకువచ్చిన సాధన అంది. ఆమె వెనకాలే కిషోర్ కూల్ డ్రింక్స్ ఉన్న ట్రే పట్టుకుని వచ్చాడు. అతనిభార్య కూతుర్ని ఎత్తుకుని వచ్చింది. "ఓరేయ్ అన్నయ్యా! ఉద్యో

గము చేస్తున్నా నీ అలవాట్లు మానలేదట్రా?" రత్న నవ్వింది.

"ఏమమ్మా మరదలా! మావాడిచేత పనిచేయిస్తున్నావ్?" రజని అడిగింది. "నేను చెయ్యమని అడగలేదండోయ్ ఆడబడుచుగారూ! మీతమ్ముడే ముందుకువస్తారు ప్రతిపనికీ నేనంటూ." కిషోర్ భార్యంది.

"ఏరా అన్నయ్యా! మీ ఆవిడకు నోరుయెక్కువ...." రత్న నవ్వింది.

"అందుకే మనము తగ్గివుంటాము" అన్నాడు కిషోర్.

"ఒరేయ్ మీఆవిడ నెల్లూరిదిట్రా?"

"పో అక్కయ్యా! తెలియనికాలంలో ఓపిచ్చివుండేది."

"తరువాత కబుర్లు. అవతల పెద్దలు వస్తున్నారు." ఎస్. ఎస్. రావుగారు హడావుడిగా వచ్చారు. మంత్రిగారు, వారి పతీసమేతంగా విచ్చేసి 'సాధనామందిరం'ను పావనము చేశారు. ప్రారంభోత్సవము, ఫలహారాలు. ఉపన్యాసాలు ముగిశాయి. వచ్చిన అతిథులు వెళ్ళిపోయారు. కుటుంబసభ్యులంతా భోజనాలుచేశారు. 'వీలయినంత సాయంచేస్తాం' అని సాధనకు ప్రమాణాలుచేశారు. అటు, ఇటు హడావుడిగా తిరుగుతున్నా కూతురు జీవితము ఇలా అయిందే అని ఎస్. ఎస్. రావుగారి హృదయము కలతచెందుతూనే ఉంది.

అందరూ వీడ్కోలు తీసుకున్నారు. శివరాం పిల్లలను



వెనకసీట్లో పడుకోబెట్టి వచ్చేసరికి రత్న, సాధన ఒకచోట ఉన్నారు.

"రత్నా! పిన్ని నాదగ్గరుంటే నీకేమయినా అభ్యంతరమా?"

"సాధనా!"

"అభ్యర్థిస్తున్నానే. ఒంటిగా ఉండగలనుకాని ఓతోడుంటే మరీబెంగగా ఉండదే."

"అక్కయ్యా! నన్నెంత అపార్థం చేసుకున్నావే."

"అపార్థంకాదే. అభిమానధనురాలివి."

"ఒక్కమాటన్నా ఒట్టే. సుందరమ్మ మీ అమ్మే. మరో ఆరునెలలు గడిచాక బాబును వదులుతాను. నీయిష్టం" అన్నది సాధన భుజాలుపట్టుకుని.

"అబ్బో కబుర్లు! బావగారు ఊరుకుంటారా?"

"సాధనా! అలాంటి సంకోచాలేంవద్దు. రత్న మాటకు వ్యతిరేకము చెప్పడము అంటూ జరగదు. నా జీవితము తను నిర్మించిన సౌధం," శివరాం చెప్పాడు.

"థాంక్సబావా!...." కన్నీటితో. అందరికీ వీడ్కోలు ఇచ్చింది.

"రత్నా! ఏమిటాలోచిస్తున్నావ్?" కారు సాగిపోతూంది. శివరాం అడిగాడు.

"ఏంలేదు." అతనికి తెలుసు, గతించిన జీవితము పునర్విమర్శ చేసుకుంటుందని. నెమ్మదిగా ఆమె భుజాలచుట్టూ చేయి వేశాడు.

మర్నాడు ద్రాక్షతోటలదగ్గర పనులు చూసుకుని, అక్కడ నిర్మించదలచిన బంగళా ప్లాను పరిశీలించసాగేరు శివరామ్ దంపతులు.

"అమ్మా, యెవరో వచ్చారు." పనివాడు చెప్పాడు.

"నువ్వెళ్ళి మాట్లాడు రత్నా! నేను వీరందరికీ డబ్బులిచ్చి వస్తాను." శివరాం చెట్టుక్రిందే కూర్చున్నాడు. రత్న పెడ్డులోకివచ్చింది. అక్కడ కూర్చున్న వ్యక్తినిచూచి ఉలిక్కిపడింది.

"నువ్వా!" ఆమె ముఖం కోపముతో జేవురించింది. "త్వరగా వెళ్ళిపో. నీ అదృష్టము బాగుంది, ఆయన రాలేదు. నిన్నుచూస్తే చంపేస్తారు."

"నాగరత్నంగారూ! క్షమించండి. నావల్ల పెద్దపొరపాటు జరిగిపోయింది. నేనుచెప్పేది వినండి" లేచి ప్రాధేయ పూర్వకంగా అడిగాడు గోపాల్.

"నువ్వుచెపాల్సినవీ, మేము వినాల్సినవీ ఏంలేవు. ఆయన ని న్నేంచేస్తారో ఊహించగలవనుకుంటాను."

"కొడతారు. సిద్ధంగావున్నాను. నామాట వినండి. నాభార్యకు గర్భకోశములో కేన్సరట. మాకు పిల్లలు అయ్యే అవకాశంలేదు. పాపనిస్తై...."



"ఛీ. అలా అడగడానికి నోరు యెలావచ్చింది? పాప! అలా పాపనిచ్చేవారమైతే, లోకం కాకులై కూస్తున్నా ఎందుకు పెంచుతాం? ఏ అనాథ ఆశ్రమములో విడిచేవారమో. వెళ్ళిపో గోపాల్ వెళ్ళిపో. విమలను బలి తీసుకున్నావ్. నీ భార్యకు ఏమైతే నీకేం? హాయిగా మరోవివాహం చేసుకో."

"ఏమండీ! ...." దీనంగా చూచాడు.

"ఆ కల్లబొల్లి మాటలు యెందుకు? విమలతో ప్రేమ కలాపం, అటు మరో అమ్మాయితో నిశ్చితార్థం, మూడో అమ్మాయితో వివాహాము చేసుకున్న ఘనత నీకే దక్కింది. ఇన్ని చేయగాలేనిదిమరోవివాహం పెద్దసమస్య ఏంకాదు."

"అంతేనంటారా?" అతని కళ్ళల్లో నీరూరింది.

"మీలాంటి వారికి కన్నీరు శోభించదు." అంది వెటకారంగా.

"విమల అలా చేస్తుందనుకోలేదండీ...."

"నువ్వేలా అనుకున్నా జరిగిపోయేది జరిగిపోయింది. త్వరగా వెళ్ళిపోవటం అందరికీ క్షేమము. యూనివర్సిటీలలో డిగ్రీలు సంపాదించటం గొప్పకాదు. కనీసపు మనుష్యులకుండే మంచి. చెడు లేకపోయాక యెందుకు బ్రతుకులు!"

"నాబాధ అర్థం చేసుకుంటారని...."

"అంత దయార్ద్రహృదయులు ఎవ్వరూ లేరు. వెళ్ళిపో." అతను లేచి వెళ్ళిపోయాడు.

మరో పదినిమిషాలకు శివరామ్ వచ్చాడు. అతను రత్నను చూస్తూ ఆగిపోయాడు.

"రండి. అలా చూస్తారేం? పిల్లల గోలచేస్తుంటారు. వెళ్ళాలి."

"నువ్వు అంత కోపంగా ఉన్నావేమిటి?"

"కోపంగా ఉన్నానని నాముఖంపై రాసిఉందేమిటి?" నవ్వుతూ అడిగింది.

"నీకోపాలు, తాపాలు నాకంటె మెక్కువ మెవరికి తెలుసు?" దగ్గరగా వచ్చి ఆమె కళ్ళల్లోకి ఆరాధనాపూర్వకంగా చూచాడు.

"ఎవరో వచ్చారని నౌకరు చెప్పాడే, మెవరు?"

"మెవరో పనికిమాలినవారు. పదండి." అన్నది మృదువుగా అతనిచేయి నొక్కుతూ.

"చండాలవారా ఏమిటి? అంతకోపం వద్దు రత్నా! మెవళ్ళ పొట్టతిప్పలు వాళ్ళవి."

"సరే; నాకు ఆకలిగాఉంది. మనపొట్ట మనము చూసు[illegible]గాం రండి" ఇద్దరూ జీపుదగ్గరకు నడిచారు.

—o—